ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం : fb.com/vaartha Digital
Published from Srikakulam ,Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
12-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 193 పేజీలు: 16 వెల: 6.50

నేడు శాంతిభద్రతలపై సీఎం చంద్రబాబు సమీక్ష 3లో

బ్యాంకాక్ బాధితులను స్వస్థలాలకు రప్పించేందుకు చర్యలు: మంత్రి లోకేష్

పార్లమెంటు ఇక రెండు రోజులే..

# కీలక బిల్లులు గట్టెక్కేనా?

## డీలిమిటేషన్, ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లులపై ఇంకా ప్రతిష్టంభన



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెడతారని భావిస్తున్న రెండు కీలక బిల్లులపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఈరెండు బిల్లులు ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని ఎన్డీయే పక్షం యోచిస్తుంటే ఎట్టిపరిస్థితుల్లోను వీటిని ఆమోదింపచేయకూడదన్న పట్టులో విపక్షాలు ఇండియా కూటమి పార్టీలు మొండపట్టుతో ఉన్నాయి. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుతోపాటు డీలిమిటేషన్ బిల్లును ఈసమావేశాల్లోనే ప్రవేశపెట్టాలన్నది ఎన్డీయే పక్షం ఆలోచన. ఇందుకోసం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్‌రిజిజు విపక్ష నేతలతో సంప్రదింపులు జరిపినా విపక్షాలు నీట్ అల్లర్లు, అరెస్టులు, లాఠీఛార్జిలతోపాటు అయోధ్య విరాళాల చోరీపైనే ముందు చర్చ జరపాలని,పార్లమెంటులోమోడీ, అమిత్‌షాలు క్షమా పణ చెపితేనే సజావుగా సాగుతాయన్న హెచ్చరికలుచేస్తుండటంతో ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఎఫ్‌సిఎన్‌ఆర్‌ఎ బిల్లును పంపించాలనినిర్ణయిస్తోంది. కేవలం రెండే రెండురోజులు ఇక వర్షాకాల సమావేశాలు జరుగుతాయి. ఈ లోపే ఈ రెండు బిల్లులను ఆమోదింపచేసుకోవడం అనేది ఎన్డీయే పక్షానికి కత్తిమీద సాములాంటిదే. ముందురోజు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలోకూడా ఈ రెండు బిల్లుల ప్రస్తావనకు రాలేదు. దీన్నిబట్టి ఈ సమావేశాల్లో ఉండకపోవచ్చన్న భావన కూడా అధికారపక్షంలోనే నెలకొంది. ఏది ఎలా ఉన్నా ఉభయసభల్లో ఈ రెండు బిల్లులను ఈసమావేశాల్లోనే ఆమోదింప చేసు కోడానికి ఎన్డీయే పక్షం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే కొన్ని విపక్షాలు బిల్లును విత్‌డ్రాచేసుకోవడం లేదా జెపిసికి పంపిం చాలని డిమాండ్‌చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ చట్టంలోనిసెక్షన్ 15 తొలగించాలని డిఎంకె ఇప్పటికే డిమాండ్‌చేస్తోంది. కాంగ్రెస్, ఎస్పీ వామపక్షాలు కూడాఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాయి.



స్వాతంత్ర్య దినోత్సవం వేళ

# 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ ప్రజలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ కొత్త వీడియోను విడుదల చేసి ప్రజలను ఉద్దేశించి ఈ విజ్ఞప్తి చేశారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని మోడీ అన్నారు. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన అమర వీరులకు నివాళులర్పిస్తూ, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి సంకల్పం తీసుకోవాలని పిలుపునిచ్చారు. 'హర్ ఘర్ తిరం'గా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవంగా జరుపుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, మంగళవారం పార్లమెంట్‌లో జరిగిన అధికార ఎన్డీఏ కూటమి వారపు పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోడీ హాజరైన సందర్భంగా ఎన్డీఏ ఎంపీలు, కేంద్రమంత్రులు జాతీయ జెండాలు ఊపుతూ ఆయనకు ఘన స్వాగతం పలికారు. వందే మాతరం, భారత్ మాతాకీ జై నినా దాలతో హోరెత్తించారు. పార్లమెంట్ లైబ్రరీలోని జీఎంసీ >>2

ఎల్‌నినో సంక్షోభంలోనూ

# 10.7% వృద్ధి

## విద్యుత్ వినియోగంలో 13.7, ఖనిజాల్లో 32.8శాతం

## గణనీయంగా పెరిగిన దేశీయ, విదేశీ పర్యాటకులు

## వివిధ రంగాల్లో పెరుగుదలపై ఆర్థిక నివేదిక సిఎంకు అందజేత

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా నిలకడైన వృద్ధి నమోదు చేస్తోందని జులై 2026 నెలవారీ ఆర్థిక నివేదిక స్పష్టం చేస్తోంది. గడచిన రెండేళ్లుగా జాతీయ వృద్ధి రేటు కంటే ఏపి వృద్ధిరేటు మెరుగ్గా నమోదు అవుతోంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తి వాస్తవ వృద్ధి రేటు 2023-24లో 6.5శాతం నమోదు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో 9.9శాతానికి పెరిగింది. రాష్ట్రంలోని వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదు అవుతున్నట్టు నెలవారీ ఆర్థిక నివేదిక పేర్కొంది. ఈమేరకు సిఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు 2026 జులై ఆర్థిక నివేదికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందించారు. 2026 జూన్‌తో పోలిస్తే పారిశ్రామిక ఉత్పత్తి 8.2శాతం మేర పెరిగిందని నివేదిక పేర్కొంది. ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలానికి సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి 89,383 మెట్రిక్ >>2

# లక్ష్యం మరువద్దు!

## 15శాతం వృద్ధిరేటు సాధించేలా సమగ్ర ప్రణాళికలు

## సామాన్యుడిపై ధరల భారం లేకుండా కార్యాచరణ

## ఆర్థిక, ప్రణాళికా విభాగం అధికారులకు సిఎం ఆదేశం

## జిఎస్‌డిపి, నెలవారీ ఆర్థిక నివేదికపై చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్ నినో లాంటి సంక్షోభ సమయంలోనూ రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలను చేరుకునేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రణాళికా విభాగం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు వెళ్లాలని సిఎం సూచించారు. వాణిజ్య పన్నుల శాఖ తరహాలోనే అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ టెక్నాలజీని సమర్థంగా అనుసంధానించి లక్ష్యాలను చేరుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంగళవారం సిఎం క్యాంపు కార్యాలయంలో ప్రణాళిక విభాగం అధికారులతో సిఎం చంద్రబాబు ఉన్నత సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో లోటు వర్షపాతం ఉందని కృష్ణా నదిలో ప్రవాహాలు లేని కారణంగా శ్రీశైలం, నాగార్జున సాగర్ లాంటి ప్రాజెక్టులు ఇంకా పూర్తిగా నిండలేదని.. గోదావరికి వచ్చిన వరద ప్రవాహాలను మళ్లించి కృష్ణా డెల్టాకు నీరిచ్చామని పేర్కొన్నారు. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నా యని, ఈ నేపథ్యంలో స్థూల ఉత్పత్తి పడిపోకుండా వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కార్యాచరణ >>2



మంగళవారం అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు. ఇన్‌సెట్‌లో ఆర్థిక ప్రగతి సూచిక

# 'ఆక్వా'కి ప్రభుత్వం భరోసా

## 50వేల మంది పైగా రైతులకు లబ్ధి- ఖజానాపై రూ.1100 కోట్ల భారం

## విద్యుత్ సబ్సిడీ యూనిట్‌కు రూ.1.50 పైసలు అమలు, జిఒ విడుదల



మంగళవారం పాలకొల్లులో జరిగిన ఆక్వా రైతు కృతజ్ఞతా సభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఆక్వా రంగాన్ని ఆదుకునేందుకు రూపాయిన్నరకే కరెంటు ఇస్తూ కూటమి ప్రభుత్వం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జిఒ విడుదల చేసింది. ఆక్వా రైతుల ఆనంద పరవశం మధ్య మంగళవారం పాలకొల్లులో బ్రాడీపేట బైపాస్ రోడ్డు రామచంద్ర గార్డెన్ వద్ద నిర్వహించిన రాష్ట్ర ఆక్వా రైతుల కృతజ్ఞత బహిరంగ సభలో విద్యుత్తు, వ్యవసాయ, మత్స్య శాఖ, ఇరిగేషన్ మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, ఆక్వా రంగంతో సంబంధం ఉన్న ఎమ్మెల్యేలు, అనేక మంది ప్రముఖుల మధ్య సబ్సిడీ కరెంట్ జిఒ విడుదల చేశారు. వేలాదిగా తరలివచ్చిన రైతులు హర్షం వ్యక్తం చేశారు. సభకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షత వహించారు. 2019-24 మధ్య జగన్ అరాచక పాలనలో ఆక్వా రంగం కుదేలు అయిపోయిందని మంత్రులు ఆరోపించారు. పాదయాత్రలో రూపాయిన్నరకే కరెంటు ఇస్తానని వైఎస్ జగన్ ప్రకటించి అధికారంలోకి వచ్చిన తర్వాత మడమ తిప్పి మాట మార్చాడని దుయ్యబట్టారు. ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్, 10 ఎకరాల రైతులకే పరిమితం అంటూ ఆక్వా రైతులను విభజించి సబ్సిడీ కరెంటు అందించే రైతులను సగానికి సగం తగ్గించేసాడని >>2

అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తునకు

# ప్రభుత్వం అనుమతి

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** అగ్రిగోల్డ్ కేసులో మరిన్ని ఆస్తుల జప్తునకు ప్రభుత్వం ఆదేశించింది. డిపాజిటర్ల సొమ్ముతో బంధువుల పేరిట ఆస్తులు కొన్నట్లు గుర్తించింది. జయలక్ష్మి పేరిట పోరంకి, పెనమలూరు, ఈదరలో 6.55 ఎకరాల భూమి జప్తునకు హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఎండీగా ఉన్న అవ్వా హేమసుందర వరప్రసాద్‌కు జయలక్ష్మి అత్తగా గుర్తించింది. ఎన్.మమత పేరుతో కర్ణాటకలో 3.32 ఎకరాలు ఉన్నట్లు గుర్తించగా, 3.32 ఎకరాలు కూడా డిపాజిట్‌దారుల సొమ్ముతోనే కొన్నట్లు ధ్రువీకరించింది. భూమి జప్తునకు చర్యలు తీసుకోవాలని సిఐడి డైరెక్టర్ జనరల్‌కు ప్రభుత్వంఆదేశాలు జారీ చేసింది.

జూ.డాక్టర్ల ఆందోళన

# ఆగిన వైద్యసేవలు

## తీవ్ర ఇబ్బంది పడ్డ రోగులు

**విజయవాడ,ఆగస్టు11, ప్రభాతవార్తప్రతినిధి:** తమ సమస్యల పరిష్కారం కోసం ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు ఆందోళన చేపట్టారు. ప్రధానంగా 15 శాతం స్టైఫండ్ పెంపును డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించారు. ఫలితంగా ప్రభుత్వ ఆసుపత్రులు, బోధనాస్పత్రుల్లో ఓపీతోపాటు సాధారణ సేవలు నిలిచిపోయాయి. అత్యవసర సేవలు మాత్రం కొనసాగాయి. నిరసనలో భాగంగా జూడాలు విజయవాడ జీజీహెచ్ సూపర్ స్పెషాల్టీ బ్లాక్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.వైద్యుల ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయాన్ని వారు >>2

# ఇక చకచకా

## పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్-1బి

## పునరావాస కాలనీ నిర్మాణంపై ఫోకస్

## డిపిఆర్‌ల తయారీ, నిర్మాణ పనులు వేగవంతం

## అధికారులకు ఆదేశాలు, క్షేత్రస్థాయిలో పరిశీలన



మంగళవారం పోలవరం నిర్వాశిత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

**పోలవరం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1బి పునరావాస కాలనీల నిర్మాణంపై అధికారుల దృష్టి సారించారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు పనులను పూర్తి చేసి నిర్వశితులను పునరావాస కాలనీలకు తరలించలన్న లక్ష్యంతో అధికారులు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం ఏలూరు జిల్లా పోలవరం నిర్వశిసితుల కాలనీల నిర్మాణా ప్రాంతాన్ని పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి శుభం నొక్వాల్ పరిశీలించి ఆధికారులకు దిశానిర్దేశం చేశారు. డిపిఆర్‌ల తయారీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు జిల్లాలో పోలవరం ప్రాజెక్టు ఫేజ్-1బి పరిధిలోని 41.15 కాంటూర్ లెవెల్‌కు సంబంధించిన చింతూరు డివిజన్ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం >>2

# నెత్తురోడిన రోడ్లు

## కోహీర్ ఎక్స్‌రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి 2లో

## జహీరాబాద్ వద్ద ఘోర ప్రమాదం

## ఆటోను ఢీకొన్న ఆయిల్ టాంకర్

## ఐదుగురు కూలీల మృతి, ఏడుగురికి గాయాలు

## మృతులంతా కర్ణాటకకు చెందినవారే..



# చంద్రునిపై భారత్ అడ్రస్!

## 'మూన్ బేస్'లో చేరాలని ఇస్రోకు అమెరికా ఆహ్వానం

## చంద్రుని దక్షిణ ధ్రువంలో మనుషుల స్థావరం ఏర్పాటు చేయాలని నాసా ప్రణాళిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** చంద్రుడిపై శాశ్వత స్థావరం ఏర్పాటు చేయాలన్న అమెరికా ప్రణాళికలో భారత్ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. నాసా ప్రతిపాదించిన మూన్ బేస్ కార్యక్రమంలో చేరాలని ఇస్రోను అమెరికా ఆహ్వానించింది. బెంగళూరులో ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగిన భారత్‌అమెరికా సివిల్ స్పేస్ జాయింట్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఈ ఆహ్వానం అందింది. చంద్రుడి దక్షిణ ధ్రువం సమీపంలో మానవులు నివసించే తొలి శాశ్వత స్థావరాన్ని ఏర్పాటు చేయాలన్నది నాసా ప్రణాళిక. వ్యోమగాములు అక్కడ నివసించడంతో పాటు పరిశోధనలు చేయనున్నారు. ఇందుకోసం మానవ సహిత, మానవ రహిత మిషన్ల ద్వారా అవసరమైన మౌలిక వసతులను దశలవారీగా ఏర్పాటు చేయనున్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికే నాసా ప్రాధాన్యం ఇస్తోంది. అక్కడ శాశ్వతంగా నీడలో ఉండే కొన్ని ప్రాంతాల్లో మంచు రూపంలో నీరు ఉండొచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆ నీటిని >>2



## క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే

# అర్హత లేదు

## హోంమంత్రి వంగలపూడి అనిత

## నకిలీ పోలీసులతో ర్యాలీలేంటి?

## పోలీసు వ్యవస్థను వైసిపి నేతలు అవమానిస్తున్నారని మండిపాటు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** నకిలీ పోలీసులతో ర్యాలీలు నిర్వహిస్తూ వైసిపి నాయకులు రాష్ట్ర పోలీసు వ్యవస్థను తీవ్రంగా అవమానిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర స్థాయి లో మండిపడ్డారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు, రాజ కీయ ప్రయోజనాల కోసమే ఆ పార్టీ నేతలు ఇలాంటి దిగజారుడు >>2



పంద్రాగస్టుకు ముందే

# ఉగ్రదాడులు..

## భారీ బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముందు దేశంలో ఉగ్రవాద దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. పాకిస్థాన్ ఐఎస్ఐ మద్దతుతో ఉగ్రవాదులు సరిహద్దుల వద్ద లేదా దేశంలోని ఇతర ప్రాంతాల్లో దాడులకు పాల్పడవచ్చన్న సమాచారంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ నేపథ్యం >>2

ప్రగతి బాట



# మారుమూల పల్లెలకు దారులు

## మరో 158 ఆవాసాలకు తొలిసారి రహదారి సౌకర్యం

## ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద రూ.422.10 కోట్ల నిధులు మంజూరు

## 347 కి.మీ పొడుగున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం

## నిర్మాణంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

## పంచాయతీరాజ్ అధికారులకు డి.సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని చిట్టచివరి గ్రామానికి సైతం అభివృద్ధి ఫలాలు చేరాలన్నదే తమ సంకల్పమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ఆ దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయన్నారు. ఇప్పటికే అడవితల్లి బాట పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఎన్నో గిరిశిఖర గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం కల్పించినట్లు వివరించారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మైదాన ప్రాంతాల్లో సైతం జనజీవనానికి దూరంగా విసిరేసినట్టు ఉండే మారుమూల పల్లెలు, ఆవాసాలకు, కుగ్రామాలకు రోడ్లను పరిచయం >>2




మంగళవారం సిఎం చంద్రబాబుకు ప్రగతి నివేదిక అందచేస్తున్న అధికారి

## ఎల్‌నినో సంక్షోభంలోనూ 10.7% వృద్ధి

>> టన్నుల ఉత్పత్తితో 304 శాతం మేర పెరుగుదల రికార్డు అయినట్టు నివేదిక పేర్కొంది. అటు కూరగాయల ఉత్పత్తిలోనూ 44.8శాతం మేర పెరుగుదల ఉన్నట్టు ప్రణాళికా విభాగం స్పష్టం చేసింది. పశుసంవర్ధక శాఖలో మాంసం ఉత్పత్తి 9.6శాతం, గుడ్ల ఉత్పత్తి 5.1శాతం, సముద్రపు రొయ్యల్లో 17 శాతం వృద్ధిని సాధించాయి. సేవా రంగంలో ఐటి, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణ ఎగుమతుల్లో రూ. 16,322 కోట్లతో 10.5 శాతం మేర వృద్ధి నమోదు అయ్యింది. ఎస్‌టిపిఐ ఎగుమతులు 32.2 శాతం మేర పెరిగాయి, అలాగే వాణిజ్య వాహనాల కొనుగోళ్లు 51.6 శాతం వృద్ధిని కనబరిచింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెక్నాలజీ ఇంటిగ్రేషనుతో జిఎస్‌టి పన్ను వసూళ్లు 21 శాతం వృద్ధితో రూ.13,282 కోట్లకు చేరాయి. ఖనిజాల్లో 17.9 శాతం, విద్యుత్ వినియోగం 22.2 శాతం మేర పెరిగింది. జులై మాసానికి సంబంధించి పర్యాటకుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. దేశీయంగా 3.10 కోట్ల మంది, 35,951 మంది విదేశీ టూరిస్టులు రాష్ట్రానికి వచ్చారని జులై నెల ఆర్థిక నివేదిక పేర్కొంది.

రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టుల పెట్టుబడులు గ్రౌండింగ్‌తో 75.4 శాతం మేర, రూ.60 వేల కోట్ల మేర ఎంఎస్‌ఎంఇ రంగ పెట్టుబడులు 73.6శాతం వృద్ధిని నమోదు చేశాయి. పన్ను, పన్నేతర ఆదాయాల్లో గణనీయంగా వృద్ధి నమోదు అయ్యింది. 2025-26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం మేర వృద్ధి నమోదు చేసింది. పారిశ్రామిక రంగం 10.6 శాతం మేర, సేవల రంగం 9.9 శాతం వృద్ధితో ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలిచాయి. ఫలితంగా కూటమి ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూనే ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోంది.

# లక్ష్యం మరువద్దు!

>> చేపట్టాలని సూచించారు. సమాచారాన్ని సమగ్రంగా విశ్లేషించి లోటుపాట్లను సరిచేసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వశాఖ అత్యున్నత స్థాయి లక్ష్యాలను చేరుకునేలా వనరుల నిర్వహణ చేపట్టాలన్నారు. నిర్దుష్టమైన ప్రమాణాలను అనుసరించి ఫలితాలు వచ్చేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. రూపొందించే ప్రతీ ప్రణాళికా రాష్ట్ర వృద్ధిరేటును పెంచేలా ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూడాలని సూచించారు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు లాంటి అంశాలపై సూచనాత్మక కంటిజెన్సీ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఎపి 15శాతం వృద్ధిరేటు సాధించేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి కావాల్సిన ఉత్పత్తులపై ప్రభావం లేకుండా చూడాలన్నారు. జిల్లా, నియోజకవర్గం, మండలవారీగా నివేదికలు ఇస్తే లక్ష్యాల సాధన సులువు అవుతుందని సిఎం సూచించారు. ఈ సమీక్షకు ఆర్థిక, ప్రణాళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, జాయింట్ సెక్రటరీ శాంతి ప్రియా పాండే, ప్రణాళికా విభాగం డైరెక్టర్ బి. గోపాల్, ఎపిఎస్‌డిపిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విఆర్ అలపర్తి తదితరులు పాల్గొన్నారు.

## 'ఆక్వాకి ప్రభుత్వం భరోసా

>> విమర్శించారు. ఒక చేత్తో ఇచ్చి మరో చేత్తో లాగేసుకున్నట్లు అయిందని ఎద్దేవా చేశారు. ఫ్రీ ట్రాన్స్‌ఫార్మర్ల విధానం ఎత్తివేసి ప్రైవేట్‌గా కొనుగోలు విధానం ప్రవేశపెట్టి లక్షల రూపాయల భారం ఆక్వా రైతులు మీద మోపాడు అని చెప్పారు. వీటన్నింటి కంటే మించి గొడ్డలి పార్టీ తన ఐదేళ్ల పదవీకాలంలో ఆరుసార్లు కరెంటు చార్జీలు పెంచారు అన్నారు. రైతులకు ఇంత అన్యాయం చేసిన జగన్ ఓదార్పులు, మద్దతులు, పేరిట పరామర్శిల పేరిట ఆక్వా రైతులను కలిసి మొసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు. ఆక్వా రైతుల అష్ట కష్టాలు ఎన్నికల ముందే కళ్లారా చూసిన కూటమి పార్టీలు ప్రభుత్వం ఏర్పడ్డాక ఆక్వా రైతులను ఆదుకుంటామని, రూపాయిన్నరకే కరెంటు ఇస్తామని, జోన్ల విధానం రద్దు చేస్తామని, 10 ఎకరాలు విస్తీర్ణ పరిమితిని తొలగిస్తామని. ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని వక్తలు చెప్పారు. సభాధ్యక్షుడు నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ రూపాయిన్నరకు కరెంటు ఇవ్వడం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై రూ.1100 కోట్లు భారం పడుతుందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ఆక్వా రైతులను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ కలసి ఆక్వా రైతులకు అండగా నిలబడ్డారని చెప్పారు. ఈ జిఒ వల్ల ఎకరాకు 50 వేల పైబడి ఆక్వా రైతులకు ఆదావుతుందని రామానాయుడు చెప్పారు. వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి అచ్చన్నాయుడు మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తుల వ్యయం ఈక్వెడార్ లాంటి ప్రపంచ దేశాలతో పోల్చి చెప్పారు. అక్కడ కిలో ఉత్పత్తికి రూ.190లు అయితే మన దగ్గర 270- 280 వరకు అవుతుందన్నారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం విడుదల చేసిన జిఒతో కూటమి ప్రభుత్వం ఇంచుమించు అన్ని హామీలు నిలబెట్టుకున్నట్లు అయిందన్నారు. ఆక్వా యూనివర్సిటీకి రూ.27 కోట్లు మంజూరు చేసినట్లు అచ్చెన్నాయుడు చెప్పారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ రూపాయిన్నర కరెంటు జిఒ విడుదలకు వెనుకున్న కష్ట నష్టాలు తన ప్రసంగంలో వివరించారు. పెద్దలు ప్రధాని మోడీ సహకారం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవిరళ కృషి కారణంగానే మనం ఈరోజు ఆక్వారైతులను ఆదుకోగలుగుతున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం, ఆక్వా, తదితర అన్ని రంగాలకు కలిపి విద్యుత్ శాఖ రూ.15 వేల కోట్ల సబ్సిడీ ఇస్తోందని చెప్పారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఆక్వా యూనివర్సిటీకి భవనం ఏర్పాటు చేసిన విషయాన్ని, కృషి విజ్ఞాన కేంద్రంలో అత్యాధునిక ఆక్వా ల్యాబ్లు ఉన్న సంగతిని గుర్తుచేసి కొద్దిపాటి వ్యయంతో వాటిని ఉపయోగించుకోవచ్చునని చెప్పారు. భాజపా ముఖ్య నేత, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, పులపర్తి అంజిబాబు, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరి మిల్లి రాధాకృష్ణ, బొమ్మిడి నాయ కర్, కామినేని శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, రాష్ట్ర ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు, రాజోలు ఎమ్మెల్యే, తదితరులు మాట్లాడారు. వీరితోపాటు మత్స్య శాఖ ఉన్నతాధికారి నాయక్, కలెక్టర్ నాగరాణి కూడా ప్రసంగించారు. జిఒ విడుదల సందర్భంగా ఏర్పాటైన సభలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజులను మంత్రి రామానాయుడు సన్మానించారు. రామానాయుడుని వారు కూడా సత్కరించారు. ఆక్వా రైతుల సమస్యలపై మంత్రులకు ఆక్వా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు వినతిపత్రం అందజేశారు.

## రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు

>> చర్యలకు ఒడిగడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు నకిలీ పోలీసుల ముసుగులో ర్యాలీలు చేస్తూ సమాజానికి ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని ప్రశ్నించిన ఆమె, ముసుగులు వేసుకుని క్రిమినల్ రాజకీయాలు చేసేవారికి రాజకీయాల్లో కొనసాగే అర్హతే లేదని తేల్చి చెప్పారు. పోలీసు వ్యవస్థ గౌరవాన్ని, విశ్వసనీయతను దెబ్బతీసే ఏ ఒక్క చర్యను కూడా కూటమి ప్రభుత్వం ఉపేక్షించబోదని హోంమంత్రి స్పష్టం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం ప్రభుత్వ వ్యవస్థలను దిగజార్చాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ ఘటనలో ర్యాలీలో పాల్గొన్న నకిలీ పోలీసులతో పాటు, వారి వెనకుండి నడిపించిన అసలు వైసిపి సూత్రధారులపైనా చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత హెచ్చరించారు.ప్రతి ఘటన జరిగినప్పుడు 'రెడ్‌బుక్ రాజ్యాంగం' అంటూ విమర్శించడం జగన్‌కు అలవాటైందని హోంమంత్రి అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్నది రెడ్‌బుక్ రాజ్యాంగం కాదు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే. చట్టం ముందు అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఒక్కటే' అని స్పష్టం చేశారు. గత రెండేళ్లలో రాజకీయ కక్షతో ప్రతిపక్ష నేతల ఇళ్లు కూల్చడం లేదని, వారి ఇళ్ల ముందు అనవసరంగా పోలీసులను మోహరించడంలేదని, రాజకీయ కారణాలతో వేధింపులకు పాల్పడటం లేదని పేర్కొన్నారు. మా ఫోకస్ రాష్ట్రానికి పెట్టుబడులు. శాంతిభద్రతలను కాపాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలపాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం' అని హోంమంత్రి స్పష్టం చేశారు. చివరిగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి అనిత మాట్లాడుతూ "గత పాలనను చూశారు... ఈ రెండేళ్ల కూటమి పాలనను చూస్తున్నారు. ఎవరు అభివృద్ధి చేస్తున్నారు? ఎవరు పెట్టుబడులు తెస్తున్నారు? ఎవరు ఉద్యోగాల కోసం శ్రమిస్తున్నారు? అన్నది ప్రజలే ఆలోచించాలని పేర్కొన్నారు.

## మారుమూల పల్లెలకు దారులు

>> చేసేందుకు పవన్ కల్యాణ్ రూపొందించిన ప్రణాళికలు కార్యరూపం దాల్చనున్నాయి. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఈ రోడ్ల నిర్మాణం చేపట్టనుంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మరో 158 ఆవాసాలకు తొలిసారిగా రహదారి సౌకర్యం కల్పించబోతున్నట్లు ప్రకటించారు. మరో 158 మారుమూల గ్రామాలకు అనుసంధాన రహదారులు నిర్మించేందుకు పరిపాలన అనుమతుల ప్రక్రియ పూర్తయ్యింది. 347కిలోమీటర్ల పొడవున, 146 రోడ్లు, 19 వంతెనల నిర్మాణం చేపట్టనున్నారు. ఏఎస్ఆర్, పార్వతీపురం మన్యం, అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, కడప, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, పల్నాడు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరం, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పూర్తి రహదారి సౌకర్యం లేని ఆవాసాలను గుర్తించి, అంచనాలు రూపొందించారు. ఆయా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.422.10 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఐదేళ్లపాటు ఈ రోడ్ల నిర్వహణ నిమిత్తం మరో రూ.24.47 కోట్లు విడుదలయ్యాయి. "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సహకారంతో 158 ఆవాసాలకు తొలిసారి రోడ్డు సౌకర్యం కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది.మారుమూల గ్రామాలకు నిర్మించే రోడ్ల నాణ్యత విషయంలో అత్యున్నత ప్రమాణాలు పాటించాలి.మనం వేసే రోడ్లు పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడాలి. రహదారి సౌకర్యం లేని గ్రామాలకు మెరుగైన రవాణాసదుపాయం కల్పించే లక్ష్యంతో నిర్మిస్తున్న రోడ్లు, వంతెనల నిర్మాణంతో ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి, ప్రజలకు మెరుగైన విద్య, వైద్యం, మార్కెటింగ్ వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి" అని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# ఆగిన వైద్యసేవలు

>> వ్యతిరేకించారు. ఇలా చేయడం వల్ల యువతకు అవకాశాలు ఉండవన్నారు. అదేవిధంగా జూనియర్ డాక్టర్లపై పని ఒత్తిడి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ప్రభుత్వం స్పందించేదాకా తమ ఆందోళన కొనసాగుతుందని జూనియర్ డాక్టర్లు స్పష్టం చేశారు. కడప రిమ్స్ లో జూనియర్ వైద్యులు సమ్మె బాట పట్టారు. అత్యవసర వైద్య సేవలు మినహా విధులు బహిష్కరించి ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో సాధారణ వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది. ప్రభుత్వం ఏటా స్టైఫండ్ ను 15 శాతం పెంచాలన్నారు. గతంలో చివరిసారిగా 2024లో పెంచారని గుర్తు చేశారు. తెలంగాణ జూనియర్ వైద్యులకు మెరుగైన స్టైఫండ్ ఇస్తున్నారని చెప్పారు. వైద్యుల పదవీ విరమణ వయసును 65 సంవత్సరాలకు పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. అదేవిధంగా రీసెర్చ్ డాక్టర్లను మెడికల్ వైద్యులుగా తీసుకోరాదని చెప్పారు.విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో జూనియర్ వైద్యులు విధులు బహిష్కరించారు. తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలంటూ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం ఆంధ్ర మెడికల్ కాలేజ్ వరకు ర్యాలీ చేసిన జూడాలు ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా స్టైఫండ్ చెల్లించాలని, వైద్యుల ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంచాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# చంద్రునిపై భారత్ అడ్రస్!

>> తాగడానికి, ఆక్సిజన్, రాకెట్ ఇంధనంగా మార్చుకునే అవకాశం ఉంది. భవిష్యత్తులో అంగారకుడిపై మానవ యాత్రలకు చంద్రుడిని కీలక కేంద్రంగా ఉపయోగించుకోవాలన్నది నాసా లక్ష్యం. చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన తొలి దేశంగా భారత్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2023 ఆగస్టులో చంద్రయాన్3లోని విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ అక్కడ దిగాయి. ల్యాండింగ్ ప్రాంతానికి శివశక్తి పాయింట్‌గా పేరు పెట్టారు. నాసా ఇప్పుడు అదే ప్రాంతంలో స్థావరం ఏర్పాటుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఇస్రో అనుభవం కీలకంగా మారనుంది. మూన్ బేస్ సహకారం ఆర్టెమిస్ అకార్డ్స్ కింద భారత్‌అమెరికా భాగస్వామ్యానికి కొనసాగింపుగా ఉండనుంది. శాంతియుత, పారదర్శక, సుస్థిర అంతరిక్ష అన్వేషణకు ఈ ఒప్పందం మార్గదర్శకంగా ఉంటుంది. 2023 జూన్ 21న భారత్ ఆర్టెమిస్ అకార్డ్స్‌పై సంతకం చేసింది. బెంగళూరు సమావేశంలో అంతరిక్ష పరిశోధనల నుంచి లభించే శాస్త్రీయ సమాచారాన్ని పరస్పరం పంచుకోవడంపైనా చర్చలు ముందుకు తీసుకెళ్లాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. భారత్, అమెరికా ఇప్పటికే నిసార్ ఉపగ్రహం ద్వారా భారీ అంతరిక్ష సహకారాన్ని కొనసాగిస్తున్నాయి. భవిష్యత్‌లో శాస్త్రీయ పరిశోధనలు, మానవ అంతరిక్ష ప్రయాణ సాంకేతికతపై కలిసి పనిచేయాలని తాజా సమావేశంలో నిర్ణయించారు. భారత్ గగన్‌యాన్ కార్యక్రమంతో మానవ అంతరిక్ష యాత్రకు సిద్ధమవుతోంది. అంతరిక్ష కేంద్రం ఏర్పాటు, భవిష్యత్తులో చంద్రుడిపై మానవ కార్యకలాపాల వంటి లక్ష్యాలను స్పేస్ విజన్ 2047లో భారత్ నిర్దేశించుకుంది. ఈ నేపథ్యంలో నాసా ఆహ్వానం ఇస్రోకు కీలక అవకాశంగా మారనుంది.

## పంద్రాగస్టుకు ముందే ఉగ్రదాడులు

>> లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దుల్లో భద్రతను అత్యంత కట్టుదిట్టం చేస్తూ కీలక చర్యలు చేపట్టింది. ఈనెల 15న ఢిల్లీ, జమ్మూ కాశ్మీర్ వంటి ప్రాంతాల్లో భద్రతా బలగాల దృష్టి వేడుకలపై కేంద్రీకృతమై ఉంటుందని, ఇదే అదనుగా దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ భావిస్తున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారి ఒకరు తెలిపారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), బలూచిస్థాన్‌లో నెలకొన్న అంతర్గత సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఐఎస్ఐ ఈ కుట్రలకు పాల్పడుతున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్‌లోకి ఉగ్రవాదులను చొరబడేలా చేయడం, బంగ్లాదేశ్ సరిహద్దుల ద్వారా పంపడం వంటి ప్రయత్నాలు జరగవచ్చని హెచ్చరికలు జారీ అయ్యాయి. అంతేకాకుండా, భద్రత తక్కువగా ఉండే టైర్2 నగరాలను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం కూడా ఉంది. కొన్నిసార్లు భద్రతా ఏజెన్సీల దృష్టిని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ లేదా కశ్మీర్‌లో దాడులంటూ తప్పుడు సమాచారం సృష్టించి, మరోచోట దాడికి దిగే వ్యూహం కూడా ఐఎస్ఐ అనుసరించవచ్చని ఓ అధికారి వివరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో పాకిస్థాన్‌తో ఉన్న పశ్చిమ సరిహద్దులో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) ఆపరేషన్ అలర్ట్‌ను ప్రారంభించింది. ఈనెల 10 నుంచి 17 వరకు కొనసాగే ఈ ఆపరేషన్‌లో భాగంగా బీఎస్ఎఫ్ సీనియర్ అధికారులు పర్యవేక్షిస్తూ, నిఘా మరియు పెట్రోలింగ్‌ను గణనీయంగా పెంచారు. మరోవైపు, బంగ్లాదేశ్ సరిహద్దులో భద్రతను పటిష్టం చేసేందుకు పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు జిల్లాల్లో సుమారు 40 సబ్సిడరీ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) యూనిట్లను తపర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ సరిహద్దు అత్యంత సున్నితమైనది కావడంతో శాశ్వత నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసి చొరబాట్లు, స్మగ్లింగ్ వంటి కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అడ్డుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

### రుస్టెన్‌బర్గ్ గనిలో అక్రమ తవ్వకాలు.. 14 మంది మైనర్లు దుర్మరణం

**జోహాన్స్‌బర్గ్, ఆగస్టు 11:**సౌతాఫ్రికాలోని జోహాన్నెస్ బర్గ్ నగరానికి దాదాపు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న రుస్టెన్ బర్గ్ లోని ఓ గనిలో అక్రమంగా తవ్వకాలు జరుపుతుండగా ప్రమాదవ శాత్తు గని కుప్పకూలిన ఘటనలో 14 మంది మైనర్లు ప్రాణాలు కోల్పోయారు. మరికొంతమంది గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. అయితే ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ప్రావిన్షియల్ పోలీస్ కమిషనర్ ఘటనాస్థలికి చేరుకున్నారు.

## 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనండి: ప్రధాని మోడీ

>> బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు, ఎన్డీఏ నేతలు, కూటమిలోని వివిధ పార్టీలకు చెందిన ఎంపీలు హాజరయ్యారు. ప్రధాని మోదీ సమావేశ ప్రాంగణంలోకి ప్రవేశించగానే మంత్రులు, ఎంపీలు జాతీయ జెండాలను చేతబూని నినాదాలు చేశారు. దీనికి ప్రతిగా మోడీ కూడా జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ఎంపీల వైపు ఊపారు.ఈ సమావేశానికి బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రులు అమిత్ షా, నిర్మలా సీతారామన్, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, ఎస్. జైశంకర్ తదితరులు హాజరయ్యారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలకు చెందిన హెచ్‌డీ కుమారస్వామి (జేడీఎస్), కింజరాపు రామ్మోహన్ నాయుడు (టీడీపీ), రాందాస్ బందు అథవాలే, ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), ఉపేంద్ర కుష్వాహా (ఆర్ఎల్ఎం), శతాబ్ది రాయ్ తదితర నేతలు కూడా సమావేశంలో పాల్గొన్నారు. జూలై 20న ప్రారంభమైన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగియనున్నాయి.

**పలు బిల్లుల ఆమోదం:** ఈ సమావేశాల్లో తరచూ వాయిదాలు, నిరసనలు చోటుచేసుకోవడంతో పెద్దగా శాసన కార్యకలాపాలు జరగలేదు. ప్రజా పరీక్షలు (అక్రమ మార్గాల నిరోధం) సవరణ బిల్లు2026తో పాటు మరో నాలుగు బిల్లులను పెద్దగా చర్చ లేకుండానే పార్లమెంట్ ఆమోదించింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య లోక్‌సభ మరో మూడు బిల్లులను కూడా ఆమోదించింది.తొలుత నీట్ ప్రశ్నపత్రం లీక్ అంశంతో పాటు అయోధ్య రామాలయ విరాళాల నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేశాయి. అనంతరం నీట్ అంశంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్యపై చర్చించాలని, ఈ అంశంపై ప్రధానమంత్రి మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ఉండి ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

## ఇక చకచకా పోలవరం ప్రాజెక్ట్ ఫేజ్-1బి

>> ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి గుర్తించిన భూములను పరిశీలించారు. కొయ్యలగూడెం మండలంలోని పరింపూడి గ్రామంలో వి.ఆర్.పురం మండలం రాజుపేట కాలనీ, రాజుపేట గ్రామాలకు గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు, కూనవరం మండలంలోని కూనవరం, టేకులబోరె గ్రామాలకు చెందిన గిరిజనేతర ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణానికి కేటాయించిన భూములను అధికారులు పరిశీలించారు. పరింపూడి గ్రామంలో గుర్తించిన భూముల విస్తీర్ణం, భూమి అనుకూలత, రహదారి సౌకర్యం, తాగునీరు, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు ఉన్న అవకాశాలను పరిశీలించి, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరింపూడి గ్రామ భూముల పరిశీలన అనంతరం ఐటిడిఏ కె.ఆర్.పురం కార్యాలయంలో పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, ధవళేశ్వరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, ఐటిడిఏ చింతూరు ప్రాజెక్టు అధికారి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లాకు చెందిన సంబంధిత అన్ని నిర్మాణ సంస్థలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చింతూరు డివిజన్‌కు చెందిన ఫేజ్-1బి ఎస్టీ, నాన్-ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి సంబంధించిన డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టుల తయారీ, కాలనీల వారీగా గృహాల సంఖ్య, అవసరమైన మౌలిక వసతులు, భూముల అనుకూలత, కాలనీ లేఅవుట్లు, రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షి ంచారు.

ప్రతి ప్రతిపాదిత ఆర్ అండ్ ఆర్ కాలనీకి ప్రత్యేకంగా డిపిఆర్ సిద్ధం చేసి, సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేలా చర్యలు తీసుకోవాలని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశం అనంతరం అధికారులు బుట్టాయిగూడెం, దొరమామిడి, మార్లగూడెం గ్రామాల్లో ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణానికి గుర్తించిన భూములను సందర్శించారు. కూనవరం మండలంలోని కుళ్ళపాడు, కూనవరం, టేకుబాక, టేకులబోరు గ్రామాలకు చెందిన ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు, అలాగే వి.ఆర్.పురం మండలంలోని కన్నాయిగూడెం, సోమ్ములగూడెం, శబరాయిగూడెం తదితర గ్రామాలకు చెందిన ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన పునరావాస భూములను పరిశీలించారు. చింతూరు డివిజన్‌కు చెందిన ఆయా గ్రామాల ఎస్టీ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల కోసం ప్రతిపాదించిన ఆర్ అండ్ ఆర్ కాలనీల నిర్మాణాన్ని 2027 మార్చి నాటికి పూర్తి చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో రాములు నాయక్, ప్రాజెక్టు అధికారి, ఐటిడిఏ కె.ఆర్.పురం, బాలకృష్ణ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏటపాక యూనిట్-1, శర్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఏలూరు, ఆంజనేయులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వి.ఆర్.పురం యూనిట్-2, చంద్రశేఖర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, చింతూరు యూనిట్-1, సంబంధిత ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంగళవారం కోహిర్ వద్ద ఢీకొన్న కార్లు

# నెత్తురోడిన రోడ్లు

**జహీరాబాద్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కూలీలతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో ఐదుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.చిరాగ్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం హుమ్నాబాద్ తాలూకా రాజగిరికి చెందిన కూలీలు పనుల నిమిత్తం జహీరాబాద్‌కు వచ్చారు. పని ముగించుకుని ఆటోలో జహీరాబాద్ నుంచి హుమ్నాబాద్ వైపు వెళ్తుండగా సత్వార్ గ్రామ సమీపంలోని యూటర్న్ వద్ద ప్రమాదం జరిగింది. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ప్రయాణిస్తున్న కూలీలు తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో రేఖ, శ్రీదేవి, దేవదాస్, కవిత, రేష్మ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వీరంతా ఒకే గ్రామానికి చెందినవారిగా గుర్తించారు. గాయపడిన వారిలో నిర్మల, నికిత, తుల్జమ్మ, చంద్రకళ, రాధిక, శిల్ప, శోభ ఉన్నారు.ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే చిరాగ్‌పల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని హుటాహుటిన జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఆసుపత్రి వద్ద విషాదం ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు కూలీలు ప్రమాదంలో మృతి చెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మృతుల బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చేరుకోవడంతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది. తమ వారిని కోల్పోయిన కుటుంబ సభ్యుల రోదనలతో ఆసుపత్రి ఆవరణం దద్దరిల్లింది. ప్రమాదానికి గల పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

02 కోహిర్ వద్ద కార్లు ఢీకొని మృతి చెందిన మల్లికార్జున్, శంకరులు

## కోహిర్ ఎక్స్ రోడ్ వద్ద కార్లు ఢీకొని ఇద్దరు మృతి

కోహిర్ చౌరస్తా సమీపంలో మంగళవారం రాత్రి కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. చనిపోయిన వారిలో సదాశివపేట పట్టణం 1 వ వార్డుకు చెందిన బోడగమా మల్లికార్జున్ 52 ,శంకర్ 52,లు ఉన్నారు చనిపోయిన వారిలో మల్లికార్జున్ లీభినీ ఎంప్లాయ్ కాగా శంకర్ సదాశివపేట మున్సిపల్ ఎంప్లాయి పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కోయిరు పోలీసులు సంఘటన స్థలాలను చేరుకొని మృతి చెందిన వారిని గాయపడ్డ వారిని జహీరాబాద్ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రికి తరలించారు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఒక కారు పల్టీలు కొట్టి రహదారిపై పడగా వెనకాల ప్రయాణిస్తున్న మూడు కార్లు ఒకటి ఒకటి వెనుక నుండి ఢీకొనడంతో కారులో ప్రేమిస్తున్న ఇరువురు మృతి చెందినట్లు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## మెస్సీ మ్యాచ్ వ్యవహారంపై సీఎంకు దర్యాప్తు కమిటీ నివేదిక

**తిరువనంతపురం, ఆగస్టు 11:** ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీ, ప్రపంచ ఛాంపియన్ అర్జెంటీనా జట్టును కేరళకు తీసుకువచ్చే ప్రయత్నం విఫలం కావడంపై తీవ్ర వివాదం రాజుకుంది. గత వామపక్ష ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ వ్యవహారంపై నియమించిన విచారణ కమిటీ తన నివేదికను ప్రస్తుత వి.డి. సతీశన్ ప్రభుత్వానికి సమర్పించింది. ఇందులో తీవ్రమైన ఆర్థిక అవకతవకలు జరిగినట్టు తేలడంతో ప్రభుత్వం తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. రేపుజరగనున్న కేబినెట్ సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. క్రీడల శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎన్. ప్రశాంత్ నేతృత్వంలో జరిగిన ఈ విచారణలో పలు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. అర్జెంటీనా మ్యాచ్ కోసం స్పాన్సర్‌ను ఎంపిక చేసిన విధానం, ఆర్థిక లావాదేవీలు, కొచ్చిలోని జవహర్‌లాల్ నెహ్రూ అంతర్జాతీయ స్టేడియం అప్పగింత వంటి అంశాల్లో ప్రభుత్వ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించినట్టు నివేదిక స్పష్టం చేసింది. ఒక నిర్దిష్ట కంపెనీకి ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని కూడా నివేదికలో పేర్కొన్నారు. అసలు అర్జెంటీనా జట్టు కేరళకు వస్తుందనడానికి ఎలాంటి అధికారిక పత్రాలు, ఒప్పందాలు లేవని విచారణలో తేలడం గమనార్హం.

### వారం - వర్జ్యం

12-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె,
● తి.అమావాస్య రా.11.09
న.పుష్యమి ఉ.8.00
వ.రా.7.48-రా.9.16
దు.ఉ.11.46-మ.12.37
రాహు. మ.12.00-మ.1.30 శుభ లేదు.

### వార్తాఫలం

**మేషం :** చిన్ననాటి మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు. నూతన వస్తువులు కొనుగోలు. వాహన సౌఖ్యం.

**వృషభం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నూతన పెట్టుబడులకు అనుకూలం. శుభకార్యాలు.

**మిథునం :** కుటుంబ సభ్యులతో స్వల్ప విభేదాలు తలెత్తుతాయి. ఇంటా బయటా మీదే పైచేయిగా ఉంటుంది.

**కర్కాటకం :** సంఘసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** కొత్త వ్యాపార, విద్యా సంబంధితమైన విషయములకు, గృహ నిర్మాణాలకు అనుకూలం. మిత్రుల కలయిక.

**కన్య :** సన్నిహితుల సహకారము పూర్తిగా లభించుట వలన కొన్ని కార్యక్రమములలో విజయాలను చవిచూస్తారు.

**తుల :** ఆర్థిక పరిస్థితులు మెరుగుపడుట వలన మానసిక ఉల్లాసమును కలిగి యుంటారు. వస్త్రా లాభాలు

**వృశ్చికం :** అధికారుల అండదండలు లభించుట వలన వృత్తి యందు రాణించగలుగుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**ధనుస్సు :** సంతాన, ఆధ్యాత్మిక విషయములు సంతృప్తి ఇస్తాయి. భార్య వైపు బంధువులకు సాయం చేస్తారు.

**మకరం :** అధికారులతో సహోద్యోగులతో స్నేహ భావముతో మెలగండి. విందు, వినోదాలలో పాల్గొంటారు.

**కుంభం :** వ్యాపారములో, వృత్తిలో మీరు చూపించే నైపుణ్యమునకు గాను, మంచి అభివృద్ధిని సాధిస్తారు. మిత్రుల కలయిక.

**మీనం :** విదేశీయానములకు ఉద్యోగ ప్రయత్నములకు మీరుచేసే కృషి సానుకూల పడుతుంది. కాంట్రాక్టులు లాభిస్తాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

12-8pg4.qxd:12-8pg4.qxd 1/1/02 6:07 AM Page 1



వార్త

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.

న- బెర్ట్రండ్ రస్సెల్

# 'సర్'కి హంసపాదులెన్నో !

ఎందుకో ఏమోకానీ ఏ ముహుర్తాన సర్ ప్రారంభించారో గానీ ఆది నుంచి అన్నీ హంసపాదులతోనే నడుస్తోంది. తాజాగా తెలంగాణలో ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గడువు ముగిసింది. ఆఖరి క్షణాల్లో కూడా ఆదరాబాదరాగా తమ ఓటు ఉందో లేదో చూసుకోవడం 'సర్'కి అవసరమైన పత్రాలు చూసే పనిలో ఓటర్లంతా అప్రమత్తం కావడం విశేషం. అయినా తెలంగాణలో కోటి 31 లక్షల వయోజనుల ఓటు హక్కు అనిశ్చితిలోకి నెట్టబడిందన్న ఆరోపణలు నడుస్తున్నాయి. చాలా రాష్ట్రాలతో పోల్చి చూస్తే 'అనామలీస్' లెక్కల జాబితాలో దాదాపు 73 లక్షల ఓట్లు ఉండి ఉంటాయన్న అంచనా. వీరిలో చనిపోయినవారి ఓట్లు తొలగింపు, రెండేసి చోట్ల ఒకే వ్యక్తికి ఓటుహక్కు లభించగా వాటిలో ఒక దానిని తొలగించే విషయంలో బిఎల్ఓల యంత్రాంగం చేసిన ప్రయత్నాలు సానుకూల పడకపోవడంతో అన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. తెలంగాణలో మొత్తం 3.38 లక్షల పైచిలుకు ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తే వాటిలో చాలా ఫారాలు డిజిటలైజేషన్‌కు చేరలేదు. వివిధ రాజకీయ పార్టీలు తమ యంత్రాంగాన్ని సిద్ధం చేసినా ఓటర్ల జాబితాలో తొలగింపులు సమంజసంగా ఉన్నాయా? లేదో ప్రక్రియలో ముందడుగు వేయలేకపోయారు. ఈ రాష్ట్రంలో మొత్తం ఓటర్లలో వివరాల సరిపోల్చుకోలేని పరిస్థితులలో కొన్ని పోతే రేపు ఎన్నికల సమయంలో 'పోలింగ్ బూత్' వరకు ఎంత మంది వస్తారు? ఎందరు సెలెక్టివ్ ఓటర్లుంటారు. ఏ పార్టీని ఎన్నుకోవాలని ఆకాంక్షిస్తారో ఇవన్నీ లెక్కలేసుకుంటే అన్నిటి కన్నా ప్రధాన రాజకీయ పార్టీలకే సమస్యలు మెడకు చుట్టుకుంటాయి. ఈ నెల 17న ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటించగానే ఓటు హక్కు పునరుద్ధరణ, పునర్విచారణలో వాటిలో కొన్ని తిరిగి జాబితాలో సర్దుబాటవుతాయి. తమ వివరాలతో మరోసారి ఎన్నికల కమిషన్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని కలిస్తేనే ఓటు హక్కు నిలిచే అవకాశం ఉంది. ఈ విషయంలో ఎంత మంది శ్రద్ధ వహిస్తారో ఎవరికీ అర్థంకాదు. ముసాయిదా జాబితా ప్రకటనలోగానే ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేసుకునే ప్రక్రియలో అధికార పార్టీ ముందుంది. ఎన్నికలవ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించడం మంచిదే కానీ అనాలోచితంగా పెట్టిన షరతులు ప్రజల్లో భయాందోళనలు రేకెత్తడమే ఆక్షేపణీయం. ఉనికి దొరకని ఓటర్ల పేరుతో దొంగ ఓటర్ల జమానాకు అవకాశమివ్వకుండా వాళ్ల పేర్లు తొలగించడం ఎంత ముఖ్యమో నిజమైన ఓటు హక్కును కాపాడడమూ అంతే ముఖ్యం. ఓటర్ల జాబితాలో లోపాలను గుర్తించడం ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగమే కానీ ప్రతి తొలగింపును రాజకీయ ఆరోపణలకు ఆస్కారంగా తీసుకోవడం పార్టీలకు అంత మంచిది కాదు. కానీ 'సర్' ప్రకియ మొదలైనప్పట్నించి అన్ని రాష్ట్రాల్లోనూ ఈ ప్రక్రియపై అనుమాన బీజాలు మొలకెత్తాయి. అందుకే 'సర్' ప్రక్రియ అసాంతం తప్పులతడకగా భావించే ఆస్కారం కలిగింది. దానికితోడు కారణాలేమైనా భారీ ఎత్తున తొలగింపుల సంఖ్య ఉండడంతో రాజకీయ పార్టీల్లో అలజడి రేగింది. జంటనగరాల్లో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ఇప్పటిదాకా 56.3శాతంమాత్రమే ఉంది. దాంతో విద్యావంతులకు చెందిన ఎన్నో ఓట్లు తొలగించబడినట్లుగా నిర్ధారణ జరగడంతో ఎక్కడో ఏదో తేడా ఉన్నట్లు గోచరిస్తోంది. ఇలాంటి సమస్యలు పరిష్కరించి అందరికీ ఓటు హక్కు కల్పించాలి. ఓటు హక్కు లేదని బాధపడే వారుండకూడదు. అనే లక్ష్యంతో ముందుకు నడిచేటప్పుడు కొన్ని సాధక బాధకాలుంటాయి. తెలంగాణకు సంబంధించి హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో వలస జనాభా ఎక్కువ. సమస్యకు మూలం ప్రధానంగా 2002 నాటి ఓటరు జాబితాను ప్రామాణికంగా తీసుకోవడమే కాగా 'సర్' ఉద్దేశం. నిజమైన ఓటర్లను తొలగించడం కాదు. జాబితాను ప్రక్షాళించడమేనని ఒకటికి పదిసార్లు విన్నవించుకున్నా జాబితా ప్రక్షాళన మరింత సంక్లిష్టం అయిపోతోందనే సంశయానికి దగ్గరలో వరకు తీసుకెళ్లింది. తాజా విషయాల్లోకెళ్తే, హైదరాబాద్‌లో 45 శాతం మాత్రమే మ్యాపింగ్ జరిగింది. ఈ కారణాల రీత్యా హైదరాబాద్‌లో ఓటరు జాబితాలో సవరణలు ఎంత గ్యాప్ ఉందో తెలుసుకోవచ్చు. డ్రాఫ్ట్‌జాబితా తర్వాత ప్రభుత్వం మరిన్నిజాగ్రత్తలు తీసుకోవాలి. ఆధార్, ఫోన్ నంబరు ద్వారా కూడా ఓటర్ల ధ్రువీకరణ విధానాన్ని ప్రకటించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రక్రియలో మరిన్ని సహకార కేంద్రాల ఏర్పాటు కూడా అవసరం. మూడో దశలో 16 రాష్ట్రాలు,3 కేంద్రపాలిత ప్రాంతాల్లో 'సర్' ప్రక్రియ కొనసాగుతోంది. ఇంతకు పూర్వమే జరిగిన రెండో దశ 10 రాష్ట్రాల్లో, 2 కేంద్రపాలిత ప్రాంతాల్లో 5.72 కోట్ల పేర్లు జాబితా నుంచి తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 2.05 కోట్ల ఆంధ్రప్రదేశ్‌లో మూడో దశలో 44.89లక్షలు ఐదారు కోట్ల ఓట్లు తొలగింపు ప్రధానంగా జరిగింది. వీటికి లెక్కాపత్రాలుండవని చెప్పలేం కానీ ఎవరికి కొత్తగా ఓటుహక్కు కల్పించబడిందో ఎవరికి ఆ హక్కు తొలగించబడిందో తెలియని గందరగోళ పరిస్థితిఏర్పడింది. ఈరాష్ట్రంలో దాదాపు 44.89 లక్షలమేరకు ఉంది. ఇకపై క్లెయిమ్‌లు, అభ్యంతరాల ప్రక్రియ ఉంది.పౌరుని ప్రజాస్వామ్య హక్కును ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగింపునకు గురవరాదు. తెలంగాణలో ఓటర్ల వద్ద నుంచి సేకరించిన 78.26శాతం ఎన్యూమరేషన్ ఫారాల సమీక్ష, ఇంకా వారి నుండి సేకరించలేకపోయిన 22 శాతం ఫారాలను కూడా విస్తృత తనిఖీ, సేకరణ సమీక్షల ప్రాతిపదికన వారి హక్కులు తేల్చగలిగితేనే ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం గండం గడిచి మెట్టెక్కుతుంది. దాదాపు ఐదో వంతు ఓటర్ల పేర్లు తుది జాబితా నుంచి తొలగించే ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల కమిషనరే.



మిమ్మల్ని ప్రతిదానికీ పొగిడేవాడు మీకో రహస్య శత్రువని గమనించాలి.

అరిస్టాటిల్



వినపడనివారు కాదు, మంచి మాట వినిపించుకోనివారు నిజమైన బధిరులు.

డబ్ల్యు.ఎమర్సన్

# ప్రజావాక్కు



## కల్తీ నూనెలతో కేన్సర్

మననగరాలు,పట్టణాలలో హోటళ్ళుఅనేకంగా ఉన్నాయి. ఈ హోటళ్ళలో వంటలకు, మిఠాయిలకు, తినుబండారా తయారీకివాడే వంటనూనెలను ఒకసారికంటే ఎక్కువ సార్లు వాడటంతో ప్రజలు క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులకు గురిఅవుతున్నారు. వాడిన వంటనూనెను పదే పదే వాడటం నిషేధంఅయినా అనేక హోటళ్ళ యజమానులు పట్టించుకోవటం లేదు. అయితే దీనికో పరిష్కారం ఉంది. వాడేసిన వంటనూనెలను ప్రాసెస్ చేసి బయోడీజిల్ తయారీకి ఉపయోగించుకోవచ్చు. ఇప్పుడు మన దేశంలో అనేకపట్టణాలు,నగరాలలో హోటళ్ళవారి నుంచి వాడేసిన వంట నూనెలను సేకరిస్తున్నారు. దీనివల్ల హోటళ్ళ వారికి రాబడేకాకప్రజల ఆరోగ్యాలు కాపాడబడతాయి. శిలాజ ఇంధనాల కంటే బయోడీజిల్ ఉత్తమం. ఆహార భద్రతాధికారులు ఈ విషయమై లోతుగా ఆలోచించి ఒక ప్రణాళిక రూపొందించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

## శిక్షణా సదుపాయాలు కల్పించాలి

గ్లాస్గోలో జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ 13 స్వర్ణాలతో సహా మొత్తం 39 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలవడందేశ క్రీడారంగానికి ప్రోత్సాహకరమైన పరిణామం. ఈవిజయం యాదృచ్ఛికంగా రాలేదు. సరైన ప్రణాళిక,మెరుగైన కోచింగ్, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యం, ఆధునిక శిక్షణా కేంద్రాలు, క్రీడాకారుల నిరంతర శ్రమకలిసి ఈ ఫలితాన్ని అందించాయి. ఇది భారత క్రీడా విధానానికి కొత్తదిశనుసూచిస్తోంది. భారత్ ఇంకా ప్రపంచ క్రీడా శక్తిగా ఎదగాలంటే భారీ క్రీడా ఈవెంట్ల నిర్వహణ కంటే క్రీడాకారుల అభివృద్ధికే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచస్థాయి స్టేడియాలు నిర్మించడం అవసరమే అయినప్పటికీ, వాటిని వినియోగించే ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్దడం మరింత ముఖ్యమైనది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## జీవితం శాశ్వతం కాదు

ఈ బాహ్య ప్రపంచంలో సాధారణ మానవుని జీవితం ఎప్పుడూ ఎలా నిర్జీవంగా మారుతుందో అంచనా వేయలేం. అందుకే ప్రతిక్షణం కుటుంబ సభ్యులతో, సన్నిహితులతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతూ జీవన విధానాన్ని ముందుకు సాగించాలి. ఆరోగ్యానికి ఎక్కువ సమయం కేటాయించాలి.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## వాన నీటిని ఒడిసి పడదాం

ప్రకృతి మనకు అందించే అమూల్యమైన వరం వాన నీరు. ఇంటి పరిసరాల్లో చిన్న ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాన నీటిని నిల్వ చెయ్యాలి. ఇలా చేయడం వల్లవర్షపు నీరు వృథాగా ప్రవహించకుండా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల పెరుగుదలకు తోడ్పడుతుంది. ప్రతి ఇంట్లోనూ సాధ్యమైనంత మేరకు వాననీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీటి కొరతను ఎదుర్కోవాలంటే ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి. నీరు లేకుండా జీవనం సాధ్యం కాదు కాబట్టి, వాన నీటిలో ప్రతి చుక్కను విలువైనదిగా భావించి సంరక్షించాలి.నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం కూడా ప్రతిపౌరుడి బాధ్యత. మనం కాపాడే ప్రతినీటిచుక్క భవిష్యత్తు తరాలకు ఎంతోవిలువైన సంపదగా మారుతుంది. వాననీటిని ఒడిసి పట్టి, భరోసా కల్పిద్దాం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## విశ్వాస ఘాతుకులదే రాజ్యం

వీరిని నేనెందుకు పోషించాలి, వీరిభారం నేనెందుకు మోయాలి, వీరి కోసం నా డబ్బు ఎందుకు ఖర్చు చేయాలి అనుకునే పుత్రరత్నాలు తల్లిదండ్రులనువృద్ధాశ్రమాలకు తరలిస్తున్నారు. అది కూడా దండగ అనుకునే ప్రబుద్ధులు నడిరోడ్డుమీద వదిలిపెట్టిపోతున్నారు. కొందరు మంచి వాళ్లు తల్లిదండ్రులపై ప్రేమగౌరవం ఉన్నవారుకూడా పెళ్లికాగానే మారిపోతున్నారు. భార్య చెప్పే మాటలు విని తల్లిదండ్రులను చూడ్డం మానేస్తున్నారు. వారిలానే ఈ మధ్య కొందరు రాజకీయ నాయకులు తమ స్వార్థబుద్ధిని చూపుతున్నారు. అధికారం ఉన్నన్ని రోజులు ఒకపార్టీలో ఉండి పదవులు అనుభవించి ఆ పార్టీ అధికారం కోల్పోగానే పార్టీకి ద్రోహం చేస్తున్నారు.

- రాశి, హైదరాబాద్

## ఉపాధి హామీలో ప్రత్యామ్నయ పంటలు

పంటల వైవిద్యం గురించి ఇప్పటి ఎల్‌నీనో ప్రభావం గురించి రాష్ట్రాలు మాట్లాడుతూనే ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో తిరిగినప్పుడు పంటల వైవిధ్యానికి రైతులు కొన్ని ప్రయత్నాల ద్వారా ముందుకు వస్తున్నా ప్రభుత్వ సబ్సిడీల గురించి వారు అడుగుతున్నారు. మాఖన అని బీహార్ హార్యానలో పండే పంట ఈ పంట పండించడానికి అనువైన పరిస్థితులు తెలంగాణలో కూడాఉంది. తెలంగాణ ఫారం పాండ్స్ కుంటలు చెరువులు ఆ మాఖానా సాగుకు అనువుగా ఉన్న పరిస్థితులు. కావున ఒక పంటకు ఉపాధి హామీలో కొంత మెయింటనెయన్స్ ఇస్తే రైతులు ముందుకు వస్తారు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# కొత్త ఒడంబడికలతో మరిన్ని సంఘర్షణలు!

*ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేధ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది. ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే!*



రావులపాటి సీతారాంరావు

వెస్ట్ ఆసియా దేశాలు పాకిస్థాన్లో మక్కాలో చేసుకున్న ఒడంబడిక ఒక విధంగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలకు అనుకూలంగా ఇరాన్ యుద్ధ నైపుణ్యాన్ని నియంత్రించటానికి అమెరికా పన్నిన ఎత్తుగడా అని అంతర్జాతీయ విశ్లేషకులు సందేహిస్తున్నారు! ఒక్క పాకిస్థాన్ దేశానికే అణ్వాయుధాలు వున్నాయి! వెస్ట్ ఆసియాలోని సౌత్ అరేబియా, టర్కీ దేశాలలో అమెరికా యుద్ధ స్థావరాలను ఎన్నో సంవత్సరాల క్రింద ఏర్పరుచుకొని ప్రపంచదేశాల నాయకత్వాన్ని పదిలంగా ఉంచుకోటానికి నాటో సియస్ సంస్థలను స్థాపించి సోవియట్ రష్యా, చైనాలను అదుపులో ఉంచేందుకు వేసిన ప్రణాళికలో భాగమని అందరికీతెలుసు! అప్పట్లో అలీన విధానాన్ని రూపొందించి ఇండియా ముస్లిం దేశాలతో మరికొన్ని దేశాలకు నాయకత్వం వహించి తటస్థంగా వుండటం ఎంత మంచిదో తర్వాత కాలాల వారికి తెలిసింది! యు.యన్.ఓ ఈ రాజకీయ సమీకరణకు కాస్తఊతం ఇచ్చినట్లయితే యు.యన్.ఓ స్థాపనకు ఒక అర్థమూ ప్రయోజనమూ సమకూరేది! దురదృష్టవశాత్తు అది జరగక పోవటం వల్ల ప్రపంచ దేశాల మధ్య వచ్చే గొడవలకు ఎంపైర్ లేకుండా పోయినట్లయింది! యు.యన్. ఓ ఎంపైరింగ్‌జాబ్ వదిలేసి 'సైలెంట్ స్పెక్టేటర్'గా మారింది! అందువల్లే ఏ అంతర్జాతీయ సమస్య అయినా, సంఘర్షణలు ఐనా పరిష్కారం లేకుండా ఏళ్ల తరబడి ఇబ్బందులను కలిగిస్తూనే ఉన్నాయి! ఆగస్టు 7న జరిగిన ఈ మక్కా ఒడంబడిక, ఒక విధంగా ఇరాన్‌ను నిలువరించే శక్తియుక్తులు క్రమేపీ కరిగి పోవటంతో, యు.యస్.ఏ ఈ కొత్త ప్రణాళికకు తెరదీసిందా అన్న అనుమానం సామాన్యులకు గూడా కలుగుతున్నది! ఈ మూడు దేశాలు 'జాయింట్ సెక్యూరిటీ' పేరుతో చేసుకున్న ఈ అగ్రిమెంట్ ఈ మూడు దేశాలలోని ఏ ఒక్క దేశంపై మరో దేశం దాడిచేయ ప్రయత్నించినా మిగతా రెండు దేశాలు తమ దేశాల మీద దాడిగానే భావించి సమిష్టి రక్షణలో భాగంగా దాడిచేసిన దేశం కానీ దేశాలను కాని, నిలవరించి, దాడులను త్రిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపేందుకే ఈ 'ఒడంబడిక' పనికి వస్తుంది! నాటో అంతరించిన నేపథ్యంలో ఈ సమిష్టి రక్షణ ఒడంబడికలు ఎంతవరకు ఉపయోగపడ్తాయో అప్పుడే చెప్పటం కష్టం కానీ అణ్వాయుధాలతో డ్రోన్‌లతో నవ్యతతో కూడుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో అన్నిటినీ మించి ప్రస్తుతం వరంగా వెలిసిన 'కృత్రిమ మేధ' (ఎ.ఐ) ఆయుధంతో, ఇలాంటి రక్షణ ఒడంబడికలు నామమాత్రంగానే మిగులుతాయేమో! పాకిస్థాన్ ఇండియాతో వున్న పరిస్థితులను ఎదుర్కోటానికి, పి.ఒ.కే (పాకిస్థాన్ ఆక్యుపైడ్ కాశ్మీర్)ను నియంత్రించటానికి, బెలూచిస్థాన్ రెబెలియన్ తట్టుకోలేక ఈ ఒడంబడికకు సిద్ధపడిందా అన్న అనుమానం కూడా యుద్ధ నిపుణులకు కలుగుతున్నది! నిన్న మొన్నటిదాకా, అమెరికా సందిట చేరి, ఇరాన్ ఇజ్రాయిల్ దేశాల మధ్య మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్థాన్, అమెరికా, ఇరాన్‌ను పూర్తిస్థాయిలో ఎదుర్కోలేని దశలో, ఈ కొత్త పాచికకు తెరతీసినట్లుంది! హార్ముజ్ జలసంధి ద్వారా తమకు సంబంధించిన చమురు నౌకలను క్షేమంగా తమ తీరాలకు చేరాలనుకున్న పాకిస్థాన్‌కు ఇరాన్ స్పష్టంగా పాక్ నౌకలను అనుమతించమని తేల్చి చెప్పటంతో విధిలేని పరిస్థితులలో ఈనిర్ణయం తీసుకోవల్సి వచ్చినట్లుంది! ఇరాన్, పాక్ దేశాల మధ్య షియా, సున్నీ



మతపరమైన గొడవలు అనాది నుంచీ వున్నాయి! పైపైన కనపర్చిన స్నేహ సంబంధాలు ఈమధ్య కాలంలో ఏర్పడిన మార్పుల వల్ల బహిరంగంగా వదులుకోక తప్పటం లేదు! ఇండియా, చైనా దేశాలకు ఇరాన్ ఆయిల్ షిప్పు అనుమతిస్తున్నట్లు ప్రకటించటంతో ఇరాన్‌తో వున్న సంబంధం పూర్తిగా తెగినట్లయింది! అమెరికా వెస్ట్ ఏషియా ఇజ్రాయిల్‌దేశాల సమిష్టి బలాలకు ధీటుగా ఇండియా, రష్యా చైనా తమ స్నేహ సంబంధాలను మరింతగా మెరుగుపర్చుకున్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. బహుశా రానున్న కాలంలో అదే జరగొచ్చు! మాటిమాటికి ట్రంప్ ఉపయోగిస్తున్న 'శాంక్షన్స్' ఆయుధం వాడితగ్గిపోయింది! ఈమూడు దేశాలు అమెరికా డాలర్ విలువను తగ్గించటానికి తమ కరెన్సీ తమ తమ దేశాలలో చెల్లేట్లు చేసుకొని డాలర్‌ను బలహీనపర్చేందుకు చేసిన ఆలోచన ఇతర దేశాలు ముఖ్యంగా యూరోపియన్ స్కాండినేవియన్ దేశాలను కూడా కలవరపరుస్తున్నది! ఫ్రాన్స్,అమెరికా దేశాలు దూరమవుతున్న సంకేతాలు ఈ మధ్య ఇరు దేశాల నేతల మధ్య జరిగిన గొడవ స్పష్టపరుస్తున్నది! ఇదివరకు జరిగిన అంతర్జాతీయ ఒడంబడికలు రెండు బలమైన దేశాలు అమెరికా, రష్యాల నాయకత్వాన్ని ప్రోత్సహించేందుకు, బలపర్చేందుకు ఏర్పడినవే! ఇప్పుడు కాలం మారింది! ప్రాంతీయంగా బలంగా వున్న దేశాలు, తమ తమ బలాలను పెద్ద దేశాలకు ధీటుగా తమ స్వీయ రక్షణకు ఏర్పరుచుకొనేందుకు సిద్ధంగా వున్నట్లు ఈ 'మక్కా ఒడంబడిక' బహిర్గత పరుస్తున్న మాట నిజం! అమెరికా దేశంలో అన్ని రకాల ఆయుధాలు ఈ మధ్య ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో ఉపయోగించటం వల్ల వాటి నిలవల సంఖ్య బాగా తగ్గిపోయి ఆయుధాలు ఉత్పత్తి చేసే కార్మాగారాలు, కొత్త సామాగ్రిని అందుబాటులో ఉంచితేనే ఇజ్రాయిల్‌కు మరింత వత్తాసు పలికే అవకాశం ఉంది. అందుకే ప్రెసిడెంట్ ట్రంప్ రోజుకోమాట చెప్తూ చర్చలు సాగుతున్నాయనే అభిప్రాయం కలగచేసే పనిలో ఉన్నారు. అది ఒక విధంగా అమెరికా బలహీనతను ప్రతిబింబిస్తున్నది. నిజానికి ఈ డిఫెన్స్ డీల్ దాదాపు నెల క్రితమే డీల్ మీద సంతకం చేసిన దేశాలు భయంతో ఉండటంతో హడావిడిగా ఈ డీల్ కుదుర్చుకున్నారు. ఇరాన్ మీద దాడి ఇంకా ఒక పరిష్కారానికి రాకపోవటం వెస్ట్ ఏషియా దేశాలకు పెద్ద దెబ్బే! అన్ని అరబ్ గల్ఫ్ దేశాలు ఇరాన్ దాడుల వల్ల ఒత్తిడిని ఎదుర్కోలేని స్థితిలో ఉన్నాయి. ఇరాన్‌తో సంబంధం ఉన్న హౌతీస్ (అన్సరన అల్లా) గత నెలలో సౌదీ ఆయిల్ వనరుల మీద దాడి చేసి రెడ్ సీపోర్టుల మీద బ్లాకేడ్ విధించటం వల్ల కోలుకోలేని దెబ్బకు ఈ దేశాలు గురి అయ్యాయి. ఆయిల్ సరఫరా ఆగిపోయే స్థితి వచ్చింది. ఈ డీల్ వల్ల సౌదీ అరేబియాకు రక్షణ కలిగే అవకాశం లేదని ఇరాన్ అధికార ప్రతినిధి బాహాటంగా చెప్పటం ప్రస్తుతం అమెరికా వత్తాసు పలుకుతున్న వెస్ట్ ఏషియా దేశాలు ఎంతటి క్లిష్టస్థితిలో ఉన్నాయో చెప్పకనే చెప్పినట్లయింది. పాకిస్థాన్ ఈ డీల్‌లో ఉండటం వల్ల ఒడంబడిక నమ్మశక్యంగా కనపడటం లేదు. ఎందుకంటే సెక్యూరిటీ పార్టనర్‌గా మక్కా డీల్‌లో సంతకం చేసి మీడియేటర్‌గా ఇరాన్ యుద్ధంలో ఉండటం వల్ల ఈ ఒడంబడిక ఒక కొలిక్కి వచ్చేట్లు లేదని విదేశాంగ విజ్ఞులు అభిప్రాయపడుతున్నారు. ఏ ఒడంబడిక అయినా సంఘర్షణలు ప్రారంభమయితే ఆపలేదన్నది చరిత్ర చెప్పకనే చెబుతున్నది. కేవలం ఇలాంటి ఒడంబడికలు మేమూ యుద్ధానికి 'సై' అంటున్నాం అని గంభీరంగా సంకేతాలు ఇవ్వటానికే పనికివస్తాయి! ప్రస్తుత కాలంలో ఒడంబడికలు కుదరట మనేది మేలు చేకూరుస్తుందని ఏ దేశమూ నమ్మే పరిస్థితిలో లేదు!కాలమే ఈ ఒడంబడికల కాలం ఇంకా చెల్లుబాటు అవుతుందా అన్న సందేహాన్ని తీర్చగలదు. కృత్రిమ మేధ తెర మీదికి వచ్చిన నేపథ్యంలో సాంప్రదాయ రీతుల్లో యుద్ధాలను కొనసాగించే స్థితి కనుమరగవుతున్నది.ప్రస్తుతం వున్న సంఘర్షణల్లోంచి ఇలాంటి రక్షణపరమైన ఒడంబడికలు మరిన్ని పుట్టుకొని వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు! ఇజ్రాయిల్ అమెరికా, మొదట్లో గోటితో పోతుందనుకున్న సమస్య గొడ్డలిదాకా రావటం అందర్నీ ఆశ్చర్యపరుస్తునే వుంది! అయితే సాంకేతికంగా వృద్ధి పొందుతూ ఎ.ఐ ని అనుకూలంగా ఉపయోగించు కొనేందుకు సిద్ధపడుతున్న దేశాలు ఎలాంటి విపరీత పరిణామాలకు దారితీసే విధంగా ప్రవర్తిస్తాయో వేచి చూడాల్సిందే!

# మత్స్యకారుల భద్రతకు ఏదీ భరోసా?

కామిడి సతీష్ రెడ్డి

కొందరు మత్స్యకారులు లైసెన్స్, రిజిస్ట్రేషన్లు వంటివి సరిగా లేకుండానే చేపల వేటకు వెళుతూఉన్నారు. బైక్, కారు, లారీ ఇలా వాహనం ఏదైనా నడపాలంటే లైసెన్స్ ఉండాలి. టూ వీలర్ అయితే హెల్మెట్ ధరించాలి. కారు నడిపితే సీటు బెల్ట్ పెట్టుకోవాలి. ప్రమాదం జరిగితే ఆర్థికంగా నష్టపోకుండా తప్పనిసరిగా బీమా తీసుకోవాలి. వీటిలో ఏది లేకపోయినా అధికారులు జరిమానా వేస్తారు. ఇందుకోసం రహదారులపై ఎక్కడికక్కడ పోలీసులు కాపుకాసి తనిఖీలు చేస్తుంటారు. మరి సముద్రంలో చేపల వేటకు వెళ్లే సమయంలో బోటు యజమానులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి?,వాటిని పాటిస్తున్నారా?, లేదా? అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.విశాఖ జిల్లా గంగవరం పోర్టు సమీపాన ఈ నెల మొదటి వారంలో బోటు మునిగిపోయి ఆరుగురు మత్స్యకారులు మరణించారు. బోటు యజమాని ఒక్కడే బతికి బయటపడ్డాడు. ప్రభుత్వం తనకు ఏమీ సాయం చేయలేదని, చనిపోయిన కుటుంబాలకే రూ.10 లక్షల నష్టపరిహారం ఇచ్చిందని వాపోతున్నారు. నిన్నటికి నిన్న ఓ బోటు బ్రేక్ వాటర్స్ సమీపాన బోల్తాపడింది. ఇద్దరు గాయపడ్డారు. తమకు బోటుకు రూ.2 లక్షలు, వలకు రూ.2.5 లక్షల నష్టం జరిగిందని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ మెరైన్ ఫిషింగ్ రెగ్యులేషన్ (ఏపీఎంఎఫ్ఆర్) చట్టం ప్రకారం సముద్రంలో చేపల వేటకు వెళ్లే ప్రతి బోటు తప్పనిసరిగా మత్స్య శాఖ అధికారుల వద్ద రిజిస్టర్ చేసుకోవాలి. లైసెన్స్ తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 మాత్రమే. లైసెన్స్ ఫీజు రూ. 50. నిబంధనల ప్రకారం రెన్యువల్ చేయించుకోవాలి. వేటకు వెళ్లే ప్రతిసారి ముందుగా సమీపంలోని సాగర మిత్రకు సమాచారం ఇవ్వాలి. ఏ బోటు వేటకు వెళుతుంది?,ఎంతమంది (పేర్లతో సహా) వెళుతున్నారు?, ఏ దిక్కున వెళుతున్నారు?, ఎంత ఆయిల్ పోయించుకొని వెళుతున్నారు? అనే వివరాలు అందించాలి.వేటకు వెళ్లే బోటు ఫిట్‌గా ఉందని సర్టిఫై చేయించుకోవాలి. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, సర్వేయర్ సంయుక్తంగా బోటునుతనిఖీ చేసి, బాగుందని, వేటకు అనువైనదని, అందులో అన్నీ ఉన్నాయని సర్టిఫై చేస్తేనే రెన్యువల్ చేస్తారు. అప్పుడే అది వేటకు వెళ్లాలి. ప్రతి బోటులో ఎంత మంది ఉంటే అంత మందికి ప్రమాదంలో ఉపకరించే లైఫ్‌జాకెట్లు, అగ్నిప్రమాదం సంభవిస్తే నివారించడానికి ఫైర్‌ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, బీమా పత్రాలు ఉండాలి. విశాఖపట్నంలో లక్ష రూపాయల నుంచి రూ.50 లక్షల వరకు ఖరీదు చేసే బోట్లు చేపల వేటకు వెళుతున్నాయి. చాలామంది పాత బోట్లను కేరళ, తమిళనాడు ప్రాంతాల నుంచి తీసుకువచ్చి ఇక్కడ వేటకు ఉపయోగిస్తున్నారు. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయించడం లేదు. రోడ్లపై వాహనాలను తనిఖీ చేసినట్టు హార్బర్‌లో బోట్లను ఎవరూ తనిఖీ చేయడం లేదు.అక్కడ కూడా రాజకీయాలు నడుస్తున్నాయి. సంఘాల నాయకులు తనిఖీలుజరగకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. తోటి మత్స్యకారులకు ప్రాణాపాయం అని తెలిసినా అధికారులకు సహకరించడం లేదని ఈత వచ్చునని, గంగమ్మ ఒడిలో పెరిగామని, ఏ నష్టం జరగదని సమర్థించుకుంటున్నారు. బీమా చేయించుకున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే కంపెనీయే నష్టపరిహారం ఇస్తుంది. ఆ దిశగా కూడా వారికి హితబోధ చేయడం లేదు. ఇకనైనా బోటుయజమానులు నిబంధనలు పాటించేలా చూడాలి. మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు లేకుండా, బీమా చేయ కుండా సముద్రంలోకి పంపించే బోట్ల యజమానులపై క్రిమినల్ కేసులు పెడితే ప్రమాదాలూ తగ్గుముఖం పడతాయి. ప్రాణనష్టం తగ్గుతుంది.బోటు ఖరీదు రూ.లక్ష అయినా రూ.1.2 లక్ష సాయం మత్స్యకారులపట్ల కూటమి ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తోంది. లక్ష రూపాయల ఖరీదు చేసే బోటు అయినా సరే చేపల వేట నిషేధ సమయంలో బోటుకు ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.20 వేలు చొప్పున రూ.1.2లక్షల ఆర్థికసాయం చేస్తోంది. చేపల వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అధికారులు ప్రతి బోటును తనికీ చేయాలి. బోట్ డ్రైవర్స్ మద్యం సేవించి బోట్స్ నడపకుండా తగిన చర్యలు తీసుకోవాలి. కాలం చెల్లిన బోట్లను సముద్రంలోకి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# తలసరి ఆదాయంలో ముందుకు, పెట్టుబడుల్లో వెనుకకు



డాక్టర్ తిరునహరి శేషు

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన ఈ 12 వసంతాల తన ప్రయాణంలో అనేక మైలురాళ్లను చేరుకుంటూ దేశంలోని పెద్ద రాష్ట్రాలతో పోటీపడుతూ అనేక ఆర్థికాభివృద్ధి సూచికలలో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఫ్రంట్ రన్నర్ స్టేట్‌గా తెలంగాణ దేశంలో 11వ స్థానంలో పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలిచిందని నీతి ఆయోగ్, అలాగే తలసరి జిఎన్ఐలో మూడవ స్థానం దక్కించుకుందని ప్రపంచ బ్యాంక్ తన నివేదికలలో వెల్లడి చేసింది. ఒక అస్పిరేషనల్ స్టేట్‌గా తెలంగాణ 2014 నుండి జి.ఎస్.డి.పిలోనూ తలసరి ఆదాయంలోనూ గణనీయమైన ప్రగతిని సాధించింది. 5407 డాలర్ల తలసరి జిఎన్ఐతో తెలంగాణ రాష్ట్రం ఎగువ మధ్య స్థాయి ఆదాయ రాష్ట్రంగా (యుఎంఐఎస్) ఢిల్లీ కర్ణాటకల తర్వాత దేశంలోమూడవ స్థానాన్ని దక్కించుకుందని ఇటీవల ప్రపంచ బ్యాంక్ తన కంట్రీ ఇన్కమ్ క్లాసిఫికేషన్ 2026 నివేదికలో వెల్లడి చేసింది. 6217 డాలర్ల తలసరి జిఎన్ఐతో ఢిల్లీ, 5579 డాలర్ల తలసరి జిఎన్ఐతో కర్ణాటక రాష్ట్రాలు దేశంలో తెలంగాణ కంటే ముందు వరుసలో నిలబడినాయి. తెలంగాణతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు దక్షిణాది నుండి తలసరి జిఎన్ఐలో మొదటి ఐదు స్థానాల లో స్థానం దక్కించుకున్నాయి. ఆర్‌బిఐ నివేదిక ప్రకారంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను4,18,931 రూపాయల తలసరి ఆదాయంతో కర్ణాటక(4,33,326)తరువాత తెలంగాణ దేశంలో రెండవ స్థానంలో నిలిచింది. ఆర్‌బిఐ, నీతి ఆయోగ్‌ల నివేదికల ప్రకారంగా తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో దేశంలో రెండు మూడు స్థానాలలో నిలవటం రాష్ట్రఆర్థిక సామర్థ్యాన్ని తెలియజేస్తుంది.తెలంగాణ రాష్ట్రానికె చెందిన రంగారెడ్డి జిల్లా 11.46 లక్షలరూపాయల తలసరి జిఎన్ఐతో దేశంలోనే మొదటి స్థానాన్ని దక్కించు కుంది. దేశంలోని ప్రఖ్యాత సంస్థలు విడుదల చేస్తున్న నివేదికల ప్రకారంగా గడిచిన 12సంవత్సరాలలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో గణనీయమైన వృద్ధిని సాధించినట్లుగా కనపడుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలు అభివృద్ధి సాధన ప్రక్రియలో భాగంగా పెట్టుబడులకి అనువైన వాతావరణాన్ని కల్పించే చర్యలు చేపడుతున్నాయి. 2014 నుండి తెలంగాణ రాష్ట్రం కూడా విదేశీ, దేశీయ ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల నుండి పెట్టుబడులను ఆకర్షించడానికి




పెట్టుబడుల సాధన కోసం రాష్ట్రంలో అనువైన వాతావరణాన్ని కల్పించడానికి చర్యలు చేపడుతున్నా పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశపరిచిందనే చెప్పాలి. ఇటీవల నీతి ఆయోగ్ విడుదల చేసిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026 నివేదిక ప్రకారంగా పెట్టుబడులకు అనువైన వాతావరణం ఉన్న 28రాష్ట్రాలు 8 కేంద్రపాలిత ప్రాంతాలలో తెలంగాణ రాష్ట్రం 13వ స్థానంలో పెద్ద రాష్ట్రాల జాబితాలో 10వ స్థానం దక్కించుకుంది. రాష్ట్ర ఏర్పాటు నుండి తెలంగాణ రాష్ట్రం కూడా పెట్టుబడిదారుల పెట్టుబడులకు రక్షణ కల్పించి పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం టీఎస్ ఐపాస్, ఐటి, ఎంఎస్ఎం ఈ పాలసీలను రూపొందించడమే కాదు పెట్టుబడులసాధన కోసం తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047తో పాటు హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సుని కూడా నిర్వహించింది. హైటెక్ సిటీ తరహాలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీని (ఫ్యూచర్ సిటీ) నిర్మిస్తుంది. అదేవిధంగా పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ముఖ్యమంత్రి స్వయంగా దావోస్ పెట్టుబడిల సదస్సులలో పాల్గొనటంతో పాటు అమెరికా, దక్షిణ కొరియా, జపాన్ లాంటి దేశాలలో కూడా పర్యటించారు. హైదరాబాద్ లాంటి నగరం, పారిశ్రామిక అవసరాల కోసం 30వేల హెక్టార్ల భూమి ఉన్న ఏకైక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ పెట్టుబడులకు అనువైన రాష్ట్రాల జాబితాలో 13వ స్థానంలో నిలబడటం కొంత నిరాశ కలి గించే అంశమే.పరిశ్రమలకు అనుమతులు ఇచ్చే మెకానిజం గా కాకుండా పరిశ్రమలతో కలిసి నడిచే భాగస్వామిగా ఉండాలనేది రాష్ట్ర ప్రభుత్వ దృక్పథమని ప్రభుత్వం చెబుతున్నా ఆశించిన స్థాయిలో తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించలేకపోతుంది. పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడంలో గుజరాత్, మహారాష్ట్ర,తమిళనాడులు మొదటి వరుసలో నిలబడటంతో ఆ రాష్ట్రాలు ఎక్కువ మొత్తంలో పెట్టుబడులను సాధించగలుగుతున్నాయి.టీఎస్ ఐపాస్ లాంటి పారిశ్రామిక విధానం,పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నప్పటికీ ఈఅంశంలో రాష్ట్రం తన పరిస్థితిని మెరుగుపరచుకోవటానికి ప్రభుత్వ సంస్థాగత విధానాలను మరింత సరళీకరిస్తూ, మౌలిక సదుపాయాలను మరింత బలపరుస్తూ, పర్యావరణ స్థిరత్వాన్ని మెరుగుపరుస్తూ, సైబర్ ఆర్థికనేరాలను నియంత్రించటం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైనవాతావరణాన్ని కల్పిస్తే రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి యువతకి ఉద్యోగ అవకాశాలను విస్తృత పరచగలుగుతాం, రాష్ట్ర ఆదాయాన్ని కూడా పెంచే అవకాశాలుంటాయి. రాష్ట్ర ఆదాయం,తలసరి ఆదాయం ఎంత పెరిగినా ఉపాధిరహిత వృద్ధి నిజమైన ఆర్థికాభివృద్ధిని ప్రతిబింబించదు కాబట్టి దేశంలో తెలంగాణ రాష్ట్రం తలసరి ఆదాయంలో రెండవ స్థానంలో, మూడో స్థానంలో నిలిచినా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో ఉపాధి అవకాశాలను విస్తృత

12-8Pg5exBPGOL.qxd:12-8Pg5exBPGOL.qxd 1/1/02 6:54 AM Page 1



# సిరియా మాజీ అధ్యక్షుడు బషేర్ అల్ అసద్‌కు మరణశిక్ష



**డమాస్కస్, ఆగస్టు 11:** సిరియా మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌కు అక్కడి కోర్టు మంగళవారం మరణశిక్ష విధించింది. 14 ఏళ్ల అంతర్యుద్ధం సమయంలో యుద్ధ నేరాలు, మానవత్వానికి వ్యతిరేక నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించిన కోర్టు ఆయన పరోక్షంలోనే ఈ తీర్పు ఇచ్చింది. ఈ అంతర్యుద్ధంలో సుమారు 5 లక్షల మంది ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అసద్ సోదరుడి కుమారుడు అతెఫ్ నజీబ్‌కు కూడా కోర్టు మరణశిక్ష విధించింది. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేసేందుకు చేపట్టిన చర్యలకు నజీబ్ నాయకత్వం వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ చర్యలే అనంతరం తిరుగుబాటుకు, అంతర్యుద్ధానికి దారితీశాయి. తీర్పు వెలువడే సమయంలో నజీబ్ కోర్టులోనే ఉన్నాడు.అసద్ 2011లో దారా ప్రావిన్స్‌లోని పొలిటికల్ సెక్యూరిటీ బ్రాంచ్‌కు అధిపతిగా పనిచేసిన మాజీ సిరియా ఆర్మీ బ్రిగేడియర్ జనరల్. అనంతరం ఆయనను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. 2024 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌ను స్వాధీనం చేసుకోవడంతో అసద్, ఆయన సోదరుడు మహెర్ రష్యాకు పారిపోయారు. దీంతో అసద్ 24 ఏళ్ల పాలనకు తెరపడింది. హయత్ తహ్రీర్ అల్‌షామ్ నేతృత్వంలోని తిరుగుబాటు దళాలు అసద్ డమాస్కస్ ప్యాలెస్‌ను స్వాధీనం చేసుకుని, ఫెరారీ, ఆస్టన్ మార్టిన్, రోల్స్ రాయిస్, బీఎండబ్ల్యూ వంటి విలాసవంతమైన కార్లతో నిండిన భారీ గ్యారేజీని కూడా తనిఖీ చేశాయి. అసద్‌కు మరో దగ్గరి బంధువు అతీఫ్ నజీబ్‌కు కూడా మరణశిక్ష విధించారు. 2011లో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా ఉన్నారు. ఆ సమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించినట్లు కోర్టు పేర్కొంది. 15 ఏళ్లలోపు చిన్నారులను ఉద్దేశపూర్వకంగా హతమార్చడం, హింసకు పాల్పడి మరణాలకు కారణం కావడం వంటి నేరాలకు నజీబ్ పాల్పడ్డారని కోర్టు నిర్ధారించింది. సిరియాలో కొత్తగా ఏర్పడిన తాత్కాలిక పాలకుల హయాంలో మాజీ ప్రభుత్వ నేతలపై జరుగుతున్న విచారణల్లో ఇది కీలక పరిణామంగా నిలిచింది. గత ప్రభుత్వంలో పనిచేసిన పలువురిపై ప్రస్తుతం కేసులు నడుస్తున్నాయి. ఇస్లామిస్ట్ నేతృత్వంలోని బలగాలు డమాస్కస్ వైపు దూసుకెళ్లడంతో 2024 డిసెంబరులో అసద్ కుటుంబంతో కలిసి సిరియా నుంచి పారిపోయారు. అనంతరం మాస్కోలో ఆశ్రయం పొందారు. మరోవైపు నజీబ్‌ను అరెస్టు చేసి విచారణకు హాజరుపరిచారు. మాజీ ప్రభుత్వంలో విచారణ ఎదుర్కొంటున్న అత్యున్నత స్థాయి అధికారుల్లో ఆయన ఒకరు.

# కేన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించాలి: సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించని 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వెంటనే ఆదిశగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. క్యాన్సర్ కేసులను తప్పనిసరిగా నమోదు చేయడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించడంతో పాటు బాధితులకు సరైన వైద్యం అందేలా చూడాలని స్పష్టం చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసుల నేపథ్యంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఇప్పటికే 17 చోట్ల క్యాన్సర్‌ను నోటిఫైడ్ వ్యాధిగా ప్రకటించినట్లు కోర్టుకు తెలియజేశారు.

# ముందు సరిగ్గా బట్టలేసుకోండి

## ఆప్ ఎమ్మెల్యేకు ఢిల్లీ సిఎం రేఖాగుప్తా హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అండర్‌వేర్ మాత్రమే ధరించి మహిళల నుంచి వినతులు స్వీకరించిన ఆప్ ఎమ్మెల్యేపై ఢిల్లీ సిఎం రేఖాగుప్తా ఆగ్రహం వ్యక్తం చేశారు. దుస్తులు సరిగ్గా వేసుకోవాలంటూ ఎమ్మెల్యేకు సూచించారు. ఢిల్లీ వాయువ్య ప్రాంతంలోని కిరారి నియోజకవర్గం నుంచా ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి అనిల్ ఝూ వాత్స్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నాడు. అతడు తాజాగా తన ఇంటి దగ్గర బయట కుర్చీ, టేబుల్ వేసుకుని కూర్చున్నాడు. ప్రజల దగ్గర నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కొందరు మహిళలు కూడా ఆయనకు వినతిపత్రాలు సమర్పించారు. అయితే, ఇవి స్వీకరించే సమయంలో ఆ ఎమ్మెల్యే ఒక ఫుల్ బనియన్, చిన్న నిక్కరు మాత్రమే ధరించి ఉన్నారు. అవి పూర్తిగా లోదుస్తులు. అలాంటి దుస్తులు ధరించి, ఇంటి బయట బహిరంగంగా కూర్చుని ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి సంబంధించిన విడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక ఎమ్మెల్యే ఇలా సరిగ్గా దుస్తులు వేసుకోకుండా ఉండటంపై పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అంశంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా స్పందించారు. ఎమ్మెల్యే సరిగ్గా దుస్తులు వేసుకోవాలని సూచించారు.

# నేతాజీ అస్థికల తరలింపు

## కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు



**న్యూఢిల్లీ,ఆగస్టు11:**స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ పార్థివ దేహాన్ని జపాన్ నుంచి భారత్‌కు తీసుకురావాలని ఆదే శాలు జారీ చేయాలని కోరుతూ దాఖలైన పిటి షన్‌పై మంగళవారం సుప్రీంకోర్టు కేంద్రం స్పం దనను కోరింది. నేతాజీ కుమార్తె అనితా బి. ఫాఫ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్‌లు జయమల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వానికి, విదేశాంగ మంత్రిత్వ శాఖకు, హోం మంత్రిత్వ శాఖకు నోటీసులు జారీ చేసింది. సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు నేతాజీ కుమార్తె తరఫున సీనియర్ న్యాయవాది డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 28కి వాయిదా వేశారు. దశాబ్దాలుగా సుభాష్ చంద్రబోస్ అస్థికలుగా భావిస్తున్న వాటిని భద్రపరిచిన జపాన్‌లోని టోక్యోలో ఉన్న రెంకోజీ ఆలయం నుంచి నేతాజీ పార్థివ దేహాన్ని తిరిగి తీసుకురావాలని ఈ పిటిషన్‌లో కోరారు. నేతాజీ కుమార్తె చట్టబద్ధమైన వారసురాలు అయినందున, అనితా బోస్ ఫాఫ్‌కు ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో ప్రస్తావించే హక్కు ఉందని పేర్కొంటూ, పార్థివ దేహాన్ని భారతదేశానికి తిరిగి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు.

# టిఎంసి బ్యాంక్ ఖాతాలు ఇడి జప్తు

## జోక్యానికి సుప్రీం 'న్లో', రెండు పిటిషన్లు కొట్టివేత

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:**మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్తంభింపజేసిన తృణమూల్ కాంగ్రెస్ బ్యాంకు ఖాతాలపై కోల్‌కత్తా హైకోర్టు విధించిన ఆంక్షల విషయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు మంగళవారం నిరాకరించింది. ఇడి తమ ఖాతాలను స్తంభింపజేయడాన్ని సవాలు చేస్తూ టిఎంసిదాఖలు చేసిన పిటిషన్‌పై ఎలాంటి మధ్యంతర ఉపశమనం కల్పించేందుకు కోల్‌కత్తా హైకోర్టు నిరాకరించడాన్ని సవాలు చేస్తూ మమ త బెనర్జీ నేతృత్వంలోని టిఎంసి వర్గం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ పిబి వరలేలతో కూడిన ధర్మాసనం విచారించింది. అక్రమ ఆర్థిక లావాదేవీలు,చట్టవిరుద్ధంగా డబ్బు వసూలు చేయడం, కొన్ని పార్టీ ఖాతాల ద్వారా అనుమానాస్పద నిధులను మళ్లించడం వంటి ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ పోలీసులునమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ దర్యాప్తులో భాగంగా, మొత్తం రూ.440.42 కోట్ల నిల్వలు ఉన్న మూడు బ్యాంకు ఖాతాలను ఇడి స్తంభింపజేసిన విషయం తెలిసిందే.

# కొలంబియాను కుదిపిన భూకంపం

## పెద్దసంఖ్యలో భవనాలు, ఆసుపత్రులు ధ్వంసం, 130మందిపైగా మృతి



**బొగోటా, ఆగస్టు 11:** పశ్చిమ కొలంబియాలో సంభవించిన శక్తివంతమైన భూకంపం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ ఘటనలో కనీసం 132 మంది మృతి చెందగా, భారీగా ఆస్తి నష్టం జరిగింది. పలు భవనాలు, ఆసుపత్రులు దెబ్బతిన్నాయి. మౌలిక వసతులు ధ్వంసమయ్యాయి. శిథిలాల కింద పలువురు చిక్కుకున్నట్లు సమాచారం. కొలంబియా జియోలాజికల్ సర్వీస్ ప్రకారం 21వ శతాబ్దంలో దేశంలో నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం ఇదే. కొలంబియా అధ్యక్షుడిగా ఉన్న అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా ప్రమాణ స్వీకారం చేసిన కొద్ది రోజులకే ఈ విపత్తు చోటుచేసుకుంది. ఇదే సమయంలో పొరుగున ఉన్న వెనిజులాలోనూ జూన్‌లో వరుసగా సంభవించిన రెండు భారీ భూకంపాలు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ఆ ఘటనల్లో ఆరువేల మందికి పైగా మృతి చెందినట్లు సమాచారం. అనేక ప్రధాన టెక్టానిక్ ప్లేట్ల సరిహద్దులపై లాటిన్ అమెరికా ప్రాంతం ఉండటంతో భూకంపాలు ఈ ప్రాంతానికి తరచూ ముప్పుగా మారుతున్నాయి. గత శతాబ్దాల్లో ఈ ప్రాంతంలో సంభవించిన పలు భూకంపాలు భారీ ప్రాణనష్టానికి దారితీశాయి.హైతీలో సంభవించిన భూకంపం ఆధునిక చరిత్రలో అత్యంత ప్రాణాంతక ప్రకృతి విపత్తుల్లో ఒకటిగా నిలిచింది ఈ విపత్తు కారణంగా సుమారు 8 బిలియన్ డాలర్ల ఆర్థిక నష్టం సంభవించింది. ఈక్వెడార్–కొలంబియా వరుసగా సంభవించిన శక్తివంతమైన భూకంపాలు ఈక్వెడార్, పలు ప్రాంతాలను ధ్వంసం చేశాయి. చారిత్రక అంచనాల ప్రకారం మొత్తం 70వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈక్వెడార్‌లో 40,000 మంది, కొలంబియాలో 30,000 మంది ఉన్నారు. పెరూ తీరానికి సమీపంలో సంభవించిన ఈ భూకంపం అనంతరం జరిగిన పరిణామాలు మొదటి భూకంపం కంటే కూడా ఎక్కువ ప్రాణనష్టానికి కారణమయ్యాయి. పర్వతంలోని భారీ భాగం కూలిపోవడంతో రాళ్లు, హిమనదుల మంచుతో కూడిన ప్రవాహం యుంగే, రన్రాహిర్కా తదితర ప్రాంతాల వైపు దూసుకెళ్లింది.ఈ శిథిల ప్రవాహం గంటకు 335 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించినట్లు అంచనా. యుంగే పట్టణం దాదాపు పూర్తిగా పూడుకుపోయింది. అక్కడ సుమారు 19,000 మంది మృతి చెందారు. 10 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఈక్వెడార్‌లో సంభవిం చిన ఈ భూకంపం దేశంలోని విస్తారమైన ప్రాంతాలను తీవ్రంగా నాశనం చేసింది. రియోబాంబా, క్విటో, లతకుంగా, అంబాటో ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి ఈక్వెడార్ చరిత్రలో నమోదైన అత్యంత ప్రాణాంతక భూకంపంగా నిలిచింది. ప్రపంచంలో ఇప్పటివరకు నమోదైన అత్యంత శక్తివంతమైన భూకంపం 1960లో చిలీలో సంభవించిన 9.5 తీవ్రత గల వాల్దివియా భూకంపం. 30,000 మంది మృతి చెందారు. వెనిజులాలో సంభవించిన విపత్తు ఒకే భూకంపం కాకపోవచ్చని తరువాతి అధ్యయనాలు సూచించాయి. రాజధాని కారకాస్‌లో సుమారు 90 శాతం ప్రాంతం దెబ్బతిన్నట్లు సమాచారం. బార్కిసిమెటో, మెరిడా, లా గైరా, శాన్ ఫెలిపే ప్రాంతాలు కూడా తీవ్రంగా ప్రభావితమయ్యాయి. ఆరికా సంభవించిన భారీ భూకంపం అప్పట్లో పెరూలో భాగంగా ఉన్న అరికా నగరాన్ని తీవ్రంగా దెబ్బతీసింది. అరెక్విపా, మొక్వెగువా, మొల్లెండో, ఇలో తదితర నగరాల్లోనూ భారీ నష్టం జరిగింది. గ్వాటెమాలాలో భూకంపంలో ఎక్కువ మంది నిద్రలో ఉండటంతో భారీ ప్రాణనష్టం జరిగింది.దాదాపు లక్ష చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విధ్వంసం చోటుచేసుకుంది. మట్టి ఇటుకలతో నిర్మించిన ఇళ్లు పెద్ద సంఖ్యలో కూలిపోయాయి. అనంతరం వచ్చిన ప్రకంపనలు కూడా మృతుల సంఖ్యను పెంచాయి.సుమారు 12 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.

# జార్ఖండ్‌లో విద్యార్థుల ఆందోళన

## పరీక్షల రద్దుకు సిద్ధమన్న సిఎం హేమంత్ సోరెన్



**రాంచీ, ఆగస్టు 11:** జార్ఖండ్‌లో జేపీఎస్సీ, జేఎస్ఎస్‌సీ నియామక పరీక్షల్లో అక్రమాలు, అవకతవకలు జరిగా యంటూ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ఆం దోళన 19వ రోజుకు చేరుకుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం ప్రకటించింది. 14వ జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రిలిమినరీ పరీక్షతో పాటు బ్యాక్‌లాగ్ పరీక్షలను రద్దు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మంగళవారం ప్రకటించారు.జేపీఎస్సీ పరీక్షల నిర్వహణకు బాధ్యత వహించిన లక్నోకు చెందిన ఐటీ సంస్థ టీడీపీఎల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలపై దర్యాప్తు జరిపిస్తామని సోరెన్ తెలిపారు. నియామక పరీక్షల వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావడానికి ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రముఖ విద్యాసంస్థల నిపుణుల సలహాలు తీసుకుంటామని చెప్పారు.పరీక్షల్లో ఫిర్యాదులు, ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమైన సందర్భాల్లో దర్యాప్తుకు ఆదేశించేందుకు ప్రభుత్వం వెనుకాడదని సోరెన్ స్పష్టం చేశారు. నియామక ప్రక్రియను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, సురక్షితంగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.పరీక్షలు నిర్వహించిన టీడీపీఎల్ సంస్థపై కూడా సీఎం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఈ సంస్థకు బీహార్‌తో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఇలాంటి సంస్థలకు రాష్ట్ర యువత భవిష్యత్తును దెబ్బతీసే అవకాశం ఎలా కల్పించారని ప్రశ్నించారు. మంగళవారం అసెంబ్లీలో సీఎం సోరెన్ ప్రసంగిస్తున్న సమయంలోనూ ప్రతిపక్ష సభ్యులు నిరంతరం నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. పరీక్షలకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, ప్రతిపక్షాల ఆందోళనలతో సంబంధం లేకుండా తమ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్తామని సోరెన్ స్పష్టం చేశారు.సోమవారం విద్యార్థుల అసెంబ్లీ మార్చ్‌ను ప్రస్తావించిన సీఎం పరిపాలన, పోలీసులు సంయమనంతో వ్యవహరించారని తెలిపారు. అసెంబ్లీ, పార్లమెంట్, శాసన మండళ్ల వంటి రాజ్యాంగ సంస్థల పరిసరాల్లో సాధారణంగానే భద్రతా ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

# నిజాయితీ ఐఎఎస్‌కు లేచి నిలబడి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

**ముంబయి, ఆగస్టు 11:**నిబంధనల అమలులో కఠినంగా వ్యవహరిస్తారని పేరున్న ఓ ఐఎఎస్ అధికారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన వేదికపైకి వస్తుండగా అంతా లేచి నిలబడి కరతాళధ్వనులతో అపూర్వ స్వాగతం పలికారు. మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) కమిషనర్ తుకారాం హరిభావు ముంధేకు పూణెలో ఈ అరుదైన గౌరవం లభించింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహారాష్ట్రలో ఆహార భద్రతా నిబంధనలను ఉల్లంఘిస్తున్న సంస్థలపై ఎఫ్‌డీఏ కమిషనర్‌గా తుకారాం ముంధే కొరడా ఝుళిపిస్తున్నారు. ఆయన నేతృత్వంలో ముంబైతో సహా రాష్ట్రవ్యాప్తంగా హోటళ్లు, రెస్టారెంట్లపై అధికారులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పరిశుభ్రత, ఆహార నాణ్యతా ప్రమాణాలు పాటించని సుమారు 100 సంస్థల లైసెన్సులను సస్పెండ్ చేశారు. ఈ కఠిన చర్యలు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచాయి. ఈ నేపథ్యంలోనే పూణెలోని బాల్ గంధర్వ రంగ మందిర్‌లో జరిగిన ఓ కార్యక్రమానికి ముంధే హాజరయ్యారు. ఆయన వేదిక వైపు నడుస్తుండగా, సభలోని ప్రేక్షకులంతా ఒక్కసారిగా లేచి నిలబడి పెద్ద పెట్టున చప్పట్లు కొడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. చాలా మంది తమ ఫోన్లలో ఈ దృశ్యాలను బంధించారు. ఆయన తీసుకుంటున్న చర్యలకు ప్రజల నుంచి లభిస్తున్న మద్దతుకు ఈ సంఘటనే నిదర్శనం. బీడ్ జిల్లాలోని ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆయన, చిన్నతనంలో ఆర్థిక ఇబ్బందుల మధ్య పెరిగారు. జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతూనే, తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సాయం చేసేవారు. కష్టపడి చదివి, ఔరంగాబాద్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ మరాఠ్వాడా యూనివర్సిటీలో ఉన్నత విద్యను పూర్తి చేశారు.

# మిస్సింగ్‌లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాల్సిందే

## తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు

## నివేదికివ్వాలంటూ కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** తప్పిపోయిన వ్యక్తుల కోసం తక్షణమే ప్రథమ సమాచార నివేదికలను (ఎఫ్ఐఆర్‌లు) నమోదు చేయాలన్న తన ఆదేశం, వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా పెద్దలు, పిల్లలు ఇద్దరికీ వర్తిస్తుందని భారత సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. జి. గణేష్ వర్సెస్ స్టేట్ ఆఫ్ తమిళనాడు అండ్ అదర్స్ కేసులో ఆగస్టు 5న వెలువరించిన తీర్పులో ఈ స్పష్టత ఇవ్వబడింది. 'వ్యక్తి' అనే పదాన్ని కేవలం పిల్లలకు మాత్రమే వర్తిస్తుందని కొన్ని రాష్ట్రాలు తప్పుగా అర్థం చేసుకోవడం పట్ల జస్టిస్‌లు అహ్సానుద్దీన్ అమానుల్లా, ఆర్. మహాదేవన్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యానం కొన్ని రాష్ట్రాలు ఉద్దేశపూర్వకంగా, దురుద్దేశంతో సృష్టించిన బూటకపు ప్రచారం అని కోర్టు పేర్కొంది. మే 22 నాటి మునుపటి ఉత్తర్వులో, తప్పిపోయిన వ్యక్తి గురించి సమాచారం అందిన వెంటనే ప్రతి పోలీస్ స్టేషన్ ఆలస్యం చేయకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించింది. వయస్సు లేదా లింగంతో సంబంధం లేకుండా 'వ్యక్తి' అనే పదంలో అందరు వ్యక్తులు ఉంటారని స్పష్టతనిచ్చింది. ఈ ఆదేశాన్ని పాటించడంలో విఫలమైన ఏ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతం అయినా కోర్టు ధిక్కరణ చర్యలకు గురవుతుందని కోర్టు హెచ్చరించింది. అటువంటి సందర్భాలలో, ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) వ్యక్తిగతంగా కోర్టుకు హాజరై, వారు ఆదేశాన్ని పాటించకపోవడానికి గల కారణాలపై వివరణ ఇవ్వవలసి ఉంటుంది. ఒక వ్యక్తి అదృశ్యమైన తర్వాత, తరచుగా 'గోల్డెన్ అవర్స్' అని పిలువబడే తొలి గంటల ప్రాముఖ్యతను గుర్తించాలని పేర్కొంది. ఈ సమయంలో తప్పిపోయిన వ్యక్తిని విజయవంతంగా గుర్తించే అవకాశం గణనీయంగా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల, తప్పిపోయిన వ్యక్తి కేసు దర్యాప్తు కోసం వనరులను సమీకరించే ముందు 24 గంటల పాటు వేచి ఉండి పోలీసులు చర్యలు తీసుకోవడంలో జాప్యం చేయకూడదు. అంతేకాకుండా, మే 22న ఇచ్చిన ఆదేశాలకు సంబంధించి తాజా స్థితి నివేదికలు, తీసుకున్న చర్యలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తప్పనిసరిగా సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని వారిని ప్రాథమికంగా కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లుగా పరిగణిస్తారు. ముఖ్యంగా లడఖ్‌ను, సముచితంగా స్పందించడంలో తన వైఫల్యాన్ని స్పష్టం చేయడానికి వ్యక్తిగత అఫిడవిట్‌లను సమర్పించాలని కోరారు. దేశవ్యాప్తంగా సంబంధిత డేటాబేస్‌లను తప్పనిసరిగా ఏకీకృతం చేయాలని ఆదేశించబడింది, దీనిని ఆరు వారాలలోగా పూర్తి చేయడానికి గడువు విధించబడింది. సుప్రీం కోర్టు ఈ విషయాన్ని అక్టోబర్ 5న మళ్లీ విచారించనుంది.

# 'వందేమాతరం' బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

## జాతీయ గీతంతో సమానంగా చట్టపరమైన రక్షణ



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** జాతీయ గీతం జనగణమనతో సమానంగా జాతీయ గేయం వందేమాతరానికి చట్టపరమైన రక్షణ కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదంతో ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 చట్టంగా మారింది. వందేమాతరం గీతాన్ని ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా గీతం ఆలపిస్తున్న సభకు ఆటంకం కలిగించడం ఇకపై నేరంగా పరిగణించబడుతుంది. ఈ చర్యలకు జాతీయ గీతం విషయంలో ఉన్న చట్టపరమైన రక్షణనే వందేమాతరానికి కూడా ఈ చట్టం కల్పిస్తుంది. ఈ బిల్లును జూలై 29న రాజ్యసభ ఆమోదించగా, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపింది. జూలై 24న లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971లోని సెక్షన్ 3కు సవరణలు చేసింది.ఇప్పటివరకు జాతీయ గీతం జనగణమనను ఉద్దేశపూర్వకంగా పాడకుండా అడ్డుకోవడం లేదా దానిని ఆలపిస్తున్న సభకు అంతరాయం కలిగించడం మాత్రమే నేరంగా ఉండేది. ఈ నేరాలకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉండేది. రెండోసారి, ఆ తర్వాత జరిగే ప్రతినేర నిర్ధారణకు కనీసం ఏడాది జైలు శిక్ష విధించే నిబంధన కూడా ఉంది. భారత రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24న చేసిన ప్రకటనను కూడా బిల్లులో ప్రస్తావించారు. బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' భారత స్వాతంత్ర్య పోరాటంలో చారిత్రక పాత్ర పోషించిందని, జాతీయ గీతం జనగణమనతో సమానంగా దానికి గౌరవం, హోదా ఉండాలని అప్పట్లో రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ ఆరు చరణాల పూర్తి ఆలాపనకు సుమారు 3నిమిషాల 10సెకన్లు పడుతుంది. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకల్లో తొలిసారిగా ఎర్రకోటప్రాకారాల నుంచి వందేమాతరంగీతాన్ని ఆలపించనున్నట్లు కేంద్రహోంమంత్రి అమిత్‌షా వెల్లడించారు.

# జపోరిజ్జియాపై రష్యా క్షిపణి దాడి.. ఐదుగురు మృతి, 20 మందికి గాయాలు

**జపోరిజ్జియా, ఆగస్టు 11:**ఉక్రెయిన్‌లోని ఆగ్నేయ నగరం జపోరిజ్జియాపై రష్యా జరిపిన దాడిలో కనీసం ఐదుగురు మృతి చెందగా, మరో 20మంది గాయపడ్డారు. రష్యాదాడులతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య మరింత పెరుగుతోందని జపోరిజ్జియా ప్రాంతీయ సైనిక పరిపాలన అధిపతి ఇవాన్ ఫెడోరోవ్ తెలిపారు.రష్యా బలగాలు నగరంలోని పారిశ్రామిక సంస్థలు, మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకున్నాయని ఫెడోరోవ్ వెల్లడించారు. ఈదాడుల్లో గ్యారేజ్ కోఆపరే టివ్‌తో పాటు పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. దాడి జరిగిన ప్రాంతంలో మంటలు చెలరేగిన దృశ్యాలను ప్రాంతీయ అధికారులు విడుదలచేశారు. నగరంపై క్షిపణులు, గైడెడ్ ఏరియల్‌బాంబులతో దాడి జరిగినట్లు ఉక్రెయిన్ అధికారులు తెలిపారు.అధికారులు తొమ్మిది మంది గాయపడినట్లు ప్రకటించగా, అనంతరం మృతుల సంఖ్య ఐదుకు, గాయపడిన వారి సంఖ్య 20కి పెరిగినట్లు వెల్లడించారు.

# అమెరికాకు ఆంక్షల వ్యసనం పట్టింది: ఇరాన్



టెహ్రాన్, ఆగస్టు 11: తమ దేశంపై ఆంక్షలు విధిం చడం అమెరికాకు వ్యసనంగా మారిందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ విమర్శించారు. ఆంక్షలతో ఇరాన్‌ను 'ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాం' అని అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ చెప్పడంపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దౌత్య మార్గంలో లక్ష్యాలను సాధించలేనప్పుడల్లా అమెరికా ఆంక్షలు విధిస్తోందని ఆరోపించారు.అవి ఫలించకపోతే మరింత తీవ్రత పెంచుతోందని పేర్కొన్నారు. ఇది ఒక అలవాటుగా, చివరకు వ్యసనంగా మారిందని ఎక్స్ వేదికగా ఆయన మండిపడ్డారు. ఆంక్షలతో ఇరాన్‌ను లొంగదీసుకోవడం సాధ్యం కాదని బఘాయీ స్పష్టం చేశారు. దశాబ్దాలుగా ఇలాంటి ఆంక్షలను ఎదుర్కొంటూనే ఉన్నామన్నారు. అమెరికా నేతలు ఈ చెడు అలవాటును కొన సాగిస్తే సంక్షోభం నుంచి గౌరవప్రదంగా బయ టపడే అవకాశాలను వారే దెబ్బతీసుకుంటారని హెచ్చరించారు. మరోవైపు ఇరాన్ ప్రభుత్వం డిజి టల్ ఆస్తులు, రహస్య బ్యాంకింగ్ నెట్‌వర్క్‌లపై ఆధారపడుతోందని స్కాట్ బెసెంట్ ఆరోపించారు. వారి అక్రమ ఆర్థిక నెట్‌వర్క్‌లను గుర్తించి ధ్వంసం చేస్తామని తెలిపారు.

**ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు:** ఇరాన్ సైన్యంలో కీలక నియామకాలు జరిగాయి. సుప్రీం నేత మొజ్తబా ఖమేనీ ఈ మార్పులు చేశారు. మేజర్ జనరల్ అలీ అబ్దొల్లాహీని సాయుధ దళాల చీఫ్‌గా, కియుమర్స్ హైదారిని డిప్యూటీగా నియమించారు. అలాగే ఐఆర్‌జిసి కమాండర్‌గా మేజర్ జనరల్ అహ్మద్ వాహిదీ, డిప్యూటీగా మోస్తఫా ఇజాదీ బాధ్యతలు చేపట్టారు. మొజ్తబా సుప్రీం నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సైన్యంలో చేసిన తొలి కీలక నియామకాలు ఇవే కావడం గమనార్హం.

# సంక్షిప్త వార్తలు

## సిజెపి ప్రచారంపై పిల్.. సుప్రీం నోటీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** న్యాయ విచారణల సమయంలో చేసిన మౌఖిక వ్యాఖ్యలను సోషల్ మీడి యా ప్రచారాలు, డిజిటల్ కంటెంట్ ద్వారా వాణిజ్యపరంగా దుర్వినియోగం చేయడం, డబ్బు సంపాదించడం వంటి ఆరోపణల నుండి రక్షణ కల్పించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు మంగళవారం నోటీసు జారీచేసింది. చీఫ్ జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చీ, వి.మోహనలతో కూడిన ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, సిబిఐల నుండి స్పందనలను కోరి, తదుపరి విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది.

## అదానీపై అమెరికా కోర్టులో కేసు కొట్టివేత



**న్యూయార్క్, ఆగస్టు 11:** భారత బిలియనీర్, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీపై నమోదైన క్రిమినల్ మోసం, లంచం ఆరోపణల కేసును అమెరికా కోర్టు సోమవారం కొట్టివేసింది. ఈ కేసులో విచారణను ముగించాలని అమెరికా న్యాయ శాఖ నిర్ణయించడంతో, బ్రూక్లిన్‌లోని అమెరికా జిల్లా న్యాయమూర్తి నికోలస్ గరాఫిస్ కేసును కొట్టివేయాలన్న ఫెడరల్ ప్రాసిక్యూటర్ల అభ్యర్థనకు అనుమతి ఇచ్చారు. కేసును ఉపసంహరించుకోవడానికి గల కారణాలపై న్యాయమూర్తి ప్రశ్నలు సంధించారు.కేసును ఉపసంహరించుకోవడానికి ప్రతిఫలంగా ఏవైనా హామీలు లేదా ఒప్పందాలు జరిగాయా అని న్యాయమూర్తి గౌతమ్ అదానీని నేరుగా ప్రశ్నించారు. అలాంటి ఒప్పందం గురించి తనకు తెలియదని అదానీ తెలిపారు.కేసు కొట్టివేతపై అదానీ స్పందిస్తూ, అమెరికా కోర్టు నిర్ణయాన్ని వినయంతో, న్యాయ ప్రక్రియపై గాఢమైన గౌరవంతో స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు.

## హార్ముజ్ జలసంధిలో భారీగా పడిపోయిన నౌకల రాకపోకలు



పెట్రోలియం వాయువు (ఎల్‌పీజీ)తో వెళ్తున్న చిన్న ట్యాంకర్, రెజిడ్యువల్ ఫ్యూయల్స్‌ను తీసుకెళ్తున్న మరో నౌక జలసంధి నుంచి బయటకు వెళ్లాయి.

**వాషింగ్టన్/టెహ్రాన్:** అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లుతున్న నేపథ్యంలో కీలకమైన హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రాకపోకలు భారీగా తగ్గిపోయాయి. కేవలం ఆరు నౌకలు మాత్రమే ఈ జలసంధి మీదుగా ప్రయాణించినట్లు కేప్లర్ డేటా వెల్లడించింది. గత పది రోజుల సగటు రోజువారీ రాకపోకలు సుమారు 11 నౌకలుగా ఉన్నాయి. నాలుగు కమోడిటీ నౌకలు జలసంధిలోకి ప్రవేశించాయి. వీటిలో రెండు ఖాళీ ఆయిల్ ట్యాంకర్లు ఉన్నాయి. మరోవైపు ద్రవీకృత

## రాజస్థాన్‌లో 106 నకిలీ సంస్థలు

**జైపూర్, ఆగస్టు 11:**రాజస్థాన్‌లో నకిలీ సంస్థల ద్వారా పన్ను ఎగవేత, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేందుకు వాణిజ్య పన్నుల శాఖ భారీగా తనిఖీలు చేపట్టింది. రాష్ట్రంలోని మొత్తం 16 జోన్లలో ఏకకాలంలో ప్రత్యేక తనిఖీలను నిర్వహించి అనుమానాస్పద సంస్థల కార్యకలాపాలను పరిశీలించింది. ఈ తనిఖీల్లో మొత్తం 137 సంస్థలను తనిఖీ చేయగా 106 సంస్థలు నకిలీవిగా తేలాయి. మరో 31 సంస్థలు వాస్తవంగా కార్యకలాపాలు నిర్వహిస్తు న్నవిగా గుర్తించినప్పటికీ, వాటిలోనూ పన్ను సంబంధిత అవకతవకలు బయటపడ్డాయి.

## ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ కరెన్సీ!




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** దేశంలో త్వరలో పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చెలామణిలోకి రానున్నాయి. రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ నోట్లను క్షేత్రస్థాయి ప్రయోగాల కోసం జారీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఒక్కో డినామినేషన్‌లో వంద కోట్ల చొప్పున నోట్లను ప్రయోగాత్మకంగా జారీ చేసే ప్రతిపాదనను ఆమోదించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంటుకు వెల్లడించారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ సెంట్రల్ బోర్డు సిఫార్సు మేరకు ఆ ర్ బీ ఐ చట్టం1934 లోని సెక్షన్ 25 ప్రకారం ఈ ప్రతిపా దనను ప్రభుత్వానికి పంపింది. ఈ క్షేత్రస్థాయి ప్రయోగాలు విజయవంతమైతే భవిష్యత్తులో ఈ రెండు విలువల్లోని పాలిమర్ నోట్లను క్రమబద్ధంగా జారీ చేసే అవకాశం ఉంటుంది.




విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
బుధవారం 12, ఆగస్టు 2026





ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను పార్లమెంట్ భవనంలోని ఆయన ఛాంబర్‌లో మంగళవారం రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, నర్సీపట్నం టీడీపీ అధ్యక్షులు చింతకాయల రాజేష్ మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఉపరాష్ట్రపతికి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ప్రసిద్ధ ఏటికొప్పాక బొమ్మను ఆయనకు జ్ఞాపికగా అందజేశారు.

(ప్రభాతవార్త - విశాఖపట్నం)



### నర్సీపట్నంలో లాంఛనంగా

# ‘తల్లీ బిడ్డ’ వాహనాల ప్రారంభం

**గర్భిణీల సౌకర్యార్థమే ఈ సేవలు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు**




**నర్సీపట్నం, ఆగష్టు 11, ప్రభాతవార్త :** నర్సీపట్నం ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ‘తల్లీబిడ్డ’ వాహనాలను శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాం లోనే గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీ స్త్రీల సౌకర్యా ర్థం ఈ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను తీసుకు వచ్చినట్లు గుర్తుచేశారు. గర్భిణీలు ప్రసవం అనంతరం ఇబ్బందులు పడకుండా, ఇంటికి చేర్చండి ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. అయితే, గత ప్రభుత్వం ఈ కాంట్రాక్టును అరవిందో కంపెనీకి అప్పగించిందని, ఆ సంస్థ సేవలను సరిగ్గా అందించకపోవడంతో తమ ప్రభుత్వం ఆ కాంట్రాక్టును రద్దు చేసిందని స్పీకర్ తెలిపారు. ప్రస్తుతం ఈ సేవల బాధ్యతలను విద్యావేద ఫౌండేషన్ సంస్థకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కొత్త (తరువాయి 8వ పేజీలో)

### ఈపీడీసీఎల్ పరిధిలో

# శరవేగంగా సోలార్



**బీసీలకు అదనంగా 20 వేల రూపాయలు సబ్సిడీ**

**గ్రామాల్లో పరుగులు పెడుతున్న సోలార్-గ్రిడ్ అనుసంధానం**

**ఈపీడీసీఎల్ చైర్మన్ పృథ్వి తేజ్**

**విశాఖపట్నం, జ్ఞానాపురం, ప్రభాతవార్త :** సంప్రదాయ ఇంధన సౌర విద్యుత్ వినియోగం పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పటిష్టంగా శ్రమిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే రూఫ్ టాప్ సోలార్ ను ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పులో సౌర విద్యుత్తు ఏర్పాటుకు ఈపీడీసీఎల్ పూర్తి సహకారం అందిస్తున్నట్టు ఈపీడీసీఎల్ చైర్మన్ పృథ్వీరాజ్ తెలిపారు. ప్రభుత్వాలు తాజాగా వెనుకబడిన తరగతులకు కూడా మరింత ప్రోత్సాహం అందించడానికి ముందుకు వస్తున్నాయి. వెనుకబడిన తరగతుల (బీసీ)కు చెందినవారు నెలవారి వాడకం 200 యూనిట్లు లోపల ఉంటే వారికి ప్రస్తుత ఇస్తున్న రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలకు సబ్సిడీకి అదనంగా మరో 20,000 రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయనున్నట్టు ఈపీడీసీఎల్ ఛైర్మన్ యిమంది పృద్వి తేజ్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ (తరువాయి 8వ పేజీలో)

### లాంఛనంగా 102 తల్లీ బిడ్డ

# ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభం

- గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలు
- ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజులతో కలిసి ప్రారంభించిన జేసీ జి. విద్యాధరి



**విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాత వార్త :** గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సురక్షితమైన, సకాలంలో వైద్య సేవలు అందించడంతో పాటు మాతా–శిశు ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ‘102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్’ వాహనాలను మంగళవారం జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి లాంఛనంగా ప్రారంభించారు. గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు జెండా ఊపి వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు మరణాల రేటును తగ్గించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్షిత ప్రసవాలను ప్రోత్సహించడం, ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడం, పేద కుటుంబాలపై రవాణా వ్యయ (తరువాయి 8వ పేజీలో)

### ఆంధ్రా వైద్య కళాశాల పరిధిలో

# జూడాల సమ్మె ప్రారంభం

**ఓపీ ఇతర వైద్య సేవలను బహిష్కరించిన జూనియర్ డాక్టర్లు**

**తొలి రోజు అవుట్ పేషెంట్, వార్డు వైద్య సేవలపై తీవ్ర ప్రభావం**

**అత్యవసర, ఐసీయూ వైద్య విధులకు యాదావిధిగా హాజరు**

**ఓపీ వైద్య విభాగంలో సర్వర్లు పనిచేయక ఓపీ టిక్కెట్ల జారీ లో జాప్యం, రోగుల ఇక్కట్లు**

**ఓపీ వైద్య సేవల అంతరాయ నివారణకు బయట వైద్యులుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన అనుబంధ ఆసుపత్రుల పాలకులు**




**విశాఖపట్నం, ఆగష్టు 11, ప్రభాత వార్త :** స్టైఫండ్ పెంపు, ఇతర దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ జూనియర్ వైద్యులు సంఘం (ఏపీ జూడా) ఇచ్చిన పిలుపు మేరకు ఆంధ్రా వైద్య కళాశాల పరిధిలోని కెజిహెచ్, విజిహెచ్, ఛాతి తదితర ఎఎంసీ అనుబంధ ఆసుపత్రుల్లో జూనియర్ వైద్యులు మంగళవారం సమ్మెకు దిగారు . తమ దశలవారీ నిరవధిక సమ్మె లో భాగంగా తొలి రోజు అన్ని అనుబంధ ఆసుపత్రులలో అవుట్ పేషెంట్,వార్డు ఇతర సాధారణ వైద్యసేవలను బహిష్కరించారు. ఫలితంగా ఏఎంసీ పరిధిలోని (తరువాయి 8వ పేజీలో)

## జూడాల సమ్మె మరింత ఉధృతం

**ప్రభుత్వంతో రెండో సారీ చర్చలు విఫలం**

**నేటి నుంచి ఓపీ, వార్డు వైద్య సేవలను పూర్తిగా బహిష్కరిస్తాం**

**ఏఎంసీ జూడాల యూనియన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డాక్టర్ దినకర్, కె.రవీంద్ర వెల్లడి**

**విశాఖపట్నం, ఆగష్టు 11, ప్రభాతవార్త :** తమ న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించాలని రెండో సారి ప్రభుత్వంతో మంగళవారం రాత్రి ఏపీ జూడా సంఘం నాయకులు జరిపిన చర్చలు కూడా విఫలమయ్యాయని ఆంధ్రా వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల యూనియన్ (తరువాయి 8వ పేజీలో)

### ఘనంగా నాతవరం-తాండవ రహదారి ప్రారంభం...

# తాండవ రిజర్వాయర్ నీటి విడుదల



**నాతవరం, ఆగష్టు 11, ప్రభాతవార్త :** నాతవరం నుండి తాండవ వరకు సుమారు రూ. 3 కోట్ల 50 లక్షలతో రోడ్లు, భవనాల శాఖ (ఆర్ అండ్ బి) ఆధ్వర్యంలో నిర్మించిన 7 కిలోమీటర్ల నూతన రహదారిని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, రిబ్బన్ కట్ చేసి రహదారిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. అనంతరం తాండవ రిజర్వాయర్ వద్దకు చేరుకున్న ఆయన, రిజర్వాయర్ (తరువాయి 8వ పేజీలో)

### జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల దమనకాండను

# తీవ్రంగా ఖండిస్తున్నాం

**రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించిన ఏపీ బీజేపీ చీఫ్ పీవీయన్ మాధవ్**



**విశాఖపట్నం, ఆగస్టు 11 ప్రభాత వార్త :** జార్ఖండ్ రాజధాని రాంచీలో తమ ఉపాధి, ఉద్యోగాలు, భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా (తరువాయి 8వ పేజీలో)

### విశాఖపట్నం పోర్టులో

# రూ.334.89 కోట్లతో ఫ్లైఓవర్

- కన్వెంట్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు 3.584 కి.మీ. ఎలివేటెడ్ కారిడార్
- 9 రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యలకు చెక్
- కార్గో రవాణా మరింత వేగవంతం

**విశాఖపట్నం, ఆగష్టు 11, ప్రభాతవార్త :** విశాఖపట్నం పోర్టులో కార్గో రవాణాను వేగవంతం చేయడంతో పాటు ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు రూ.334.89 కోట్లతో అంతర్గత ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మరియు జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపారు. మంత్రిత్వశాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన డెలిగేటెడ్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఈ ప్రాజెక్టును పరిశీలించింది. కన్వెంట్ జంక్షన్ నుంచి డాక్ ఏరియా వరకు 3.584 కిలోమీటర్ల పొడవైన (తరువాయి 8వ పేజీలో)

### పీపీపీ ముసుగులో

# వనరుల దోపిడీ

**కార్పొరేట్ లూటీకి వ్యతిరేకంగా పోరాడాలి: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు**

**ఉద్యోగాల కల్పనపై శ్వేతపత్రం విడుదల చేయాలి... విశాఖ సిట్ నివేదిక బహిర్గతం చేయాలని డిమాండ్**




**విశాఖపట్నం, ఆగష్టు 11, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రజా వనరులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలను ప్రభుత్వం అనుసరిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. పీపీపీ ముసుగులో కార్పొరేట్ సంస్థలకు ప్రయోజనం చేకూర్చే విధానాలను తీసుకొస్తున్నారని విమర్శించారు. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయం ఏచూరి భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద పెట్టుబడిదారులకు భారీగా నిధులు కేటాయించడం అన్యాయమని అన్నారు. రైతులు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తిదారులు, విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికుల సమస్యలకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం.. బడా కార్పొరేట్ సంస్థలకు వేల కోట్లు కేటాయిస్తోందని విమర్శించారు. గూగుల్ డేటా సెంటర్‌కు భారీ రాయితీలు ప్రకటించిన ప్రభుత్వం స్థానికులకు ఉపాధిపై స్పష్టమైన హామీ తీసుకోలేదన్నారు. పీపీపీ విధానం ద్వారా నీరు, భూములు, విద్యుత్, ఖనిజ వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను యువత వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. గత రెండేళ్లలో పోలీసు, డీఎస్సీ మినహా ఇతర రంగాల్లో కల్పించిన ఉద్యోగాలపై ప్రాంతాల వారీగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**విశాఖ భూ ఆక్రమణలపై సిట్ నివేదిక బహిర్గతం చేయాలి:** ‘మీ భూమి-మీ హక్కు’ పేరుతో (తరువాయి 8వ పేజీలో)

### గ్రామీణాభివృద్ధిలో

# ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర

**వికసిత్ భారత్-జీ రామ్ జీ చట్టం అమలులో స్థానిక సంస్థల పాత్ర ముఖ్యమైనది: జెడ్పీ చైర్‌పర్సన్ జె. సుభద్ర**




**విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త:** గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల సమర్థ అమలు, స్థానిక సంస్థల బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులకు నిర్వహించిన వన్‌డే శిక్షణ సదస్సులో ఆమె (తరువాయి 8వ పేజీలో)

### ఈనెల 13 నుంచి 15 వరకు

# హర్ ఘర్ తిరంగా

**80 వ స్వాతంత్ర్య దినోత్సవం లో భాగంగా దేశ భక్తిని పెంపొందించే పలు కార్యక్రమాలు**

**దేశ నిర్మాణం లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్**



**విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త :** ఆగస్టు 13 నుండి 15 వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రతి ఇల్లు, వాణిజ్య సంస్థ, ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రోజుల పాటు జాతీయ జెండాను ఆవిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ పిలుపునిచ్చారు. పరిపాలనా యంత్రాంగం ప్రజా ప్రతినిధులు పౌరులతో కలిసి ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని సూచించారు.

**స్వాతంత్ర్య దినోత్సవ వేళ**

దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు” కావాలనీ, 80వ దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన “దేశ నిర్మాణంలో భాగస్వాములు” “అనే నేను” ప్రచార కార్యక్రమాన్ని ఆగస్టు 10 నుంచి 15 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తు న్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజలు కేవలం ప్రేక్షకులుగా కాకుండా, ఈ దేశ నిర్మాణంలో తామూ భాగస్వాము లమే అనే భావనతో స్వచ్ఛందంగా పాలు పంచుకునేలా ఈ ముందస్తు కార్యకలా పాలు ప్రభుత్వం రూపొందించిందని ఆయన పేర్కొన్నా రు. ఈ సందర్భంగా జిల్లాలో మొక్కల నాటే కార్యక్రమం ఆగస్టు 14న అటవీ, ఉద్యానవన శాఖల సహకారంతో జిల్లా వ్యాప్తంగా ఒకే రోజు మెగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రజలు తమ ఇళ్ల వద్ద, ముఖ్య ప్రదేశాలలో మొక్కలు (తరువాయి 8వ పేజీలో)



# విహరిస్తున్న పందులు.. కరుస్తున్న కుక్కలు..



**గాజువాకలో పందులు, కుక్కల హల్‌చల్..**

**భయం గుప్పిట్లో స్థానికులు .. నిర్లక్ష్యపు నీడలో అధికారులు**

**గాజువాక, ఆగష్టు 11, ప్రభాతవార్త :** గాజువాక నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యం, భద్రత గాల్లో దీపంలో మారింది. ఒకవైపు చెత్త కుప్పలపై గుంపులు గుంపులుగా తిరిగే పందులు.. మరోవైపు దారినపోయే వారిపై విరుచుకుపడే పిచ్చి కుక్కలు! కాలనీ ఏదైనా, వార్డు ఏదైనా ఇదే దృశ్యం. పగలు, రాత్రి అనే తేడా లేకుండా వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న ఈ మూగజీవాల దెబ్బకు స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. పారిశుధ్యం పడకేయడంతో రోగాలు వ్యాపించి రోగగ్రస్తులవుతున్నామని, ప్రశ్నించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని జనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చెత్త కుప్పలే ఆవాసాలు.. వ్యాధుల కాసారాలు!...**

గాజువాక జోన్ పరిధిలోని బీసీ రోడ్, చైతన్య నగర్, గొంతినవాని పాలెం, భానోజీ తోట, అజీమాబాద్, గాజువాక మార్కెట్, దయాల్ నగర్, హైస్కూల్ రోడ్, వుడా కాలనీ, శ్రీనగర్, సమతా నగర్, నడుపూర్, స్వాతంత్ర నగర్, సీకువాని పాలెం, ఎస్సీ కాలనీ, గంగవరం, (తరువాయి 8వ పేజీలో)

### భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు

# ఆర్టీసీ ‘ఏరో ఎక్స్‌ప్రెస్’ బస్సులు




**విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఆర్టీసీ ‘ఏరో ఎక్స్‌ప్రెస్’ ఎలక్ట్రిక్ బస్సులను నడిపేందుకు సిద్ధమైంది. విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయం వరకు 20 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానుంది. ఇప్పటికే 16 బస్సుల (తరువాయి 8వ పేజీలో)

## నర్సీపట్నంలో లాంఛనంగా 'తల్లీబిడ్డ' వాహనాల ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

సంస్థ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా వాహనాలను అందుబాటులోకి తెస్తున్నామని, అందులో భాగంగా నర్సీపట్నం ప్రాంతానికి మొత్తం ఏడు వాహనాలను కేటాయించినట్లు చెప్పారు. పారిశ్రామిక ప్రాంతమైన నక్కపల్లికి అత్యవసర సేవల నిమిత్తం ఒక వాహనం కేటాయించగా, మిగతా ఆరు వాహనాలు నర్సీపట్నంలోనే అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. ఆశా వర్కర్లు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణీలకు అవసరమైనప్పుడు 102 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేస్తే, సెంట్రల్ ఆఫీస్ ద్వారా వెంటనే వాహనం అందుబాటులోకి వస్తుందని ఆయన వివరించారు. ?ప్రసవానంతరం తల్లీబిడ్డలను సురక్షితంగా ఇంటికి చేర్చడానికి ఈ సేవలు ఎంతో ఉపయోగపడతాయని, ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని స్పీకర్ కోరారు. అలాగే, ఆసుపత్రిలో రక్త పరీక్షల నిమిత్తం ప్రత్యేకంగా ఒక రూమ్ ఏర్పాటు చేసి సదుపాయాలు మెరుగుపరుస్తున్నట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నాం

(7వ పేజీ తరువాయి)

ఖండించారు. విశాఖపట్నం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పత్రికా సమావేశంలో పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన కాంగ్రెస్–జేఎంఎం ప్రభుత్వం అందుకు బదులుగా వారిపై లాఠీఛార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, వాటర్ క్యానన్లు ఉపయోగించడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.

## గ్రామీణాభివృద్ధిలో ప్రజాప్రతినిధులదే కీలక పాత్ర

(7వ పేజీ తరువాయి)

మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ద్వారా అమలయ్యే వికసిత్ భారత్–జీ రామ్ జీ చట్టంపై ప్రజాప్రతినిధులు సమగ్ర అవగాహన కలిగి ఉండాలని సూచించారు. గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల వేతన ఉపాధి కల్పించడం, వ్యవసాయం, పశుసంవర్ధక, ఉద్యానవన రంగాల బలోపేతం, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, సహజ వనరులు, నీటి వనరుల సంరక్షణకు చట్టం ప్రాధాన్యత ఇస్తుందని డ్వామా పీడీ నిర్మలా దేవి, ఏపీడీ ఆంజనేయులు వివరించారు. గ్రామ అవసరాలను గుర్తించడం, అభివృద్ధి పనులను సూచించడం, ప్రణాళికల రూపకల్పన, సామాజిక తనిఖీలు, నిధుల వినియోగం, పనుల నాణ్యతను పర్యవేక్షించడంలో గ్రామ సభలు సమర్థవంతంగా పనిచేయాలని అధికారులు సూచించారు. గ్రామీణ కుటుంబాల నమోదు, ఉపాధి గ్యారంటీ కార్డుల జారీ, పనుల అమలు, పర్యవేక్షణలో గ్రామ పంచాయతీల పాత్ర కీలకమన్నారు. డిజిటల్ అటెండెన్స్, జీఐఎస్ మ్యాపింగ్, జియోట్యాగింగ్, డీబీటీ ద్వారా వేతనాల చెల్లింపు వంటి సాంకేతిక విధానాలతో పారదర్శకత, జవాబుదారీతనం పెంచనున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి ప్రణాళికలు, నిధుల వినియోగం, సామాజిక తనిఖీలు, ప్రజా భాగస్వామ్యం, శాఖల సమన్వయంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, విజిలెన్స్ అధికారి, వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఆర్టీసీ 'ఏరో ఎక్స్‌ప్రెస్' బస్సులు

(7వ పేజీ తరువాయి)

ట్రయల్ రన్ పూర్తికాగా, మిగిలిన నాలుగు బస్సుల ట్రయల్ రన్ కూడా పూర్తిచేసి ఆగస్టు 15 నుంచి పూర్తి స్థాయిలో ఏరో ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బస్సుల ఛార్జీలు, రూట్ తదితర అంశాలపై కసరత్తు కొనసాగుతోంది.ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభమైన విషయం తెలిసిందే. ఆగస్టు 17 నుంచి విమాన సర్వీసులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రయాణికులకు అనుగుణంగా ఆర్టీసీ ప్రత్యేక ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## సమ్మె ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

అన్ని ఆసుపత్రులలో అవుట్ పేషెంట్, సాధారణ వార్డు వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమ్మెలో భాగంగా సుమారు 700 మంది పీజీ, యూజీ, సీనియర్ రెసిడెంట్ జూనియర్ డాక్టర్లు ఏఎంసీ, కెజీహెచ్ లకు చేరుకొని మధ్యాహ్నం వరకు విధులను బహిష్కరించి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరస ప్రదర్శన నిర్వహించారు. జూనియర్ డాక్టర్ల సమ్మె కారణంగా కెజీహెచ్ ఇతర అనుబంధ ఆసుపత్రులలో ఒపీ వైద్య సేవలు కోసం మంగళవారం వచ్చిన రోగులకు జూడాల సమ్మె సెగ తగిలి సకాలంలోఒపీ వైద్యం అందకపో వడంతో తీవ్ర ఇబ్బందులుకు గురయ్యారు. కెజీహెచ్ ఒపీ విభాగం లో సర్వర్లు మోరాయించడం తో ఆన్లైన్ ఒపీ టిక్కెట్ ల జారీ కి అంతరాయము ఏర్పాడడం వల్ల మన్యూవల్ గా సిబ్బంది ఒపీ టిక్కెట్ లను రాసి ఇచ్చారు. దాంతో ఒపీ టిక్కెట్ ల కోసం రోగులు గంటల తరబడి ఉక్కపోత తో నిరీక్షించాలిసి వచ్చింది. ఫలితం గా ఒపీ సేవలు ఆలస్యం గా అందడం, ఒపీ ల్లో వైద్యులు కొరత వల్ల రోగులు ఇబ్బందులు ను ఎదుర్కొన్నారు.ఇదిలా ఉండగా జూనియర్ డాక్టర్లుఅత్యవసర వైద్య సేవలకు సమ్మె నుంచి మినహాయింపును ఇస్తూ కాజువల్టీ, లేబర్ రూమ్ ప్రసవలు,డయాలసిస్ వంటి అన్ని ఎమర్జెన్సీ ఐసీయూ లలో ను అత్యవసర వైద్య సేవలకు అంతరాయము కలగకుండా యాదవిదిగా విధులకు 400 మంది జూడాలు తొలి రోజు హాజరయ్యారు.కెజీహెచ్ లో సమ్మె కారణం గా ఒపీ వైద్య సేవలకు అంతరాయము కలుగకుండా నివారించేందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి ముందస్తు ప్రత్యామ్నాయం గా ఎఎంసీ, బ్లడ్ బ్యాంకులలో నుండి ఇరవై మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ లను రప్పించి ఒపీ విధులకు వారిని తాత్కాలికంగావినయోగించుకొన్నారు.అయినప్పటికివివిధ ఒపీలలో వైద్యులు కొరత కనిపించింది. ఆర్థోపెడిక్ ఒపీ జనరల్ మెడిసిన్ ఒపీలలో వైద్యులు కొరత కారణంగా రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

## జూడాల సమ్మె మరింత ఉధృతం

(7వ పేజీ తరువాయి)

అధ్యక్ష, ఉపాధ్యాక్షలు సీనియర్ రెసిడెంట్ డాక్టర్లు దినకర్, కె. రవీంద్ర చెప్పారు. రాష్ట్ర జూడాల సంఘం నిర్ణయం మేరకు బుధవారం నుండి ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు అత్యవసర వైద్య సేవలు మినహా అన్ని రకాల అవుట్ పేషెంట్, వార్డు సాధారణ వైద్య సేవలను పూర్తి గా బహిష్కరణ చేస్తూతమ దశలవారీ సమ్మె ను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. తొలి రోజు మంగళవారం మధ్యాహ్నం వరకు మాత్రమే ఒపీ, సాధారణ వార్డు వైద్య సేవలను నిరసన తెలిపిన జూనియర్ వైద్యులు మధ్యాహ్నం నుండి చర్చల నేపథ్యంలో యాదావిధిగా విధులకు హాజరైయ్యామని అన్నారు. రెండో సారీ చర్చలు విఫలం కావడం వల్ల బుధవారం నుంచి పూర్తి సమయం ఒపీ, వార్డు విధులు ను బహిష్కరణ చేయనున్నామని వారు పేర్కొన్నారు.

## తాండవ రిజర్వాయర్ నీటి విడుదల

(7వ పేజీ తరువాయి)

చైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయ బద్ధంగా గంగా హారతి ఇచ్చిన తదనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్వయంగా గేట్లను ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ రహదారి నిర్మాణ క్రమాన్ని వివరించారు. మొదట ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును ఆర్ అండ్ బికి బదిలీ చేయించి, నిధులు మంజూరు చేయించడానికి ప్రభుత్వం చాలా శ్రమించిందని తెలిపారు. కాంట్రాక్టు పనుల్లో మిగిలిన నిధులతో ఎంతో నాణ్యంగా ఈ తారు రోడ్డును వేయించినట్లు ఆయన స్పష్టం చేశారు. అయితే, కోట్లాది రూపాయలు వెచ్చించి వేసిన తారు రోడ్లపై ఇనుప చక్రాలున్న ట్రాక్టర్లు నడపడం వల్ల రోడ్లు త్వరగా పాడవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇనుప చక్రాలతో తారు రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్లను వెంటనే సీజ్ చేసి కోర్టులో ప్రవేశపెట్టాలని పోలీస్ అధికారులను ఆయన కఠినంగా ఆదేశించారు. వ్యవసాయంలో రైతులు ఆధునిక యంత్రాలను వినియోగించుకోవాలని సూచించిన ఆయన, మందులు చల్లుకోవడానికి వీలుగా ప్రతి మండలానికి మూడు డ్రోన్లను ప్రభుత్వ సాయంతో అందిస్తామని ప్రకటించారు. యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూస్తామని, రైతులు కూడా అవసరమైన మేరకే ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో వ్యవసాయానికి, మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేస్తున్నామని స్పీకర్ తెలిపారు. నాతవరం మండలంలో రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు వీలుగా రూ.16కోట్లతో 136 మెటల్ రోడ్లను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంజూరు చేసినట్లు వెల్లడించారు. నాతవరం మండలా నికి 70 కోట్ల 44 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 75 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 48 లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు ఆయన గుర్తుచేశారు. తాండవ రిజర్వాయర్ వద్ద భద్రత కోసం రిటైనింగ్ వాల్ నిర్మాణం తో పాటు జోగుంపేట వరకు లైటింగ్ ఏర్పాటు చేయడానికి అంచనాలు రూపొందించాలని విద్యుత్, సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను తానే స్వయంగా సమకూరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాస్, ఆర్డీవో వి.వి. రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకట రమణ, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీ నాయుడు, జనసేన నియోజక వర్గ ఇన్చార్జి సూర్యచంద్ర, తాండవ కమిటీ మెంబర్లు, నాతవరం మండల టిడిపి నాయకులు, తాండవ రిజర్వాయర్ అధికారులు మరియు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పీపీపీ ముసుగులో వనరుల దోపిడీ

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రచారం చేస్తూనే, రైతుల అనుమతి లేకుండా భూములు తీసుకునే విధానాలను అనుసరిస్తోందని శ్రీనివాసరావు విమర్శించారు. విశాఖ భూ ఆక్రమణలపై సిట్ నివేదికను పేర్లతో సహా బహిర్గతం చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. నగరంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డేటా సెంటర్లకు నీటి కేటాయింపులపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.

**అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి: లోకనాథం**

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె. లోకనాథం మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంచదార్ల ప్రాంతంలో అనుమతులు లేకుండా మైనింగ్ జరుగుతోందని ఆరోపిస్తూ బాధ్యులపై కేసులు నమోదు చేయాలని కోరారు. మైనింగ్ కారణంగా పర్యావరణ సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజాభిప్రాయ సేకరణను పునఃపరిశీలించాలని అన్నారు. పోలవరం ఎడమ కాలువ నీటిని సాగుకు కాకుండా డేటా సెంటర్లకు కేటాయించే నిర్ణయాన్ని వ్యతిరేకించారు.

**విశాఖ విమానాశ్రయాన్ని కొనసాగించాలి: జగ్గునాయుడు**

సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన తర్వాత విశాఖ విమానాశ్రయాన్ని మూసివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. విశాఖను అంతర్జాతీయ నగరంగా అభివృద్ధి చేస్తామని చెబుతూ విమానాశ్రయం లేని నగరంగా మార్చడం సరికాదన్నారు. విశాఖ విమానాశ్రయాన్ని దేశీయ విమానాశ్రయంగా కొనసాగించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. విమానాశ్రయాన్ని మూసివేస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

## లాంఛనంగా 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

భారాన్ని తగ్గించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమన్నారు. గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలను, వారి నవజాత శిశువులను ఇద్దరు సహాయకులతో కలిసి పూర్తిగా ఉచితంగా ఇంటి వద్దకు చేర్చే పోస్ట్‌నేటల్ డ్రాప్‌బ్యాక్ సౌకర్యాన్ని '102 తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్' ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. అలాగే హై–రిస్క్ ప్రెగ్నెన్సీ మహిళలు, తీవ్ర రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ఐరన్ సుక్రోజ్ చికిత్సలు, ప్రత్యేక వైద్య పరీక్షలు, రక్త మార్పిడి వంటి అత్యవసర వైద్య అవసరాల కోసం ఆసుపత్రులకు ఉచితంగా తరలించి తిరిగి ఇంటికి చేర్చే సేవలను కూడా ఈ వాహనాల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలుకు విశాఖపట్నం జిల్లాకు 16 అత్యాధునిక వాహనాలు కేటాయించారని జేసీ వివరించారు. ప్రస్తుతం జిల్లాలో కింగ్ జార్జ్ ఆసుపత్రి వద్ద 9, అగనంపూడి వద్ద 2, విక్టోరియా ఆసుపత్రి వద్ద 5 వాహనాలు అందుబాటులో ఉంచి సేవలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వాహనాల్లో రియర్ సీట్ బెల్టులు, ఎయిర్‌బ్యాగ్‌లు, అగ్నిమాపక పరికరాలు, ఎయిర్ కండీషనింగ్, మొబైల్ ఛార్జింగ్ సదుపాయం, హ్యాండ్ శానిటైజర్, టిష్యూ పేపర్లు, డస్ట్‌బిన్ వంటి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రియల్‌టైమ్ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, అత్యవసర పరిస్థితుల్లో కాల్ సెంటర్‌కు సమాచారం చేరవేసే ఎమర్జెన్సీ అలర్ట్ స్విచ్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణ సమయంలో తల్లి–శిశు ఆరోగ్యం, శిశు పోషణ, ప్రసవానంతర సంరక్షణకు సంబంధించిన అవగాహన సందేశాలను ప్రసారం చేసే ప్రత్యేక ఆడియో వ్యవస్థను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ సేవలు పూర్తిగా ఉచితమని, లబ్ధిదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రైవర్లకు రుసుములు లేదా టిప్పులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. జిల్లాలో 2025–26 సంవత్సరంలో 24 వాహనాల ద్వారా 9,988 మంది లబ్ధిదారులు సేవలు పొందగా, 2026–27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 3,274 మంది ఈ సేవలను వినియోగించుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ . ఐ. వాణి, కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బి.వి. రమణ, విక్టోరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ . పి. ఉష, డీసీహెచ్ఎస్ డాక్టర్ . నరేంద్ర సింగ్, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్. అప్పారావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నగర పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు కీలకం

**రాత్రివేళ విధులతో ఉదయానికే పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా నగర రహదారులు, పరిసరాలు.**

**పారిశుధ్య కార్మికులను అభినందించిన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**అర్ధరాత్రి 17, 18 వార్డుల్లో పారిశుధ్య పనులు, 21వ వార్డులో వీధి దీపాల నిర్వహణపై ఆకస్మిక తనిఖీ.**

**కార్మికుల భద్రతకు ప్రాధాన్యం... అవసరమైన పనిముట్లు, రక్షణ సామగ్రి అందించాలని సూపర్వైజర్లకు ఆదేశం.**

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త :

విశాఖ నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో పారిశుధ్య కార్మికుల సేవలు అత్యంత కీలకమని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. సోమవారం అర్ధరాత్రి ఆయన 17, 18 వార్డుల్లో ఎంవిపి రైతు బజార్, ఐ హాస్పిటల్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను, 21వ వార్డులో చిన్న వాల్తేరు ప్రాంతాల్లో వీధి దీపాల నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా రాత్రి విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులతో కమిషనర్ మాట్లాడి వారి సేవలను అభినందించారు. నగరం నిద్రిస్తున్న వేళ పారిశుధ్య కార్మికులు విధులు నిర్వహించడం వల్ల మరుసటి రోజు ఉదయానికి రహదారులు, ఫుట్‌పాత్‌లు, పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపించడంతో పాటు ప్రజలు, వాహనాల రాకపోకలకు సౌకర్యవంతమైన వాతావరణం ఏర్పడుతోందని పేర్కొన్నారు. నగర పరిశుభ్రత, సుందరీకరణలో వారి కృషి అభినందనీయమని, అదే సమయంలో విధి నిర్వహణలో కార్మికుల ఆరోగ్యం, భద్రత, రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత ప్రజారోగ్య అధికారులకు సూచించారు.

కార్మికుల హాజరును పరిశీలించిన కమిషనర్, జీవీఎంసీ ద్వారా గ్లౌజులు, కొబ్బరి నూనె, చీపుర్లు, ఏప్రాన్లు తదితర అవసరమైన పనిముట్లు, రక్షణ సామగ్రి సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో యూనిఫామ్, గ్లౌజులు, ఏప్రాన్లు, షూస్, క్యాప్ తదితర రక్షణ పరికరాలను తప్పనిసరిగా వినియోగించాలని కార్మికులకు సూచించారు. రాత్రి పారిశుధ్య పనులను సంబంధిత సూపర్వైజర్లు బాధ్యతతో, చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు.



కార్మికులకు అవసరమైన పనిముట్లు, రక్షణ సామగ్రిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతూ, వారు సురక్షితంగా, సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అనుకూలమైన కార్యాచరణ చేపట్టాలని స్పష్టం చేశారు.

అనంతరం 21వ వార్డులో చిన్న వాల్తేరు ప్రాంతాల్లో వీధి దీపాల పనితీరును పరిశీలించిన కమిషనర్, రాత్రివేళ ప్రజల రాకపోకలకు, వాహనాల సురక్షిత ప్రయాణానికి వీధి దీపాల నిర్వహణ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా రాత్రి వేళల్లోనే క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ, పనిచేయని వీధి దీపాలను గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

# విహరిస్తున్న పందులు.. కరుస్తున్న కుక్కలు...

(7వ పేజీ తరువాయి)

దిబ్బపాలెం, జగ్గు జంక్షన్, కర్ణవాని పాలెం, గాజువాక రైతు బజార్, కణితి రోడ్డు, ఎల్.వి. నగర్, డ్రైవర్స్ కాలనీ, చిట్టినాయుడు కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. జీవీఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లు, చెత్త కుప్పలు, మురుగు కాలువల వద్ద వందల సంఖ్యలో పందులు గుమిగూడుతున్నాయి. చెత్తను రోడ్డుపైకి లాగి చిందరవందర చేయడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు దోమల బెడద తోడై మెదడు వాపు వ్యాధి తో పాటు వింత రోగాలు బారిన పడుతున్నామని, రాత్రి వేళల్లో ఇళ్లలోకి సైతం పందులు దూరిపోతున్నాయని వాపోతున్నారు. చిన్న పిల్లలపై ఇవి ఎక్కడ దాడి చేస్తాయోనని కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

**బిక్కుబిక్కుమంటూ జీవనం.. కరిచేందుకు వెంటాడుతున్న కుక్కలు!...**

మరోవైపు వీధి కుక్కల బెడద వర్ణనాతీతంగా మారింది. గుంపులు గుంపులుగా చేరి కుక్కలు ద్విచక్ర వాహనదారులు, కాలినడకన వెళ్లేవారిపై విరుచుకుపడుతున్నాయి. అపార్ట్ మెంట్ ఆవరణల్లోకి దూరి రాత్రంతా పెద్ద పెద్ద శబ్దాలతో భయభ్రాంతులకు గురిచేస్తు న్నాయి. పిచ్చి కుక్కలు కూడా విచ్చలవిడిగా తిరుగుతుండటంతో బయటకు వెళ్లాలన్నా, తిరిగి ఇంటికి చేరాలన్నా బిక్కుబిక్కుమంటూ జీవించాల్సి వస్తోందని, కుక్కకాటుకు గురై ర్యాబిస్ వ్యాధిన పడి మృత్యువడిలో చేరుతా మనే ఆందోళనతో స్థానికులు ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు.వేలల్లో పందులు, వందల్లో కుక్కలు తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం..**

జీవీఎంసీ పరిధిలోని 64, 65, 66, 67, 70, 71, 72, 73, 74, 75, 76 వార్డుల్లో శానిటరీ అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా 64, 65, 66, 67, 74 వార్డుల శానిటరీ అధికారులు పందుల పెంపకందా రులతో కుమ్మక్కై నెలవారీ మామూళ్ల వసూలు చేయడంలోనే నిమగ్నమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యపై ఫిర్యాదు చేసే స్థానికుల వివరా లను అధికా రులు నేరుగా పెంపకందారులకే చేరవేస్తుండటంతో, వారు ఫిర్యాదుదారులపై దాడులకు తెగబడుతున్నారని సమాచారం. అక్రమ ఆదాయంపై ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేకపోవడంతో అధికారులు విధులకు సైతం డుమ్మా కొడుతున్నారని ప్రజలు, ప్రజాసం ఘాలు మండిపడుతున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందించాలి!..**

రోజురోజుకూ ముదురుతున్న పందులు, కుక్కల సమస్యపై జీవీఎంసీ ఉన్నతాధికారు లు, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పం దించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తు న్నాయి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న శానిటరీ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకో వాలని, పందులను నగరం వెలుపలకు తర లించి, కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచి కిత్సలు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

### ఈనెల 13 నుండి 15 వరకు

## హర్ ఘర్ తిరంగా

(7వ పేజీ తరువాయి)

నాటి, జాతీయ జెండాను చేతబూని దేశ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఆగస్టు 14 , 15 తేదీలలో ప్రభుత్వ భవనాలు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు ముఖ్యమైన కూడళ్లను జాతీయ రంగుల విద్యుత్ దీపాలతోఅలంకరించాలని సూచించారు.జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో తాము దేశ భవిష్యత్తు కోసం ఏం చేయగలమో వివరిస్తూ స్వయంగా ప్రతిజ్ఞలు చేయనున్నారని తెలిపారు.

**"అనే నేను" సోషల్ మీడియా ప్రచారం:**

జిల్లాలోని యువత, విద్యార్థులు, ప్రముఖులు,క్రీడాకారులుపౌరులందరూ జాతీయ జెండాను చేతిలో పట్టుకుని "అనే నేను... దేశ అభివృద్ధి కోసం నా వంతుగా..." అంటూ 30 నుండి 60 సెకన్ల సెల్ఫీ వీడియోను రూపొందించి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఏఏపీ ఆఫీసియల్ న్యూస్ పేజీని ట్యాగ్ చేయాలని కలెక్టర్ కోరారు. వికసిత్ భారత్,స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, 'ఆలోచిద్దాం, ఆచరిద్దాం, వికసిత్ భారత్‌ను నిర్మిద్దాం' అనే నినాదంతో ముందుకు సాగాలని జిల్లా ప్రజలకు మరియు అధికారులకు కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఈపీడీసీఎల్ పరిధిలో శరవేగంగా సోలార్

(7వ పేజీ తరువాయి)

ఈపీడీసీఎల్ పరిధిలో సూర్యఘర్ పథకం అమలవుతున్న విధివిధానాలను తెలియజేశారు. షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అలాంటి వారిని గుర్తించి వారి ఇండ్ల పైకప్పులో రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ఈపీడీసీఎల్ గ్రామాల పరిధిలో ఎస్సీ, ఎస్టీలను గుర్తించి వారి ఇండ్ల పైకప్పులో సోలార్ ఏర్పాటు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. సోలార్ వేసుకునేందుకు ముందుగా వినియోగదారులు ఆన్లైన్లో ప్రైవేటు సోలార్ కంపెనీలను సంప్రదించి ఇంటి పై భాగంలో సోలార్ బిగించుకోవలెను. అనంతరం ఈపీడీసీఎల్ నెట్ మీటరింగ్ ద్వారా డిస్కంలకు అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు వినియోగించిన విద్యుత్తు పోను మిగిలిన యూనిట్లకు ఒక్కో యూనిట్కు 2.09 రూపాయలు చెల్లింపు జరుగుతుంది. ఎస్సీ ఎస్టీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 1200 కోట్లు రూపాయలు వెచ్చిస్తున్నారు. ఈపిడిసిల్ పరిధిలో 80 వేల సూర్యఘర్ లబ్ధిదారులకు అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఈ పథకం 80 శాతం ఈ పథకం అమలు కాగా పట్టణ ప్రాంతాల్లో 20 శాతం వేగంగా అమలవుతుంది. గతంలో ఉన్న ఎస్సీ ఎస్టీ పథకంతో పాటు తాజాగా బీసీల కూడా అదనపు సహాయం అందించనున్న నేపథ్యంలో అనేకమంది బీసీలు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

**పీఎం కుసుమ పథకం**

ఈ పథకం రైతులకు ఉచిత విద్యుత్ సరఫరాల భాగంగా అమలు చేస్తున్నారు ప్రధానంగా గ్రామాల్లో ఒక ప్రాంతంలో సోలార్ ఏర్పాటు చేసి దాని ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రైతులకు ఉచితంగా అందించనున్నారు దీని ద్వారా ప్రభుత్వానికి విద్యుత్తు ఖర్చు తగ్గే అవకాశం ఉంది. ఖరీఫ్ రబీ పంటల మినహా మిగిలిన సమయంలో ఉత్పత్తి అయిన విద్యుత్తు ఈపీడీసీఎల్ వినియోగించనుంది.

## విధుల్లో మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి రూ.4.56 లక్షల సాయం

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త :



విధులు నిర్వహిస్తూ మృతి చెందిన జీవీఎంసీ ఉద్యోగి కుటుంబానికి కో–ఆపరేటివ్ సొసైటీ అండగా నిలిచింది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ వర్కర్ తురాల కనకరాజు (ఎంప్లాయీ నంబర్ 1783) విధుల్లో ఉండగా మృతి చెందడంతో ఆయన భార్య తురాల ఈశ్వరికి రూ.4,56,717 విలువైన చెక్కును జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు వి.వి. వామనరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టి. కనకరాజు సొసైటీ సభ్యుడిగా ఉండటంతో సొసైటీలో అమలవుతున్న ఇన్సూరెన్స్ పథకం కింద ఆయన రుణాన్ని పూర్తిగా రద్దు చేసి, కుటుంబానికి ఆర్థిక సహాయం అందించినట్లు కమిషనర్ తెలిపారు. ఉద్యోగులు కో–ఆపరేటివ్ సొసైటీని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సొసైటీని సమర్థవంతంగా నిర్వహించుకోవడం ద్వారా ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా ప్రయోజనం కలుగుతుందని కేతన్ గార్గ్ పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సొసైటీకి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కే. ఎల్లయ్య, ట్రెజరర్ బి. తాతారావు, మేనేజర్ యర్ర ప్రసాదరావు, యూనియన్ నాయకులు జి. నర్సింగరావు, ఎన్. పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖపట్నం పోర్టులో రూ.334.89 కోట్లతో ఫ్లైఓవర్

(7వ పేజీ తరువాయి)

ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. దీని ద్వారా పోర్టు పరిధిలో రోడ్డు, రైలు రవాణాను వేరు చేసి, కార్గో వాహనాల రాకపోకలను సులభతరం చేయనున్నారు. ప్రస్తుతం పోర్టు లోని 9 ప్రధాన రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద తరచూ గేట్లు మూసివేయాల్సి వస్తోంది. అధిక సంఖ్యలో రైళ్ల రాకపోకల కారణంగా రోజుకు సుమారు 18 సార్లు గేట్లు మూసివేయడం జరుగుతోంది. దీంతో రహదారులపై వాహనాలు నిలిచిపోవడం, కార్గో రవాణాలో జాప్యం, ఇంధన వినియో గం పెరగడం, వాహన నిర్వహణ వ్యయాలు అధికం కావడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఎలివేటెడ్ కారిడార్ అందుబాటులోకి వస్తే రోడ్డు, రైలు రవాణా మధ్య ఏర్పడుతున్న ఇబ్బందులు తగ్గి, పోర్టులో వాహనాలు, కార్గో సజావుగా కదిలే అవకాశం ఉంటుంది. తద్వారా కార్గో ఎవాక్యుయేషన్ వేగవంతం కానుంది.

ఈ ప్రాజెక్టులో అనుబంధ సివిల్, ఎలక్ట్రికల్ పనులతో పాటు యుటిలిటీల మార్పిడి, భద్రతా ఏర్పాట్లు, ఐదేళ్ల నిర్వహణ వంటి పనులు కూడా ఉంటాయి. పోర్టు కార్యకలా పాలకు అంతరాయం కలగకుండా, ముఖ్యం గా కీలకమైన డాక్ ప్రాంతాల్లో నిర్మాణ పనులను దశలవారీగా చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు విశాఖపట్నం పోర్టులో కీలకమైన రవాణా బాటిల్ నెక్ ను తొలగించి, కార్గో రవాణాను వేగవంతం చేయడంతో పాటు పోర్టు సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ఆధునిక, సమర్థవంతమైన, అంతర్జాతీయ ప్రమాణాల పోర్టు మౌలిక వసతుల నిర్మాణా నికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పిఎం గతిశక్తి సమగ్ర మౌలిక వసతుల ప్రణాళికకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపడుతు న్నారు. పోర్టులో చివరి దశ కనెక్టివిటీని మెరుగుపరచడం, కార్గో ఎవాక్యుయేషన్‌ను వేగవంతం చేయడం ద్వారా దేశ సముద్ర వాణిజ్య, లాజిస్టిక్స్ వ్యవస్థలో విశాఖపట్నం పోర్టు పాత్ర మరింత బలోపేతం కానుంది. ప్రాజెక్టు పనులు ప్రారంభమైన తేదీ నుంచి 30 నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

## నీటి సమస్య పరిష్కారమే లక్ష్యం.. క్షేత్రస్థాయిలో జీవీఎంసీ ప్రత్యేక కార్యాచరణ

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త :



నగరంలో నీటి సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా వ్యవస్థపై జీవీఎంసీ అధికారులు తెల్లవారుజాము నుంచే క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టారు. కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలతో ప్రధాన ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణరాజు, పర్యవేక్షక ఇంజనీర్ పల్లంరాజు, ఈఈ మురళీకృష్ణ తదితరులు పలు ప్రాంతాల్లో నీటి సరఫరా, పీడనం, నాణ్యత, ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్లను పరిశీలించారు. పెదజాలారిపేటలో నీటి సరఫరా సంతృప్తికరంగా ఉందని, లో–ప్రెజర్ సమస్యలు లేవని అధికారులు నిర్ధారించారు. 13వ వార్డు ఎస్‌కేఎంఎల్ నగర్‌లో నీటి పంపిణీని పరిశీలించడంతో పాటు రైవాడ గ్రావిటీ మెయిన్ రీ–రూటింగ్ పనులను తనిఖీ చేశారు. అంగటిదిబ్బలో నీటి క్లోరినేషన్‌ను పరీక్షించగా 1.50 పీపీఎంగా నమోదైంది. ట్యాంకర్ ఫిల్లింగ్ పాయింట్‌ను కూడా పరిశీలించారు. నీటి వనరుల నుంచి రిజర్వాయర్లు, ప్రధాన పైపులైన్లు, పంపిణీ వ్యవస్థ, నీటి నాణ్యత వరకు ప్రతి దశను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. సమస్యలు గుర్తించిన వెంటనే పరిష్కరించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

## కోరమండల్ ఫెర్టిలైజర్స్ సిఎస్ఆర్ నిధులతో ట్రాఫిక్ నియంత్రణకు 70 ఐరన్ స్టాపర్లు అందజేత




గాజువాక,ఆగస్టు 11,ప్రభాతవార్త

మల్కాపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో రవాణాను క్రమబద్ధీకరించేందుకు కోరమండల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ యాజమాన్యం తమ సీఎస్ఆర్ (సామాజిక బాధ్యత) నిధుల నుంచి 70 ఐరన్ స్టాపర్లను సమకూర్చింది. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రాఫిక్ జోన్-2 ఏసీపీ భవ్యరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని స్టాపర్లను ప్రారంభించారు. మల్కాపురం పరిధిలో వాహనాల వేగాన్ని కట్టడి చేయడానికి, ప్రమాదాల నివారణకు ఇవి ఎంతో దోహదపడతాయని ఏసీపీ పేర్కొన్నారు. పోలీసు శాఖకు సహకరించిన కోరమండల్ ప్రతినిధులను ఆమె అభినందించారు. హార్బర్ ట్రాఫిక్ సీఐ ఎస్ షణ్ముఖరావు, మల్కాపురం ట్రాఫిక్ ఎస్ఐ కె శ్రీనివాసరావు, కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఏవీపీ (హెచ్ఆర్) కె.వి.వి.వై ఎస్ నారాయణ, సీఎస్ఆర్ ప్రతినిధి వెంకటరమణ, సీఎస్ఓ పిఎన్ పాత్రుడు, డిఎస్ఓ రామచంద్ర పాల్గొన్నారు.

## పాపాహోమ్‌కి భూరి విరాళం

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త



రిజర్వ్ బ్యారెక్స్‌లో గల పబ్లిక్ అండ్ పోలీస్ అసోసియేషన్ ఫర్ స్ట్రీట్ చిల్డ్రన్ పాపాహోమ్‌కి రమణ మహర్షుల వారి ఆశీస్సులతో దివంగత వంజరపు రామకృష్ణ జ్ఞాపకార్థం బాలుర పాపా హోమ్‌కి రెండులక్షలు సీతమ్మధార బాలికల పాపా హోమ్‌కి రెండులక్షలు విరాళాన్ని వారి తరపున వి.మోహనరావు చెక్కు రూపంలో పాపాహోమ్ అధ్యక్షులు డి.సూర్యప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్ జైన్‌కు అందజేశారు. దాతలకు పాపాహోమ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పాపాహోమ్ కార్యవర్గ సభ్యులు భాస్కర్ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## దేశాభివృద్ధిలో యువతే కీలకం

గాజువాక,ఆగస్టు11,ప్రభాతవార్త

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దడంలో యువత సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలు, సాంకేతిక పరిజ్ఞానంలో క్రియాశీల పాత్ర పోషించాలని ఏయూ విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ ఆచార్య ఎస్. హరినాథ్ పేర్కొన్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఏయూలో గురువారం 'డిజిటల్ ఇండియా', 'వికసిత భారత్' అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. 80 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు లక్ష్మణ్, సౌజన్య, మహేష్ పాల్గొన్నారు. విజేతలను, నిర్వాహకులను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అభినందించారు.

## డిజైర్ సొసైటీ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

గాజువాక,ఆగస్టు 11,ప్రభాతవార్త



గాజువాక ఆఫీషియల్ కాలనీలోని 'డిజైర్ సొసైటీ'లో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సొసైటీలోని పిల్లల నడుమ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భాజపా గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు సౌజన్యంతో పిల్లలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అలాగే నాయకుడు బగ్గు ఈశ్వరరావు సౌజన్యంతో బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి పీవీఎన్ మాధవ్ విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో భాజపా నాయకులు ముసలయ్య, జగదీష్, కేవీ రమణ, శ్రీనివాస్, శ్రీను, డిజైర్ సొసైటీ మేనేజర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## మరో రెండేళ్లలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు పూర్తి

### నగరంలో సగం భూగర్భ కేబుల్ పనులు పూర్తి : ఈపీడీసీఎల్ చైర్మన్ పృధ్వి తేజ్

జ్ఞానాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త

విశాఖ మహా నగరంలో విద్యుత్ శాఖ అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను మరో రెండేళ్లలో పూర్తి చేయనున్నట్టు ఈపీడీసీఎల్ చైర్మన్ పృధ్వి తేజ్ తెలిపారు. ఇప్పటికే నగరంలోని అనేక ప్రాంతాల్లో అండర్ గ్రౌండ్ కేబుల్ విధానం పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. కేబుల్ పూర్తయిన తర్వాత పోల్స్ వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తున్నట్టు ఆయన తెలిపారు. నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో భూగర్భ విద్యుత్ వైర్ల అమెరిక పనులు సర వేగంగా పూర్తి చేయడానికి సిబ్బంది పనులు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. అలాగే రోడ్లమీద అస్తవ్యస్తంగా ఉన్న మీటర్లు ఇతర విద్యుత్తు సమస్యలు భూగర్భ కేబుల్ ద్వారా పరిష్కారం కాగలదని ఆయన చెబుతున్నారు. 33, 11 కిలోవాట్ల సామర్థ్యం ఉన్న విద్యుత్ కేబుల్‌లు అన్నింటిని భూగర్భంలోకి అనుసంధానించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయడానికి ఈపీడీసీఎల్ పనులు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. భవిష్యత్తులో విశాఖ మహానగరం సుందర నగరంగా తీర్చిదిద్ద పడుతుందని ఆయన భరోసా ఇస్తున్నారు.

## జ్ఞానాపురంలో అడ్డదిడ్డంగా ఆటోలు పార్కింగ్

### ప్రశ్నిస్తే తాగి తిరగబడుతున్నారు -కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలంటున్న స్థానికులు



జ్ఞానాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త

జ్ఞానాపురంలో ఆటోల పార్కింగ్ అస్తవ్యస్తంగా ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. స్థానికంగా మాన్యువల్ వీధుల నుంచి గడ్డ వీధి వరకు ఉన్న ప్రధాన రహదారుల్లో ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసి వెళ్ళిపోతున్నారు. దీనితో కార్లు ఆటోలు నడపడానికి అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వీటితోపాటు పార్కు వీధి నుంచి గడ్డ వీధి మధ్యలో ఇసుక, ఇంటి మెటీరియల్స్ వేయడంతో నాలుగు చక్రాల వాహనాలు రవాణా చేసేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట జీవీఎంసీ వాహనాలు కూడా నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆటోలు అడ్డదిడ్డంగా నిలిపి ఇళ్లకు వెళ్లిపోవడంతో రాత్రివేళల్లో అత్యవసర సమయాల్లో వాహనాలు ప్రయాణించేందుకు అనే ఇబ్బందులు పడుతున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు జ్ఞానాపురం లోపల పరిశీలన చేస్తే పరిస్థితి అర్థం అవుతుంది. చిన్న వీధుల్లో ఆటోలు పార్కింగ్ చేయకుండా నిలువరించాల్సిన అవసరం ఉంది. పోలీసులు దృష్టి సారించి వాహనాలు సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సింహాచల క్షేత్రంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

సింహాచలం, ఆగస్టు 11, ప్రభాతవార్త



శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన పరిధిలో భక్తులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు మంగళవారం ఉదయం 7గంటల నుంచి కొండపై ప్రత్యేక పారిశుద్ధ్య తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శానిటరీ విభాగం కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి, ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందితో కలిసి ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టారు. లోవతోట ప్రాంతం నుంచి ప్రారంభమైన తనిఖీల్లో కొండపై ఉన్న వివిధ ప్రాంతాలను, భక్తులు అధికంగా సంచరించే ప్రదేశాలను, వాష్‌రూమ్‌లను, వ్యాపార సముదాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల సందర్భంగా అక్కడక్కడ కనిపించిన అవాంఛనీయ చెత్తను వెంటనే తొలగించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షించాలని శానిటరీ సిబ్బందికి ఈఓ సూచించారు. కేశఖండశాల సమీపంలోని వాష్‌రూమ్‌లను పరిశీలించిన ఈఓ, వాటి పరిశుభ్రత, నీటి సౌకర్యం, పరిసరాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వాష్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. జోడు భద్రాల ప్రాంతం, కొబ్బరికాయలు విక్రయించే ప్రదే శాలు, భక్తుల సెల్‌ఫోన్లను భద్రపరిచే ప్రాంతాలతో పాటు ప్రతి ముఖ్యమైన పాయింట్‌ను ఈఓ క్షుణ్ణంగా పరి శీలించారు. షాపింగ్ కాంప్లెక్స్ పైభాగంలో నీరు నిల్వ ఉండటాన్ని గమనించిన ఈఓ, వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెంటనే నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేయాలని ఇంజనీరింగ్ ఏఈ రవిరాజుకు ఆదేశించారు.

## జలమయమైన రాజీవ్ గాంధీ క్రీడా మైదానం..

ఎలమంచిలి, ఆగస్టు 11, ప్రభాతవార్త



పట్టణంలోని మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి రాజీవ్ గాంధీ క్రీడా మైదానం జలమయమైంది. మైదానం ఒకవైపు ఎత్తు మరోవైపు పల్లంగా ఉండటంతో వర్షపు నీరు అంతా చేరి చెరువును తలపిస్తుంది. దీంతో ఆగస్టు 15 సందర్భంగా క్రీడలను నిర్వహించడానికి ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొందని క్రీడాకారులు వాపోతున్నారు. వర్షం పడితే ప్రతిసారి ఇదే పరిస్థితి ఎదురవుతుందని క్రీడాకారుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్రీడా మైదానాన్ని బాగు చేయాలని కోరుతున్నారు.

## రింతాడలో గ్రామ ఆరోగ్య కమిటీ సమావేశం




గూడెం కొత్తవీధి ఆగస్టు 11 ప్రభాతవార్త:

మండలంలో రింతాడ పంచాయతీలో గ్రామ ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణ కమిటీ (విహెచ్ఎస్ఎన్‌సి) సమావేశం ఏఐఐ ఎంఎస్ ఆధ్వర్యంలో, ఎక్విప్ ప్రాజెక్టు ప్రధాన పరిశోధకురాలు డాక్టర్ వై.ఎస్. కుసుమ మార్గదర్శకత్వంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐఐఎంఎస్ బృంద సభ్యులు శ్రీనివాసు, రాజుతో పాటు సీహెచ్ఓ, ఆశా, ఏఎన్ఎం, హెచ్ఏ, మహిళా పోలీస్, ఎస్టీఎస్, ఎస్టీఎల్ఎస్, గ్రామ కమ్యూనిటీ సభ్యులు పాల్గొన్నారు. కలరా, టైఫాయిడ్, హెపటైటిస్-ఏ, మలేరియా, టీబీ తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో పాటు సురక్షితమైన తాగునీటిని వినియోగించాలని సూచించారు. మానసిక ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు నిర్వహించే స్క్రీనింగ్‌పై ఏఐఐఎంఎస్ బృందం అవగాహన కల్పించింది. టీబీ లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచన మేరకు మందులను పూర్తి కోర్సు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల మొదటి శుక్రవారం వి.హెచ్.ఎస్.ఎన్.సి సమావేశాన్ని నిర్వహించి, గ్రామంలోని ఆరోగ్యం, పారిశుధ్యం, పోషణ సమస్యలను గుర్తించి పరిష్కరించు కోవాలని సూచించారు. 2030 నాటికి టీబీ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్'లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## యువత క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

### పెదగూడ మాజీ సర్పంచ్ మండి బాబురావు -యువతకు వాలీబాల్ కిట్టు పంపిణీ

ముంచంగిపుట్టు ఆగస్టు 11, ప్రభాతవార్త



గిరిజన యువత క్రీడారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అందుకు యువత క్రీడల్లో బాగా రాణించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పెదగూడ మాజీ సర్పంచ్ మండి బాబురావు యువతకు పిలుపునిచ్చారు. మండలంలో పెదగూడ పంచాయితీ బాకు బెడ గ్రామంలో యువతకు సొంత నిధులతో వాలీబాల్ కిట్లను మాజీ సర్పంచ్ మండి బాబురావు మంగళవారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో చాలామంది యువతి యువకులు క్రీడారంగంలో మంచి నైపుణ్యం కలిగిన వారు సరైన ప్రోత్సాహం లేక వారంతా మట్టిలో మాణిక్యాల లాగానే ఉండిపోతున్నారని. వారిని ప్రభుత్వాలు ప్రోత్సహించి ముందుకు తీసుకువెళ్తే క్రీడారంగంలో మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకొని దేశానికి గర్వకారణంగా నిలుస్తారని అందుకు ప్రభుత్వాలు ముందుకు రావాలని ఆయన కోరారు. గ్రామంలో యువత, గ్రామ పెద్దలతో పాటు పూజారి నాగరాజు, మేడ. రాధాకృష్ణ, లిమికీయా చిరంజీవి,దిశారి. సుందర్ రావు, లిమికీయ బుద్ధు పాల్గొన్నారు.

### ఆదివాసి గిరిజన విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని

## జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు వినతిపత్రం అందజేత

### సానుకూలంగా స్పందించిన అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్

ముంచంగిపుట్టు, ఆగస్టు 11,ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో వివిధ పత్రికలలో సుమారు గత 10 నుంచి 15 ఏళ్లుగా పాత్రికేయులాగా ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ప్రజా సమస్య పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్న ఆదివాసి గిరిజ విలేకరులకు గృహాలు కట్టుకొనుటకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మంగళ వారం అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాన్ని ముంచంగిపుట్టు మండల ఆదివాసి గిరిజన సంఘ అధ్యక్షుడు కార్యదర్శి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన ఆదివాసి గిరిజన విలేకరులు మాట్లాడుతూ గత 10 నుంచి 15ఏళ్లుగా విలేకరి వృతినీ నమ్ముకొని ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా సేవలందిస్తున్నామని అన్నారు. కనీసం జీతాలు లేకుండా ప్రజాసేవకే విలేకరి వృత్తి కె అంకితం అయినట్లు తెలిపారు. గిరిజన విలేకరుల ఇళ్ల స్థలాల కేటించాలని వినతి పత్రం స్వీకరించిన జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ మాట్లాడుతూ ప్రతి విలేకరికి కనీసం మూడు సెంట్ల ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె సానుకూలంగా స్పందించారు. రెండు మూడు రోజులలో ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరితగతిన సమస్య పరిష్కరించేందుకు ముంచంగిపుట్టు మండల తహసిల్దార్ కుఆదేశాలు జారీ చేస్తానని అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ విలేకరులకు హామీ ఇచ్చినట్లు ముంచంగి పుట్టు ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శి కాంతరు మోహన్ కూడా మోహన్ కోశాధికారి పాంగి భాస్కర్ రావు సంఘ సభ్యులు గంపరాయి కోటేశ్వర రావు కూడా అనిల్ కుమార్‌కి ముడు రాంబాబు పాంగి పులి రాజులు జాయింట్ కలెక్టర్‌కు కలిసి వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## యూ నీటి ఫర్ చారిటీ బుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం : కె.సురేంద్ర




దుంబ్రిగూడ, ఆగస్టు 11 ప్రభాతవార్త

యూనిట్ ఫర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కిలో సురేంద్ర చెప్పారు. మండలంలోని అరకు సంత బయలు గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డా.నీలి నారాయణ, జ్యోస్ఫిన్ ఆధ్వర్యంలో 25 వేల ఖరీదు గల మెగా ఫోన్‌ను మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి సేవ కార్యక్రమాలు మరింతగా అందించాలని ఆయన కోరారు. ఇటువంటి సేవ కార్యక్రమాలు గిరిజన ప్రాంతాల్లో మరింతగా విస్తరించి సేవలు అందేలా చూడాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పోతురాజు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి సూర్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు కే మురళి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జీసీసీ విశ్రాంత ఉద్యోగి శరభన్న పడాల్ కన్నుమూత



గూడెం కొత్తవీధి ఆగస్టు 11 ప్రభాతవార్త

గిరిజన సహకార సంస్థ (జీసీసీ) విశ్రాంత ఉద్యోగి కంకిపాటి శరభన్న పడాల్ (62) అంత్యక్రియలు మంగళవారం అశ్రునయనాల మధ్య ముగిశాయి. గూడెం కొత్తవీధి మండలం పెదవలస గ్రామానికి చెందిన ఆయన సోమవారం రాత్రి తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో బ్రెయిన్ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మృతి చెందారు. శరభన్న పడాల్ జీసీసీ ఉద్యోగిగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సుదీర్ఘకాలం సేవలందించారు. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలతో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. గిరిజనుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసి మంచి పేరు సంపాదించారు. ఆయన మృతికి గిరిజన సంఘాల నాయకులు, జీసీసీ సిబ్బంది, స్థానికులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం పెదవలసలో నిర్వహించిన అంతిమయాత్రకు గ్రామస్థులు, గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు, బంధువులు, శ్రేయోభిలాషులు భారీగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

## వంచుల ఎంపీపీ పాఠశాలలో విద్యాశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీ



గూడెం కొత్తవీధి, ఆగస్టు 11, ప్రభాతవార్త

మండలంలోని వంచుల ఎంపీపీ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా బోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన అధికారులు వారి విద్యా ప్రగతి, పాఠ్యాంశాలపై అవగాహనను తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ఆహార నాణ్యత, మెనూ అమలు తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి-1 ఎల్. రాంబాబు, మండల విద్యాశాఖ అధికారి-2 రామన్న, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ ప్రతిభ మరియు ఆర్థిక సహాయ ఉపకార వేతనం పథకానికి

## కర్రీముఖి పుట్టు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి ఎంపిక

### విద్యార్థిని సత్కరించిన ఉపాధ్యాయులు

ముంచంగిపుట్టు, ఆగస్టు 11,ప్రభాతవార్త



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ ప్రతిభ మరియు ఆర్థిక సహాయ ఉపకార వేతనం పథకానికి అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల కర్రీముఖి పుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కోడా. సూర్య ప్రకాష్ ఎంపిక కావడం పట్ల ఆ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈ పథకానికి ఎంపికైన విద్యార్థి కోడా. సూర్య ప్రకాష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే గణపతి రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు కే గణేశ్వరరావు, గ్రామస్తులు దుస్సాల్వాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు కే గణపతి రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది అన్ని రాష్ట్రాల్లో ఉన్న పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు జాతీయస్థాయిలో విద్యా ప్రతిభ వ్రాత పరీక్షల పోటీని నిర్వహించడం జరుగుతుందని ప్రతిభ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఏడాదికి 12 వేల రూపాయల స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు అందించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా గత ఏడాది నిర్వహించిన ప్రతిభా పరీక్ష పోటీల్లో విశాఖ ఏజెన్సీ 11 మండలాల్లో ఐదు పాఠశాలలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపిక కాబడ్డారని అందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం కర్రిముక్కిపుట్టు పంచాయతీ కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 9వ తరగతి విద్యను అభ్యసిస్తున్న కోడా. సూర్య ప్రకాష్ ఎంపిక అయ్యాడని అందుకు తాము ఎంతో గర్వపడుతున్నామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు చిన్నగున్ని పడాల్, రామదాసు, అప్పలరాజు, గాసన్న తదితర ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థిని సత్కరించారు.

## ఫారెస్ట్ భూముల్లో అక్రమంగా చెట్ల నరికివేత

### వాడపాలెం సముద్రతీర ప్రాంతంలో రెండు వేలకు పైగా తాటి చెట్ల తొలగింపు -భూమిని చదును చేసి ఆక్రమించే ప్రయత్నం -పట్టించుకోని సంబంధిత అధికారులు

రాంబిల్లి, ఆగస్టు 11, ప్రభాతవార్త



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడపాలెం గ్రామ సమీపంలో సముద్రాన్ని ఆనుకుని ఉన్న అటవీ భూముల్లో భారీగా తాటి చెట్లను నరికివేసి, వాటిని వేళ్లతో సహా తొలగించి సుమారు పది ఎకరాల భూమిని చదును చేసి ఆక్రమించే ప్రయత్నం జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని కొంతమంది స్థానికులు వాపోయారు. సుమారు రెండు వేలకుపైగా తాటిచెట్లను తొలగించి, చెట్ల అవశేషా లకు నిప్పంటించి కాల్చివేసినట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతంగా పేర్కొంటున్న ఈ భూమిలో పెద్దఎత్తున చెట్లను తొలగించడంతో ప్రస్తుతం అక్కడ చెట్ల ఆనవాళ్లు, నరికివేసిన దుంగలు, ఎండిన ఆకులు, కాలిపోయిన అవశేషాలు కనిపిస్తున్నాయి. జేసీబీల సహాయంతో భూమిని చదును చేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. స్థానికంగా జేసీబీ యంత్రాలు కలిగిన గుత్తేదారుడితో ఈ భూమిని పూర్తిగా చదును చేసి అప్పగించేందుకు లక్షల రూపాయల్లో ఒప్పందం కుదిరినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారానికి సంబం ధించిన పూర్తి వివరాలు, భూమి ఎవరి ఆధీనంలో ఉంది, ఎలాంటి అనుమతులతో చెట్లను తొలగించారనే విషయాలు అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. ఈ వ్యవహారం వెనుక కొంతమంది రాజకీయ అండదండలు ఉన్న వ్యక్తులు ఉన్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను సంబంధిత అధికారులు అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ఈ విషయంపై సంబంధిత ఫారెస్ట్ సెక్షన్ అధికారి రమణను సంప్రదించగా, తాను ప్రస్తుతం అందుబాటులో లేనని, సంబంధిత ఫారెస్ట్ గార్డును సంఘటనా స్థలానికి పంపిస్తానని తెలిపారు. తాను అందుబాటులోకి వచ్చిన అనంతరం చెట్ల నరికివేతపై పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల్లో అనుమతులు లేకుండా చెట్లను తొలగించడం, భూమిని చదును చేయడం పై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**PUBLIC NOTICE**
IN THE COURT OF HON'BLE
IV SENIOR CIVIL JUDGE:
CITY CIVIL COURT
AT: HYDERABAD
O.S. No. 94 OF 2025
BETWEEN:
M/s Nibav Lifts Pvt. Ltd. ...Plaintiff/s
AND
Gode Vijaya Chakravarthy ...Defendant/s
To,
Gode Vijaya Chakravarthy
S/o G. John Purushotham,
R/o K.S. Kumars Towers,
D.No.27-4-73/11, Flat No.303,
Old Karnavanipalem, Gajuwaka,
Pedagantyada, Balacheruvu,
Vishkapatnam, A.P.- 530044.
Please take notice that the above suit O.S. No 94 of 2025 is filed for Damages and same is posted for appearance of defendant (Gode Vijaya Chakravarthy) on 17-09-2026 @ 10:30 a.m failing which exparte orders will be passed against you.
// By the order of Court //
M/s G. NANDA GOPAL,
S. DALJITH SINGH,
P. SHRAVAN KUMAR GOUD
Advocates
#308, Malik Chambers,
Hyderguda Main Road,
Hyderabad - 500 029,
Ph. 9849619912,
nani_lak@yahoo.com

## డొక్కా సీతమ్మ ఇంటికి వివేకానంద సంస్థ సభ్యులు

విశాఖపట్నం, ఆగస్టు 11, ప్రభాతవార్త

ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తిని కొనసాగిస్తూ శ్రీ స్వామి వివేకానంద అనాథాశ్రమం సభ్యులు తూర్పుగోదావరి జిల్లా లంకల గన్నవరం వెళ్లి ఆమె బంధువులను కలిశారు. సీతమ్మ ఐదో తరం వారసులతో కలిసి ఫొటో దిగారు. సీతమ్మ స్ఫూర్తితో ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రతి రోజూ మధ్యాహ్నం, రాత్రి అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. రౌండ్ టేబుల్ సంస్థ సహకారంతో వారంలో మూడు రోజులు అదనంగా 200 మందికి భోజనం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

**LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్**
బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్.ఐ.సి. ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం - 530004. ఫోన్: 0891-2746480

(రూల్ 8 (1)) **స్వాధీనతా ప్రకటన**
U/s.13(4) SARFAESI చట్టం 2002 ప్రకారం (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) ప్రకారము **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సదరు చట్టము సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని (రూల్-3)తో చదువబడే సెక్షన్ 13(12) ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: నాగేంద్ర కాంతి మహంతి మరియు సహ-ఋణగ్రహీత శ్రీమతి రాదికా కాంతి మహంతి నివాసం:** డి.నెం.50-1-57/2, ఎవిఎస్ఆర్ నగర్, క్షత్రియ కళ్యాణ మండపం ప్రక్కన, సీతమ్మధార, విశాఖపట్నం-530013 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.1,61,29,299.55 (అక్షరాల ఒక్క కోటి అరవై ఒక్క లక్షల ఇరవై తొమ్మిది వేల రెండు వందల తొంభై తొమ్మిది రూపాయల యాభై అయిదు పైసలు మాత్రమే) తేది.20.05.2025** నుండి తదుపరి వడ్డీ, ఖర్చులు మొదలగునవి కలిపి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.19-05-2025న డిమాండ్ నోటీసు** జారీ చేయబడినది. **(లోన్ ఖాతా నెం.711500013662, ఏరియా ఆఫీస్ : విశాఖపట్నం).**

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13 సబ్ సెక్షన్ (4)కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు నందలి రూలు 8 ప్రకారము **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్‌నకు తనఖా చేయబడిన దిగువ తెలిపిన ఆస్తిని తేది.11-08-2026న లాంఛనాత్మకంగా స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.1,61,29,299.55 (అక్షరాల ఒక్క కోటి అరవై ఒక్క లక్షల ఇరవై తొమ్మిది వేల రెండు వందల తొంభై తొమ్మిది రూపాయల యాభై అయిదు పైసలు మాత్రమే) తేది.20.05.2025** నుండి ఒప్పంద రేటు ప్రకారం వర్తించు తదుపరి వడ్డీ, ఇతర ఖర్చులు **LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** వారి ఛార్జికి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/సహ-ఋణగ్రహీత/హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (మీ ద్వారా ఏవైనా చెల్లింపులు ఉన్నచో మినహాయించబడును).

**స్థిరాస్తి వివరములు**

**మొత్తం ఆస్తి/షెడ్యూలు ఆస్తి:** కంపెనీ వారి నుండి పొందిన ఋణము తిరిగి చెల్లింపునకు హామీగా మీచేహక్కు దస్తావేజు నెం.7926/2021, ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, చినగదిలి మండలంలో సర్వే నెం.1/పి ఎండాడ గ్రామం, స్థల విస్తీర్ణం 80 (ఎనభై) ఎకరములు ఆస్తి అందులో 62 (అరవై రెండు) ఎకరములు మరియు 70 (డెభై) సెంట్లు మరియు సర్వే నెం.386/పిలో గల మధురవాడ గ్రామంలో విస్తీర్ణం 17 (పదిహేడు) ఎకరములు మరియు 30 (ముప్పై) సెంట్లు. **ఎండాడ గ్రామంలో సర్వే నెం.1/పికి హద్దులు: తూర్పు:** ప్రైవేటు ఆస్తి, **పడమర:** ప్రైవేటు ఆస్తి, **ఉత్తరం :** ఎన్‌హెచ్-5 బీచ్‌రోడ్డుతో కలిపే 100 అ॥ల రోడ్డు, **దక్షిణం :** ప్రైవేటు ఆస్తి. **మధురవాడ గ్రామంలో సర్వేనెం.386/పికి హద్దులు: తూర్పు:** ప్రైవేటు ఆస్తి, **పడమర:** ప్రైవేటు ఆస్తి, **ఉత్తరం :** ప్రైవేటు ఆస్తి, **దక్షిణం :** ఎన్‌హెచ్-5 బీచ్‌రోడ్డుతో కలిపే 100 అ॥ల రోడ్డు.

**షెడ్యూలు "ఏ1" ఆస్తి:** ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, చినగదిలి మండలం, ఎండాడ గ్రామంలో సర్వే నెం.1/పి స్థలం విస్తీర్ణం 62 (అరవై రెండు) ఎకరములు మరియు 70 (డెభై) సెంట్లు కొలతల ప్రకారం మొత్తం స్థలం **హద్దులు: తూర్పు:** ప్రైవేటు ఆస్తి, **దక్షిణం :** ప్రైవేటు ఆస్తి, **పడమర :** ప్రైవేటు ఆస్తి, **ఉత్తరం :** ఎన్‌హెచ్-5 బీచ్‌రోడ్డుతో కలిపే 100 అ॥ల రోడ్డు.

**ఏరియా "ఏ1" షెడ్యూలు "ఏ1" ఆస్తి:** ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, చినగదిలి మండలం, ఎండాడ గ్రామంలో సర్వే నెం.1/పి స్థలం విస్తీర్ణం 38 (ముప్పై ఎనిమిది) ఎకరములు మరియు 8 (ఎనిమిది) సెంట్లు కొలతల ప్రకారం మొత్తం స్థలం **హద్దులు: తూర్పు:** సర్వే నెం.1/పి చెందిన మిగిలిన పోర్షన్, **దక్షిణం :** ప్రైవేటు ఆస్తి, **పడమర :** ప్రైవేటు ఆస్తి, **ఉత్తరం :** ఎన్‌హెచ్-5 బీచ్‌రోడ్డుతో కలిపే 100 అ॥ల రోడ్డు.

**షెడ్యూల్ "బి" ఆస్తి:** విశాఖపట్నం జిల్లా, మధురవాడ ఎస్ఆర్ఓ పరిధి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎండాడ గ్రామం, వార్డు నెం.6, సర్వే నెం.1/పి కవర్ కాబడిన మున్సిపల్ అసెస్‌మెంట్ నెం.1086506162, డోర్ నెం.2-22/203/టిఎల్-01, షెడ్యూల్ ఎ1 నందు ఏరియా ఎ1లో రెసిడెన్షియల్ విల్లాగా ప్రాజెక్టుగా నిర్మితమైన నాలుగు బెడ్‌రూంలు, కిచెన్‌లు, బాత్‌రూంలు మొ॥నవి సూపర్ బిల్టప్ ఏరియాతో 4755 చ॥అ॥లు (సుమారుగా) స్థలం సరిహద్దులు 444.44 చ॥గ॥లుగా షెడ్యూల్ ఎ1లో ఏరియా ఎ1 ఆస్తి నెం.ఆర్‌వి-194, తులిప్ విల్లా నెం.టిఎల్-01కు హద్దులు. **విల్లాకు హద్దులు: తూర్పు:** టిఎల్-08 (తులిప్ విల్లా) & టిఎల్-09 (తులిప్ విల్లా) **దక్షిణం :** ఓపెన్ స్పేస్, **పడమర :** 9 మీటర్ల రోడ్డు, **ఉత్తరం :** టిఎల్-02 (తులిప్ విల్లా)

**ఇప్పటి నుండి "సెక్యూర్డ్ ఆస్తి" గా పరిగణించబడును.**

**తేది.11.08.2026న నా స్వహస్తములతో కంపెనీ ముద్రతో జారీచేయబడినది.**

**SARFAESI** చట్టంలోని సెక్షన్ 13(4)తో కలిపి చదవబడే రూల్-8(1) కింద **06.08.2025వ తేదీన జారీ చేయబడిన మునుపటి స్వాధీనం నోటీసు రద్దు చేయబడినందున ఉపసంహరించబడినది.**

తేది. : 11.08.2026
ప్రదేశం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి
LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

12-8Pg7exHMNWJQEBPGOL.qxd:12-8Pg7exHMNWJQEBPGOL.qxd 1/1/02 6:22 AM Page 1



## వన్య ప్రాణి వేటగాళ్లు అరెస్టు



**కదిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ముదిగుబ్బ మండలం దొరిగల్లు ఈస్ట్ బీట్‌లో వన్య ప్రాణులను వేటాడేందుకు ప్రయత్నిస్తున్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారి గుర్రప్ప తెలిపారు. మంగళవారం ఫారెస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గుర్రప్ప ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కసంబావి ప్రాంతంలో వన్యప్రాణి వేట జరుగుతోందన్న సమాచారం తెలియడంతో అటవీశాఖ సిబ్బంది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నార్పల మండలం రంగాపురానికి చెందిన రామాంజనేయులు, రాజేంద్ర బాబు, కుళ్లాయప్ప, ఉమా మహేష్, గంగన్న, యాదవ్, బత్తలపల్లికి చెందిన ముత్యాలయ్య, ఆదెప్పలను అరెస్టు చేసి వారి నుంచి ఒక ఆటువ, ఒక ద్విచక్ర వాహనం, ఒక నాటు తుపాకీ, గన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకుని న్యాయ స్థానంలో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారన్నారు. వన్య ప్రాణులను వేటాడినా, అడవుల్లో ఆయుధాలతో సంచరించినా ఎట్టపరిస్థితుల్లోనూ ఉపేక్షించమని గుర్రప్ప హెచ్చరించారు.

# కణేకల్లు రోడ్డు రైల్వే వంతెనకు త్వరలో మోక్షం

### ప్రజా ప్రతినిధులకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న హామీ



రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న ను కలిసిన ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మీ నారాయణ, పార్థసారథి

**గుంతకల్ రైల్వే ఆగస్టు 11: ప్రభాత వార్త :** దక్షి ణ కోస్తా రైల్వే జోన్ గుంతకల్ డివిజన్ రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రహదారిపై గత ఏడేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను జిల్లా ప్రజాప్రతినిధులు కోరారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో మంగళవారం మంత్రి కార్యాలయంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారథి కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయదుర్గం పట్టణ పరిధిలోని కణేకల్లు అనంతపురం ప్రధాన రహదారులపై చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణ పనులు గత ఏడేళ్లుగా నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత సంవత్సరాల క్రితం రాయదుర్గం నుండి అనంతపురం, కణేకల్లు రెండు రైల్వే వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. అనంతరం వివిధ కారణాలతో పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతపురం రహదారిపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పనులను పూర్తి చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అంగీకరించి రూ.46 కోట్లు మంజూరు చేసిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. అయితే కణేకల్లు రోడ్డులోని రైల్వే వంతెన నిర్మాణాన్ని రైల్వే శాఖ ఆధ్వర్యంలోనే పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా బళ్లారి–చిక్కజాజూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో కణేకల్లు రహదారిపై ఉన్న రైల్వే వంతెన నిర్మాణానికి మరింత ప్రాధాన్యత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. డబ్లింగ్ పనులు పూర్తయిన తర్వాత రాయదుర్గం–తుమకూరు రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు, రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఈ వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే బోర్డు సభ్యులతో పాటు నిర్మాణ పనులను పర్యవేక్షి స్తున్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వంతెన నిర్మాణాన్ని ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనతో ఏడేళ్లుగా నిలిచిపోయిన కణేకల్లు రైల్వే వంతెన నిర్మాణ పనులకు త్వరలో కదలిక వచ్చే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన పూర్తయితే రాయదుర్గం పట్టణ ప్రజల రాకపోకలు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు, భవిష్యత్తులో పెరగనున్న రైల్వే రద్దీకి అనుగుణంగా రహదారి రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కల్వర్టు వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ లో నిత్యం నీళ్ళు నిలిచి ఉంటుండగా దీనివల్ల రెండువైపులా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు, వెంటనే చర్యలు చేపట్టాలని , మంత్రికి తెలిపేరు. కొండవీడు ఎక్స్ ప్రెస్ రోజూ నడపాలని అనంతపురం ఎంపీ అంబికా మంత్రిని కోరారు.

## బిసిలకు అదనంగా 20 వేల రూపాయలు సబ్సిడీ

### ఇపిడిసిఎల్ చైర్మన్ పృథ్వీ తేజ్

**విశాఖపట్నం (జ్ఞానాపురం), ప్రభాతవార్త:** సంప్రదాయ ఇంధన సౌర విద్యుత్ వినియోగం పెంచడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో పకడ్బందీగా శ్రమిస్తున్నాయి. దీనిలో భాగంగా ఇప్పటికే రూఫ్ టాప్ సోలార్‌ను ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా అందిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ గృహాల పైకప్పులో సౌర విద్యుత్తు ఏర్పాటుకు ఈపీడీసీఎల్ పూర్తి సహకారం అందిస్తున్నట్లు ఈపీడీసీఎల్ చైర్మన్ పృథ్విరాజ్ తెలిపారు. ప్రభుత్వాలు తాజాగా వెనుకబడిన తరగతులకు కూడా మరింత ప్రోత్సాహం అందించడానికి ముందుకు వస్తున్నాయి. వెనుకబడిన తరగతుల (బీసీ) కు చెందినవారు నెలవారి వాడకం 200 యూనిట్లు లోపల ఉంటే వారికి ప్రస్తుత ఇస్తున్న రెండు కిలోవాట్లకు 60 వేల రూపాయలకు సబ్సిడీకి అదనంగా మరో 20,000 రూపాయల ప్రభుత్వం మంజూరు చేయనున్నట్లు ఈపీడీసీఎల్ చైర్మన్ యిమంది పృధ్వి తేజ్ తెలిపారు. మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఈపీడీసీఎల్ పరిధిలో సూర్యఘర్ పథకం అమలవుతున్న విధివిధానాలను తెలియజేశారు. సోలార్ వేసుకునేందుకు ముందుగా వినియోగదారులు ఆన్లైన్ ప్రైవేటు సోలార్ కంపెనీలను సంప్రదించి ఇంటి పై భాగంలో సోలార్ బిగింపుకోవడం. అనంతరం ఈపీడీసీఎల్ నెట్ మీటరింగ్ ద్వారా డిస్కంకు అనుసంధానం చేస్తారు. వినియోగించిన విద్యుత్తు పోను మిగిలిన యూనిట్లకు ఒక్కో యూనిట్కు 2.09 రూపాయలు చెల్లింపు జరుగుతుంది. ఎస్సీ ఎస్టీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 1200 కోట్లు రూపాయలు వెచ్చిస్తున్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో 80 వేల సూర్యఘర్ లబ్ధిదారులకు అవకాశం కల్పించినట్టు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో ఈ పథకం 80 శాతం ఈ పథకం అమలు కాగా పట్టణ ప్రాంతాల్లో 20 శాతం వేగంగా అమలవుతుంది. అని తెలియజేశారు.

# జార్ఖండ్‌లో విద్యార్థులపై పోలీసుల దమనకాండను ఖండిస్తున్నాం

### రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నించిన ఎపి బిజెపి చీఫ్ పివియన్ మాధవ్

**విశాఖపట్నం: ఆగస్టు 11 ప్రభాత వార్త:** జార్ఖండ్ రాజధాని రాంచీలో తమ ఉపాధి,ఉద్యోగాలు, భవిష్యత్తు, హక్కుల కోసం శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరును ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తీవ్రంగా ఖండించారు . విశాఖపట్నం భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన పత్రికా సమావేశంలో పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ..విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సి న కాంగ్రెస్–జేఎంఎం ప్రభుత్వం అందుకు బదులుగా వారిపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం, వాటర్ క్యానన్లు ఉపయోగించడం, బారికేడ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ హక్కుల కోసం నిరసన చేస్తున్న విద్యార్థులను అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పీవీఎన్ మాధవ్ అన్నారు. విద్యార్థులు తమ సమస్యలపై ప్రశ్నిస్తే వారిని శత్రువులుగా చూడటం కాంగ్రెస్–జేఎంఎం ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమన్నారు. మహిళా విద్యార్థుల పట్ల కూడా అనుచితంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలని మాధవ్ డిమాండ్ చేశారు.విద్యార్థుల సమస్యలపై దేశవ్యాప్తంగా మాట్లాడే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి జార్ఖండ్ విద్యార్థుల ఆవేదన ఎందుకు కనిపించడం లేదని పీవీఎన్ మాధవ్ సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో జరిగే ప్రతి నిరసనపై స్పందించే రాహుల్ గాంధీ, కాంగ్రెస్–జేఎంఎం ప్రభుత్వం అధికారంలో ఉన్న జార్ఖండ్‌లో విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యపై ఎందుకు మోనం వహిస్తున్నారని నిలదీశారు.విద్యార్థుల భవిష్యత్తు కంటే కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో పోలీసులు విద్యార్థులపై చర్యలు తీసుకుంటే ఒక విధంగా, ఇతర రాష్ట్రాల్లో జరిగితే మరో విధంగా స్పందించడం కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరి కాదా అని అన్నారు. విద్యార్థులకు మద్దతు ఇవ్వడంలో కూడా 'పాలిటిక్స్ ఆఫ్ కన్వీనియెన్స్' ఎందుకు పాటిస్తున్నారని ప్రశ్నించారు.రాహుల్ గాంధీ నిజంగా విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉంటే జార్ఖండ్‌కు వెళ్లి విద్యార్థులను పరామర్శించి, వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదని పీవీఎన్ మాధవ్ అన్నారు.గత కొద్ది రోజులుగా పార్లమెంట్‌లో ప్రజా సమస్యలపై చర్చ జరగాల్సి న సమయంలో గందరగోళం సృష్టించడమే కాంగ్రెస్ పార్టీ వైఖరిగా మారిందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. మొదట ఒక డిమాండ్, ఆ తర్వాత మరో డిమాండ్, ఇప్పుడు ఇంకో అంశాన్ని తెరపైకి తీసుకురావడం చూస్తుంటే రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన 'గోల్‌పోస్ట్' ఎందుకు మారుస్తున్నారో దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ సభను సజావుగా నడవనివ్వకుండా కాంగ్రెస్ పార్టీ ఎందుకు అడ్డుకుంటోందని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి సభలో ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని కేంద్ర మంత్రులు స్పష్టం చేస్తున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ చర్చ నుంచి ఎందుకు వెనక్కి వెళ్తోందని నిలదీశారు.చర్చకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వం.. చర్చకు సిద్ధంగా లేని ప్రతిపక్షం" అన్న పరిస్థితి ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కనిపిస్తోందని పీవీఎన్ మాధవ్ విమర్శించారు. పార్లమెంట్ ప్రజా సమస్యలపై చర్చించాల్సి న వేదిక అని, రాజకీయ గందరగోళానికి వేదిక కాదని అన్నారు.ఆగస్టు 10న నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంతర్ మంతర్ ఘటనకు సంబంధించి రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై వాస్తవాలను దేశ ప్రజల ముందు ఉంచాల్సి న అవసరం ఉందని పీవీఎన్ మాధవ్ అన్నారు. జంతర్ మంతర్ వద్ద బుల్లెట్లు పేల్చినట్లు చేసిన ఆరోపణలకు ఆధారాలు ఏమిటో రాహుల్ గాంధీ దేశ ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.రాజకీయ లబ్ధి కోసం నిర్ధారణ లేని ఆరోపణలు చేయడం, వాటి ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించడం బాధ్యతాయుతమైన రాజకీయ నాయకుడి లక్షణం కాదని అన్నారు. "రాహుల్ గాంధీ గారూ.. ఆరోపణలు చేయడం కాదు.. ఆధారాలు చూపించండి" అని పీవీఎన్ మాధవ్ సవాల్ చేశారు.రాహుల్ గాంధీ పారిపోవద్దని, చర్చకు భయపడవద్దని పీవీఎన్ మాధవ్ అన్నారు. కేంద్ర హోంమంత్రి పార్లమెంట్‌లో సమాధానం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌ను సజావుగా నడవనివ్వాలని కోరారు.చర్చ జరగాలని, వాస్తవాలు దేశ ప్రజల ముందుకు రావాలని అన్నారు. రాహుల్ గాంధీ వద్ద ఏవైనా ఆధారాలు ఉంటే వాటిని పార్లమెంట్‌లో పెట్టాలని, వాటిపై ప్రభుత్వం సమాధానం ఇస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై కాంగ్రెస్–జేఎంఎం ప్రభుత్వం వెంటనే చర్చించి పరిష్కారం చూపాలని కోరారు.విద్యార్థులపై అధిక బలప్రయోగానికి బాధ్యులైన అధికారులపై విచారణ జరిపి, తప్పు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా విద్యార్థులు చేసిన ఆరోపణలపై ప్రత్యేకంగా విచారణ జరిపి, వాస్తవాలను ప్రజల ముందుంచాలని అన్నారు.భారతీయ జనతా పార్టీ జార్ఖండ్ విద్యార్థులు, యువతకు అండగా నిలుస్తుందని పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తు రాజకీయాలకు బలికావడానికి వీల్లేదని అన్నారు. విద్యార్థుల హక్కులు, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాడే ప్రతి విద్యార్థికి బీజేపీ అండగా ఉంటుందని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ తన ద్వంద్వ వైఖరిని విడనాడి విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో చూడకుండా పరిష్కరించేందుకు ముందుకు రావాలని పీవీఎన్ మాధవ్ కోరారు

## బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు

# పోక్సో కేసు నమోదు

**నాగలాపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా నాగలాపురం మండలం కొట్టగాడు గ్రామంలో 14 ఏళ్ళ బాలికపై లైంగిక ఉద్దేశంతో అసభ్యకరంగా ప్రవర్తించి, దాడికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో నాగలాపురం పోలీసులు పీవోసీఎస్‌వో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 9వ తేదీ రాత్రి బాలికపుస్తకం తీసుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా, నాగరాజు అడ్డగించి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలిక అక్కడి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయగా బ్లేడ్‌తో దాడి చేయడంతో గాయమైనట్లు తెలిపారు. రక్షించేందుకు వచ్చిన ఆమె 16 ఏళ్ళ సోదరుడిపై కూడా నిందితుడు దాడి చేసి గాయపరచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానికులు జోక్యం చేసుకుని, ఆమె సోదరుడిని రక్షించినట్లు తెలిపారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగలాపురం పోలీస్‌స్టేషన్ క్రైమ్ నంబరు 78/2026 కింద బీఎన్ఎస్‌లోని సంబంధిత సెక్షన్లతో పాటు పీవోసీఎస్‌వో చట్టంలోని సెక్షన్ 7ఆర్/డబ్ల్యు 8, 11ఆర్/డబ్ల్యు 12 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## దగా డిఎస్సీపై సిబిఐ విచారణ జరపాలి

**పుత్తూరురూరల్, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువత, విద్యార్థుల భవిష్యత్‌లో చెలగాటమాడుతున్న కూటమి ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ డీఎస్సీ నియామకాల్లో పేపర్ లీక్, అక్రమాలు, అవకతవకలు, స్పోర్ట్స్ కోటా నియామకాలపై వచ్చిన ఆరోపణలపై తక్షణమే సీబీఐ విచారణ జరపాలని, నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసీపీ డిమాండ్ చేసింది. వైసీపీ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు మేరకు మాజీ మంత్రి రోజా ఆధ్వర్యంలో పుత్తూరులో కార్యక్రమం నిర్వహించారు. డీఎస్సీ పరీక్షకు లక్షలాది మంది అభ్యర్థులు హాజరైన నేపథ్యంలో పరీక్ష నిర్వహణపై వచ్చిన ఆరోపణలు, స్పోర్ట్స్ కోటాలో జరిగిన నియామకాలపై ఉన్న అనుమానాలను ప్రభుత్వం వెంటనే నివృత్తి చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని పేద విద్యార్థులకు సంబంధించిన రూ.7,200 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగయువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## ఎర్ర చందనం దుంగలు పట్టివేత



**కదిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** కడప జిల్లా నుంచి బెంగలూరుకు అక్రమంగా ఎర్ర చందనం దుంగలను తరలిస్తున్న ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని నింధితులను అరెస్టు చేసినట్లు కదిరి అటవీశాఖ అధికారి గుర్రప్ప తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కదిరి అటవీశాఖ అధికారి గుర్రప్ప మాట్లాడుతూ.. శ్రీ సత్యసాయి జిల్లా తలుపుల మండలం పెద్దన్నవారిపల్లి సమీపంలోని పోలేకనుమ ప్రాంతంలో అటవీశాఖ అధికారులు అనుమానా స్పదంగా వెళ్తున ్న ఇన్నోవా వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా కొంత దూరం వాహనాన్ని నిలిపి ముగ్గురు వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారన్నారు. అప్రమత్తమైన అటవీశాఖ సిబ్బంది వారిని వెంబడించి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి కడప జిల్లా బ్రహ్మం గారి మటం మండలం లింగాలదిన్నె గ్రామానికి చెందిన బంగారు రెడ్డిగా గుర్తించారన్నారు. పరారైన ఇద్దరు నింధితులు మైదుకూరుకు చెందిన కృష్ణయ్య, వెంకటేశ్వర్లుగా తెలిపారన్నారు. ఇన్నోవా వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అనంతరం తిరుపతి ఎర్ర చెందనం న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. ఈ సమావేశంలో ఫారెస్ట్ సెక్షన్ అధికారి బ్రహ్మయ్య, బీట్ ఆఫీసర్లు నరసింహామూర్తి, ఆర్.శ్రవంతిలు పాల్గొన్నారు.

## డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంపై

# సిట్ విచారణ ప్రారంభం

**విజయవాడ, ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంపై సిట్ విచారణ ప్రారంభించింది.ఈ వ్యవహారంలో తాజా సమాచారాన్ని అనుసరించి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 700 మంది బాధితులనుంచి మాషాఅల్లా ఎంటర్‌ప్రైజెస్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసారు. వీరంతా కంపెనీకి చెల్లించిన మొత్తం రూ.10 కోట్లుగా అంచనా వేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న బాధితుల నుంచి అధికారులు వివరాలు సేకరించి నమోదు చేస్తున్నారు. అతను ప్రతి డిపాజిటర్‌కు నాన్‌జ్యుడీషియల్ స్టాంప్ పేపర్‌పై తయారు చేసిన బాండ్లను జారీ చేశాడు. పోలీసులను ఆశ్రయిస్తున్న వారితో పాటు, వాస్తవంగా జారీ చేసిన బాండ్ల మొత్తం సంఖ్యను నిర్ధారించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ సమాచారం కోరుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగానికి ఒక లేఖ పంపించారు. అందిన వివరాల ఆధారంగా బాధితుల తుది సంఖ్యను నిర్ధారించే అవకాశం ఉంది. నిందితుల ఫోన్ నంబర్లకు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. సిట్ విచారణ ప్రాథమిక స్థాయిలో డిష్‌క్లీనింగ్ స్క్రబ్బర్ల కుంభకోణంలో భాగమైన మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ నిర్వాహకుడు పసుపులేటి అంకుశం పాల్పడిన మోసపూరిత కార్యకలాపాలకు సంబంధించిన పలుఅంశాలను గుర్తించింది.అతను డిపాజిట్లు సేకరించి, స్క్రబ్బర్లను ప్యాకేజింగ్ చేసే పనిని వ్యక్తులకు అప్పగించాడు. అయితే, ప్యాక్ చేసిన వస్తువులను అమ్మకుండా, వాటిని గిడ్డంగులలో నిల్వ చేశాడు. ఇదంతా ముందుగా ప్లాన్ చేసుకున్న పథకంలో భాగంగా జరిగిందంటున్నారు. ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముతున్నారని, దాని ద్వారా వచ్చే లాభాలను డిపాజిటర్లకు నెలవారీ "జీతాలు" చెల్లించడానికి ఉపయోగిస్తున్నారని ప్రజలను నమ్మించి అతను పెద్ద మొత్తంలో డబ్బును సేకరించాడు. వీలైనన్ని ఎక్కువ డిపాజిట్లు సేకరించి, ఆ తర్వాత కార్యకలాపాలను మూసివేయడమే అతని పథకం అని నిర్ధారించారు. అతను పశ్చిమ బెంగాల్ నుంచి ముడి పదార్థాలను సేకరించాడు, తన జీఎస్టీ ఫైలింగ్‌లలో నిర్దిష్ట పార్టీలకు చేసిన అమ్మకాలను ప్రకటించలేదు. కార్యాలయంలో పోలీసులు జరిపిన తనిఖీలలో ఎటువంటి ముఖ్యమైన ఆధారాలు లభించలేదు. కేవలం ఒక కంప్యూటర్ మాత్రమే దొరికింది. అధికారులు ప్రస్తుతం దానిలోని డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో ఈ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ ప్రారంభించింది.నిందితుడు అంకుశం కడప వాస్తవ్యుడని వెల్లడైంది. అతను కడపలో మహ్మద్‌అనే పేరుతో కంపెనీని రిజిస్టర్ చేశాడు. మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 45 చిన్న గిడ్డంగులను నిర్వహిస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ వ్యాపారంలోకి ప్రవేశించడానికి ముందు, నిందితుడు కోళ్ల పెంపకం, పశువుల దాణా వ్యాపారంలో ఉండేవాడు. అతను డిపాజిటర్లకు ఒక్కో స్క్రబ్బర్‌ప్యాకేజింగ్ యంత్రాన్ని రూ.30,000కు విక్రయించాడు. అయితే ఆ యంత్రం అసలు ఖరీదు రూ.7,000 నుంచి రూ.10,000 మధ్య ఉంటుందని అంచనా. ఈ విధంగా అతను పంపిణీదారులను, డిపాజిటర్లను అన్ని విధాలుగా మోసం చేశాడు. 10వ తేదీన బకాయి జీతాలు చెల్లిస్తానని వాట్సాప్ సందేశాలు పంపినప్పటికీ, అతను కార్యాలయానికి హాజరు కాలేదు.ఇక ఈ కేసులో పోలీసులను ఆశ్రయిస్తున్న వారితో పాటు, వాస్తవంగా జారీ చేసిన బాండ్ల మొత్తం సంఖ్యను నిర్ధారించడంపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. ఈ సమాచారం కోరుతూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగానికి ఒక లేఖ పంపించారు. అందిన వివరాల ఆధారంగా బాధితుల తుది సంఖ్యను నిర్ధారించే అవకాశం ఉంది. నిందితుల ఫోన్ నంబర్లకు అనుసంధానించిన బ్యాంక్ ఖాతా వివరాలను కూడా పోలీసులు సేకరిస్తున్నారు. అయితే, ఇప్పటివరకు నిందితుల ఆచూకీ లభించలేదు.

## మైనారిటీల సంక్షేమానికి మరింత బాధ్యతగా పనిచేస్తా : కూరపాటి జాన్ పాల్

**విజయవాడ,ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధానమంత్రి నూతన 15 పాయింట్ల కార్యక్రమం కింద మైనారిటీల సంక్షేమ పథకాల అమలు, పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కమిటీలో సభ్యునిగా కూరపాటి జాన్ పాల్ ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని కమిటీ సభ్యులు జాన్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన అన్నారు. ముఖ్య కార్యదర్శి అధ్యక్షతన పనిచేసే ఈ కమిటీ రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమ పథకాల అమలును కాలానుగుణంగా పర్యవేక్షిందన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి ఎండి ఫారూఖ్, మరియు తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సమర్థవంతంగా అందేలా తన వంతు బాధ్యతను నిజాయితీగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తానని, ప్రత్యేకంగా క్రిస్టియన్ మైనారిటీల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి లబ్ధి చేకూరేలా కృషి చేస్తానన్నారు.

## చిలకలూరిపేట మండలంలో అనారోగ్యంతో జింక మృతి

**చిలకలూరిపేట,ఆగస్టు11 ప్రభాతవార్త:** చిలకలూరిపేట రూరల్ పరిధిలోని కమ్మవారిపాలెం గ్రామ సమీపంలో పోలేరమ్మ గుడి ఎదురుగా ఉన్న పంట కాలువ పక్కన ఒక జింక మృతి చెందడం స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకున్నారు. కోటప్పకొండ బీట్ ఆఫీసర్ కిరణ్ ఆధ్వర్యంలో అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించగా, పశువైద్యులు జింక మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. కేవలం అనారోగ్యంతోనే ఇది మృతి చెందిందని స్పష్టమైంది. ఈ సందర్భంగా అటవీ ప్రాంతం చుట్టుపక్కల ఎక్కడైనా వన్యప్రాణులు మృతి చెందినా లేదా గాయపడినా ప్రజలు వెంటనే తమకు సమాచారం అందించి, వన్యప్రాణుల సంరక్షణకు సహకరించాలని అటవీశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

# ఎఐ ఆధారిత పన్నుల నిర్వహణలో ఎపి అగ్రగామి

### ●ప్రభుత్వ ప్రయత్నాన్ని అభినందించిన జిఎస్‌టి కౌన్సిల్ సభ్యులు

**విజయవాడ, ఆగస్టు 11,ప్రభాతవార్తప్రతినిధి:** పన్నుల నిర్వహణ విధానంలో కృత్రిమ మేథస్సు, డేటా ఆధారిత విశ్లేషణలను వినియోగించుకోవడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఎదుగుతూ మిగలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. పన్నుల నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సును ఉపయోగించుకుంటున్న తీరును అధ్యయనం చేయడానికి జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు ప్రత్యేకంగా రాష్ట్రానికి వచ్చారు. జీఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి. మిశ్రాలతో కూడిన బృందం సోమవారం రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ కార్యాలయాన్ని సందర్శించింది. పన్నుల నిర్వహణలో ఏఐ అమలు చేస్తున్న తీరును స్వయంగా పరిశీలించి అధ్యయనం చేసింది. ఈ బృందాన్ని రాష్ట్ర వాణిజ్యపన్నుల ప్రధాన కమిషనర్ బాబు ఏ, అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం పన్నుల నిర్వణలో ఏఐ వినియోగిస్తున్న తీరుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎస్టీ కౌన్సిల్ అధికారులకు వివరించారు. రిజిస్ట్రేషన్లు, రిటర్నులు, ఆదాయపన్ను, వృత్తిపన్ను, పన్నుల బకాయిలు, ఆడిట్లు, తనిఖీలు, పరిశీలన వంటి విభాగాల్లో ఐఏ ఆధారిత డ్యాష్ బోర్డులను వాణిజ్య



ఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అదనపు కార్యదర్శి పంకజ్ కుమార్సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి. మిశ్రాలతో ఏపీ వాణిజ్యపన్నుల ప్రధాన కమిషనర్ బాబు

పన్నుల శాఖ అధికారులు ఈ సందర్భంగా ప్రదర్శించారు. ప్రధానంగా రాబడికి సంబంధించి డ్యాష్ బోర్డు, ఈవే బిల్ డ్యాష్ బోర్డులు జీఎస్టీ కౌన్సిల్ అధికారులను ఆకట్టుకున్నాయి. ఈవే బిల్ డేటా ఆధారంగా ఎస్‌జీఎస్టీ నగదు చెల్లింపులు, ఐజీఎస్టీ సెటిల్మెంటును అంచనా వేసేందుకు ఈ వేబిల్ డ్యాష్ బోర్డు ఉపయోగపడుతుందని, తద్వారా ఆదాయ పర్యవేక్షణకు కీలక సమాచారం లభిస్తుందని అధికారులు వివరించారు. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తికి జీఎస్‌డీపీకి ప్రధాన సూచికగా జీఎస్టీ డేటాను వినియోగిస్తున్న విధానం, తక్షణ అంచనాల కోసం అనుసరిస్తున్న పద్ధతిని కూడా అధికారులు వివరించారు. రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ప్రత్యేకించి ఏఐ ఏజెంటు ద్వారా నివేదికలు, డ్యాష్ బోర్డులు రూపొందిస్తున్న తీరును జీఎస్టీ కౌన్సిల్ బృందానికి ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. ఏఐ వినియోగించి వివిధ రంగాలకు సంబంధించి అధ్యయనాలు, సమాచారంతో ఒక నాలెడ్జ్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నామని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమీషన్ బాబు ఏ వివరించారు. గతంలోలా కాకుండా పన్నులకు సంబంధించి ఆడిట్, కేసుల ఎంపిక, అవకతవకల గుర్తింపు ప్రక్రయ నుంచి నోటీసుల జారీ, పన్ను చెల్లింపుదారుల స్పందనల పరిశీలన, వాటిపై తుదినిర్ణయం వరకు మొత్తం ప్రక్రియను ఏఐ నిర్వహించేలా చేస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి రిటర్న్లు పరిశీలన, ఆడిట్, తనిఖీ ప్రక్రియలను ప్రతినిధి బృందం ప్రత్యక్షంగా తిలకించింది. పన్నుల నిర్వహణ విధానాన్ని మరింత బలోపేతం చేయడానికి మైక్రోసాఫ్ట్, గూగుల్ సంస్థల ఏఐ ఇంజిన్లను వాణిజ్య పన్నుల శాఖ వినియోగించుకుంటోందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆన్‌లైన్ లీగల్ కేస్ మేనేజ్మెంట్ సిస్టమ్‌తో అనుసంధానమై పనిచేసే లీగల్ ఏఐ మాడ్యూల్ ను కూడా జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు తిలకించారు. దీనిద్వారా వాణిజ్య పన్నుల శాఖకు సంబంధించిన కేసులను గుర్తించడం, ప్రభుత్వ న్యాయవాదులకు అవసరమైన సూచనల తయారీలో సహకరించడం, అప్పీళ్ల అధికారులు, జీఎస్టీఏటీ, హైకోర్టు, సుప్రీం కోర్టు ముందున్న కేసులను పర్యవేక్షించడం వంటి పనుల నిర్వహణకు ఈ మాడ్యూల్ ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు.

**ఆదర్శప్రాయంగా ఉన్నాయి**

జీఎస్టీ కౌన్సిల్ సభ్యులు ప్రభుత్వ పన్నుల నిర్వహణ విధానంలో ఏఐ, డేటా విశ్లేషణ లాంటి సాంకేతికతను అందిపుచ్చుకుని రాష్ట్ర రాబడి పెంచుకునే దిశగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, కృషి మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా ఉందని జీఎస్టీ కౌన్సిల్ సెక్రటరియేట్ అధనపు కార్యదర్శి పంకజ్ కుమార్ సింగ్ అన్నారు. దీనిద్వారా పన్నుల రాబడి, పన్నుల నిర్వహణ విధానాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి దోహదపడుతుందన్నారు. ఏపీ రాష్ట్ర వాణిజ్యపన్నుల శాఖ ఇతర రాష్ట్రాలకు ఆదర్శప్రాయంగా నిలుస్తోందని కొనియాడారు.

## భాకరాపేట ఘాట్‌లో కోళ్ల వ్యాన్ బోల్తా

### మానవ దౌర్భల్యం .. కోళ్లను దోచుకున్న వైనం

**చంద్రగిరి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** భాకరాపేట ఘాట్ రోడ్డుపై మంగళవారం అదుపుతప్పిన కోళ్ళ వ్యాన్ బోల్తాపడింది. ప్రమాదం తీవ్రతకు వ్యాన్‌లోని కోళ్ళు రోడ్డుపై, ప్రక్కన చెల్లాచెదురుగా పడిపోయాయి. అయితే మాన ధౌర్భల్యం ప్రమాదానికి గురైన వారి కష్టాన్ని, నష్టాన్ని పట్టించుకోకుండా అందినకాడికి కోళ్ళను దోచుకుపోవడం జుగుప్స కలిగించింది. పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని బోల్తాపడిన వ్యాన్‌ను ఈ ప్రాంతం ప్రజల సహాయంతో తొలగించారు. అయితే పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు రాకపోవడంతో బాధితులు వ్యాన్‌తో అక్కడి నుండి వెళ్ళిపోగా ప్రయాణికులు, స్థానికులు కోళ్ళను తీసుకుని వెళ్ళిపోయారు.

## నేడు వైసిపి శాసనసభా పక్ష సమావేశం

**విజయవాడ.ఆగస్టు11,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ అధ్యక్షతన ఈ నెల12న తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో సమావేశం జరగనుంది.ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, పార్టీ చేపట్టాల్సి న తదుపరి కార్యక్రమాలు తదితర కీలక అంశాలపై చర్చించి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వైయస్ జగన్ దిశానిర్దేశం చేయనున్నారు. ఈ నెల 17 నుంచి అసెంబ్లీ సమావేశాలు నాలుగు రోజులపాటు జరుగనున్న నేపథ్యంలో జగన్ శాసన సభా పక్ష సభ్యుల సమావేశం నిర్వహించడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం కానున్నది, ఈ పర్యాయం అసెంబ్లీ సమావేశాలకు జగన్ హాజరయ్యే అవకాశాలు ఉన్నాయంటున్నారు

12-8Pg8exHMNWJQEBPGOL.qxd:12-8Pg8exHMNWJQEBPGOL.qxd 1/1/02 6:56 AM Page 1



# కూటమి అక్రమాలు బయటపెట్టినందుకే అక్రమ కేసులు

- పంటకాలువ భూమిని దోపిడీ చేసేందకు మంత్రి కుట్ర
- కూటమి హాయాంలో నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ పాఠశాలలు
- నిజంగా తప్పుజరిగి ఉంటే క్షమాపణ చెప్పేందుకైనా సిద్ధం
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి వెల్లడి

**నెల్లూరు,ఆగస్టు11 ప్రభాతవార్త-విద్య:** గత రెండేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం హాయాంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను సాక్ష్యాదారాలతో సహా బయటపెడుతూ, నిత్యం ప్రజల పక్షాన ఉంటూ పోరాటాలు చేస్తున్నాననే భయంతోనే ప్రభుత్వం తనపై అక్రమంగా కేసులు బనాయిస్తుందని వైకాపా నెల్లూరు నగర ఇన్‌చార్జ్, తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని స్థానిక పొదలకూరురోడ్డులోని వైకాపా జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నెల్లూరు కార్పోరేషన్‌లో అవినీతి పూర్తిగా పెచ్చుమీరిపోయిందని ఆరోపించారు. చెత్తసేకరణ ట్రాక్టర్ల పేరుతో ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు ముట్టజెపుతున్నారని, స్వీపింగ్ మెషన్ల పేరుతో కోట్లరూపాయల నగదును కాంట్రాక్టర్లకు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. పేదలు ఇంటి పన్ను కట్టకపోతే ముక్కు పిండి వసూల్లుచేసే నగర పాలక సంస్థ ఇలా ప్రజా దనాన్ని దుర్వినియోగం చేయటం దారుణమన్నారు. నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాల సమీపంలోని సుమారు ఎకరా 40సెంట్ల పంటకాలువ భూమిని దోపిడీ చేసేందుకు మంత్రి నారాయణ కుట్ర పన్నుతున్నారని, ఇందులో భాగంగా ఇప్పటికే ఆ కాలువ కింద పంట సాగుబడి లేదని,నిరుపయోగంగా ఉందని తశీల్దార్ సర్టిఫికేట్ తెప్పంచటం జరిగిందన్నారు. అలాగే ఇప్పటికే కార్పోరేషన్ మేయర్ కూడా ఇందుకు అనుమతులు ఇచ్చారని, ఈనెల 13న జరిగే సర్వసభ్య సమావేశంలో అంశాన్ని పెట్టి మమ అనిపించి ఆభూమిని కాజేసేందుకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నగరంలోని వెంకటేశ్వరపురం గాంధీగిరిజన కాలనీలో ఎనోఏళ్లుగా నివాసం ఉంటుందన్న పేదల ఇండ్లను కూల్చివేస్తామని ప్రకటించటం అత్యంత దారుణమన్నారు. ఏకంగా పంట కాలువను ఆక్రమించాలన్న మంత్రి నారాయన దీనికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్నీ ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారని, నేడు కనీసం దానిని నిర్వహించలేక కూటమి ప్రభుత్వం పాఠశాలలను నానా ఇబ్బందులు పడుతుందన్నారు. రాష్ట్రంలో అనేక పాఠశాలలు, సంక్షమ హాస్టల్లు దయనీయ స్థితిలో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. సిఎస్ఆర్ కింద నాలుగు స్కూళ్లను ఆధునీకరిస్తే విద్యార్థుల సమస్యలు తీరవని హితవు పలికారు. నిత్యం భగవంతునిపై నమ్మకంతో, భక్తి శ్రద్ధలతో ఉండే తనపై కూటమి నాయకులు అక్రమంగా ఆరోపణలు చేస్తున్నారని, గోవింద నామాల పాట విషయంలో నిజంగా హిందువుల మనోభావాలు తనవల్ల దెబ్బదిని ఉంటే క్షమాపణ చెప్పేందుకుసైతం తాను సిద్దమని, కానీ అక్కడ తన పాత్ర పూర్తిగి శూన్యమన్నారు.గతంలో అనేకమార్లు లోకేష్, ఇతర నాయకులు గోవిందనామాలతో అనేక కార్యక్రమాలు చేశారని, అప్పుడు తాము ఎన్నడూ రాజకీయాలు చేయలేదని గుర్తుచేశారు. ఇటువంటి అక్రమ కేసులకు, అనవసర గోడవలకు తాను భయపడేది లేదని స్పష్టంచేశారు. నిత్యం ప్రజల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కులాల మధ్య గొడవతో వైసిపి ఆనందం

### జెబి అంటే భూమనకు భయం: టిడిపి మహేశ్‌యాదవ్

**తిరుపతి,ఆగస్టు 11ప్రభాతవార్తప్రతినిధి:** ప్రశాంతమైన తిరుపతి నగరంలో కులాల మధ్య గొడవపెట్టి ఆనందపడాలని వైసిపి నేతలు,భూమన కుటుంబం పథకం పన్నారని టిడిపి నేత, తాతయ్యగుంటగంగమ్మ ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్ విరుచుకుపడ్డారు. టిడిపి తిరుపతి ఇన్చార్జి గా జెబి శ్రీనివాస్ వచ్చినప్పటి నుండి వైసిపి నేతలకు భయం పట్టుకుందని, ఆయనఇంటి పై దాడికి పాల్పడుతున్నారని అన్నారు. అతనంటే ఎందుకు అంత భయం అని ప్రశ్నించారు. సోమవారం తిరుపతిలో చేపట్టిన డిఎస్పీ ర్యాలీ కి 500 రూపాయలు ఇచ్చి జనాలను తరలించిన పరిస్థితి మీ పార్టీది అని తీవ్రంగాఆరోపించారు.ర్యాలీలో నిరుద్యోగులు లేరని, అంతా అవ్వతాతలేనని అన్నారు. మంగళవారం తిరుపతిలో మీడియాతో నైనార్ మహేశ్‌యాదవ్, భరణీయాదవ్, ఈతమాకుల హేమంత్‌కుమార్ తదితరులతో కలసి మాట్లాడారు.హత్యాయత్నం కేసులో ఉన్న వాసు యాదవ్ ఓ వీడియో విడుదల చేసి నేను దాడికి పాల్పడలేదని చెబుతున్నావని,అయితే జెబి ఇంటి వద్ద ఏమి పని అని ప్రశ్నించారు. 30 మందిని తీసుకెళ్లి ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందని మండిపడ్డారు. ఆ తరువాత అక్కడి నుంచి ఎందుకు పారిపోయావని అన్నారు. కరుణాకర్ రెడ్డి కి దేవుడంటే భయం, భక్తి , విశ్వాసం లేదని, అతనొక్క నాస్తికుడని నువ్వు అతనిలా తయారైనావని వాసుయాదవ్‌పై విరుచుకుపడ్డాడు. యాదవులు అంటే తిరుపతిలో చాల గౌరవం ఉందని, నువ్వు యాదవుల పరువు తీసే కార్యక్రమాలకు పాల్పడుతున్నావని అన్నారు.

## షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ప్రతి గ్రామసభ పరిధిలో 4 ప్రత్యేక కమిటీలు ఏర్పాటు

**విజయవాడ, ఆగస్టు 11 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల బలోపేతానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏజెన్సీలో గిరిజన హక్కుల పరిరక్షణే ధ్యేయంగా శక్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ప్రతి గ్రామసభ పరిధిలో 4 ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేశారు. హక్కుల అవగాహన, వనరుల ప్రణాళిక, సంస్కృతిక్రీడలు, విద్యాసంక్షేమ కమిటీలను ఏర్పాటు చేశారు. కమిటీల్లో మహిళలకు 50శాతం స్థానాలు కల్పించాలని ప్రభుత్వం తెలిపింది. ప్రతి కమిటీకి ఛైర్‌పర్సన్, సెక్రటరీగా గిరిజనులకే పూర్తి అవకాశం కల్పించనున్నారు. అటవీ వనరులు, గిరిజన సంస్కృతి పరిరక్షణే లక్ష్యంగా కమిటీల పనితీరు ఉండనుంది. పెసా చట్టం అమలు, సంక్షేమ పథకాలపై పల్లెల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. లక్ష్యాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలుచేయాలని ఆదేశించింది.

# ఆనం అంటే అభివృద్ధి కాదు : అవినీతి

- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగష్టు 11, ప్రభాతవార్త :** మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అంటే అభివృద్ధికాదని అవినీతి అని ఇది నేనంటున్న మాట కాదు ఆయన ఏ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించినా అక్కడి ప్రజలే ఈమాట చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నెల్లూరులోని మేకపాటి నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదిరోజుల క్రితం మర్రిపాడులో పర్యటించిన మంత్రి ఆనం తన సభలో టిడిపి కార్యకర్త హైలెవల్ కెనఆల్ పనులకు సంబంధించి ప్రశ్నిస్తే మర్రిపాడు వాసులకు సిగ్గులేదంటూ మాట్లాడడం జరిగిందని, అడిగిన దానికి సమాధానం చెప్పకుండా ఇలా మా కుటుంబంమీద మాట్లాడి ఏం ఒరగబెట్టినట్లు అవుతుందన్నారు. మేకపాటి కుటుంబం అంటే మర్రిపాడు ప్రాంతావాసులకు భయం కాదు అభిమానం. దాదాపు నాలుగుదశాబ్దాలుగా మా కుటుంబం మర్రిపాడు వాసులను ఎంతో అభివృద్ధి చేశామన్నారు. నవోదయ పాఠశాల , డిగ్రీ కళాశాల , ఇంజనీరింగ్ కళాశాలతో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన కుటుంబమని 200కోట్ల విలువైన ఇంజనీరింగ్ కళాశాలను దానం చేసిన చరిత్ర తమదన్నారు. తమ కుటుంబంలో జరిగిన విషాదం అనంతరమే తాను రాజకీయాల్లోకి వచ్చానని నాన్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి స్ఫూర్తితోనే ఆత్మకూరు నియోజకవర్గంలో ఎడిఎఫ్‌ద్వారా సొంత నిధులు, సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేస్తూ ప్రజల్లో తాము మంచి పేరు తెచ్చుకున్నామన్నారు. మర్రిపాడు వాసులకు సిగ్గులేదా అని ప్రశ్నిసునతన్న మంత్రి ఆనం తాను గెలిచిన సాయంత్రమే మర్రిపాడులో ఇసుక కొండను మాయం చేశారని రెండురోజుల అనంతరం ఆయన ఇంటిముందు రెండు కొత్తవాహనాలు కనిపించాయని నియోజకవర్గంలో ఇసుక మాఫియాను ఏరత్పాటు చేశారని ఏటికి ఒకవైపు ఒకరిని అవతలివైపు మరొకరిని పెట్టి దాందా కొనసాగిస్తున్నారన్నారు. అప్పట్లో దివంగత మహానేత డాక్టర్‌వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయాంలో జలయజ్ఞంలో భాగంగా హైలెవల్ నెనాల్ ప్రాజెక్ట్ ప్రతిపాదించడం జరిగిందని అనంతరం మానిఫెస్టోలో కూడా దీన్ని పొందుపరిచారని ఈసమయంలో మంత్రిగా ఉన్నందుకు మీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారే తప్ప హైలెవల్ కెనాల్ సాధనపలో ఏమీ పాత్ర ఏమాత్రం లేదన్న విషయం అందరికి తెలుసన్నారు. ఈ ప్రాంతానికి నీళ్ళు తెచ్చేది నేనే ఇచ్చేది నేనే అంటున్నారు అంటున్న ఆనం ఒక్కసారి చరిత్ర చూడాలని, వెంకటగిరిలో రిజర్వాయర్ నిర్మాణానికి మీకు కమీషన్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి.

సెట్‌కాలేదని ఆ పనులు నిలిపివేశారని , పోలీసులు వద్ద కూడా కమీషన్ తీసుకున్న చరిత్ర మీదని ప్రజలు అంటున్నారని, సోమశిల స్పిల్‌వే నిర్మాణానికి ఇప్పటికే కాంట్రాక్టర్లు మారారే కానీ అతి ముఖ్యమైన ఆ పనిమాత్రం చేయలేదన్నారు. అభివృద్ధి చేయమని గెలిపిస్తే అవినీతి చేసుకుంటూ పోతున్న మీరు మాకుటుంబం గురించి మాట్లాడుతున్నారా అని , రెండేళ్ళలో మీరు ఏం చేశారని, ఇప్పటికీ ఏ ఒక్క అభివృద్ధి పనులు అడుగు ముందుకు సాగలేదన్నారు. తమ తండ్రి రాజమోహన్‌రెడ్డిఎంపిగా రెండుసార్లు రాజీనామా చేశారని, వైఎస్ఆర్ కుటుంబం వెనుక మేకపాటి కుటుంబం ఉంటుందన్న విషయం రెండు తెలుగు రాష్ట్రాల్లో అందరికీ తెలుసన్నారు.మేము సంపాదించిన ప్రతి రూపాయిలో 15పైసలు ఈప్రాంత అభివృద్ధికి ఖర్చు చేస్తున్నా మన్నారు. మీమీద కేసులు లేవంటే మీ గొప్పతనం కాదు రెండేళ్ళకోసారి పార్టీమారే మీమీద ఎందుకంఉటాయని ఒకే పార్టీలోకొనసాగే మామీద ఉంటాయన్నారు. మేము ధైర్యంగా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పుడు రాజీనామా చేసి మళ్ళీ ఎన్నికలకు వచ్చే దమ్ముందా అని సవాల్ చేశారు. నామీద కేసు ఉందని మీరు చెప్పారు అయితే ధైర్యంగా నిలబడ్డానన్నారు. ఆనం అంటే దోపిడి, ఆనం అంటే అవినీతి అనేస్థాయిలో మీ పాలన సాగిస్తున్నారని, రెండేళ్ళ పాలన సమయం ఉంది ప్రజా క్షేత్రంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలే కానీ మామీద బురద చల్లితే అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పినట్లు కాదని ఆ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వైసిపి నాయకులు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జిల్లా వైసిపి ఆర్గనైజింగ్ కార్యదర్శి పులిమి రమేష్‌రెడ్డి, ఆత్మకూరు జడ్పీటిసి సభ్యులు పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, అనంతసాగరం ఎంపిపి పి.జయమ్మ, మండల కన్వీనర్ పి.పిచ్చిరెడ్డి, ఆత్మకూరు పట్టణ వైసిపి కన్వీనర్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## గ్యాస్ పేలి ఇద్దరు మహిళలకు తీవ్ర గాయాలు

**ఆత్మకూరు (నెల్లూరు), ఆగష్టు 11, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండలం మహిమలూరులో మంగళవారం చింతలపల్లి కవిత ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇరువురు తీవ్రంగా గాయపడి వారి పరిఇస్థతి విషమంగా ఉండగా ఇంటి స్లాబ్, గోడలు పూర్తిగా కూలిపోయాయి. సమాచారం అందిన వెంటనే ఆత్మకూరు సిఐ జి.గంగాధర్, స్థానిక ఎస్ఐ జంపానికుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గాయపడిన ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్సకోసం నెల్లూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి. కవిత ఇంట్లో నిజమాల లక్ష్మమ్మ పనిచేస్తుండేదని, మంగళవారం కవిత ఇంట్లో లేకపోగా గ్యాస్ పొయ్యి వెలిగించేందుకు గ్యాస్ ఆన్‌చేసింది. వెలగకపోవడంతో పక్క ఇంటిలోని జమీల అనే ఆమెను పిలుచుకురాగా వచ్చిన వెంటనే బార్ లైట్ స్విచ్ ఆన్‌చేశారు. అప్పటికే ఇల్లంతా గ్యాస్ ఆవరించి ఉన్నందున సిలిండర్ పేలి స్లాబ్ గోడలు కూలిపోయాయి. లక్ష్మమ్మ మంటల్లో తీవ్రంగా గాయపడగా జమీల స్లాబ్ కిందపడి తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్ళింది. ఆత్మకూరులోని ప్రవేటు హాస్పిటల్‌కు తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వారు ఇచ్చిన సలహా మేరకు నెల్లూరులోని ఓ ప్రవేటు హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని సిఐ గంగాధర్ పేర్కొన్నారు. ఈసంఘటనతో మహిమలూరు గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఆ ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

## సస్పెండ్ అయినా మోసాలు వదలలేదు

- మాజీ టిటిడి ఉద్యోగి అరెస్ట్



**తిరుమల,ఆగస్టు 11ప్రభాతవార్తప్రతినిధి:** దర్శనాలు, గదులు పేరుతో భక్తులను మోసం చేస్తున్న టిటిడిలో సస్పెండ్‌అయిన మాజీ ఉద్యోగిని తిరుమల పోలీసులు మోసం కేసులో అరెస్ట్ చేశారు. శ్రీవారి సేవా టికెట్లు, టిటిడిలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి భక్తులను 10 లక్షలరూపాయలు మేర మోసం చేసినట్లు దర్యాప్తులో తేలింది. టిటిడిలో పేష్కార్‌గా పనిచేస్తున్నానని చెప్పి భక్తులను నమ్మించి మోసాలకు పాల్పడిన తిరుపతి కోలావీధికి చెందిన జలకర గిరిధర్ (34 ను తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి ఫోన్‌పేకు పలు విడతల్లో 1,56 లక్షలు రూపాయలు నగదు బదిలీ చేయించుకున్నాడు. తిరుపతికి చెందిన మరో వ్యక్తికి టిటిడిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి 3,60 లక్షలు రూపాయలు తీసుకుని మోసం చేసినట్లు కూడా నిందితుడు వెల్లడించాడు.మొత్తం సుమారు 10 లక్షలు రూపాయలు మేర మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

## ప్రేమ వివాహానికి పెద్దల నిరాకరణ

### యువతి హత్య.. ప్రేమికుడు ఆత్మహత్యాయత్నం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** ప్రేమ వివాహానికి కుటుంబ సభ్యులు అంగీకరించక పోవడంతో ఓ ప్రేమజంట తీసుకున్న నిర్ణయం విషాదాంతమైంది. ప్రేమికురాలు హత్యకు గురికాగా, ప్రేమికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కాతేరు సమీపంలోని గామన్ బ్రిడ్జి వద్ద యువతిపై దాడి చేసి హత్య చేసిన యువకుడు అనంతరం ఆత్మహత్యకు యత్నించిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో యువతి అక్కడికక్కడే మృతి చెందగా, యువకుడు తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. రాజమహేంద్రవరంలోని శాంతినగర్‌కు చెందిన వరదా ప్రసన్న అలియాస్ మధు (21), కోటిలింగాలపేటకు చెందిన కుసుమ అభిలాష్ (21) కొంతకాలంగా ప్రేమించుకున్నట్లు తెలుస్తోంది. అయితే తమ వివాహానికి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆగస్టు 10వ తేదీ రాత్రి 8.30 గంటల తర్వాత ఇద్దరూ కాతేరు నుంచి ఫోర్ట్ బ్రిడ్జి వైపు వెళ్లే సర్వీస్ రహదారి వద్దకు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడ అభిలాష్ యువతి మెడపై పదునైన ఆయుధంతో తీవ్రంగా దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం అభిలాష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు.రాత్రి ఎన్‌హెచ్‌ఏఐ హైవే పెట్రోల్ సిబ్బంది జగదీష్ డయల్112 ద్వారా పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. ఘటనా స్థలంలో మహిళ మృతదేహంతో పాటు తీవ్ర గాయాలతో ఉన్న యువకుడు, ఏపీ 40 సీవై 0662 నంబరు గల ద్విచక్ర వాహనం ఉన్నట్లు సమాచారం అందడంతో డీఎస్పీ సౌత్ జోన్, త్రీటౌన్ ఎస్‌హెచ్‌ఓ, రోడ్ సేఫ్టీ మొబైల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు.అభిలాష్‌ను తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం మెట్‌సేఫ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు దారితీసిన పూర్తి కారణాలు, ఇతర అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# రైతులకు బాసటగా నిలుస్తాం!

- ఎల్‌నినో పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందగానే యుద్ధ ప్రాతిపదికన చర్యలు

మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, ఆగస్టు 11 ప్రభాతవార్త:** రైతాంగానికి బాసటగా నిలవడానికి చేయాల్సి న ప్రతి ప్రయత్నాన్ని కూడా ప్రభుత్వం నుంచి చేస్తామని రాష్ట్ర ఆర్థిక ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందగానే యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. మంగళవారం అనంతపురం జిల్లాలో సూపర్ ఎల్‌నినో పరిస్థితులపై క్షేత్రస్థాయిలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ పాలడుగు సత్యనారాయణ, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించగా, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో పరిస్థితులను ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రతి జిల్లాను కూడా తిరగడానికి అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వచ్చారన్నారు. జిల్లాల్లో ప్రతి ఆర్ఎస్‌కే పరిధిలోను, క్షేత్రస్థాయిలో ఉన్నటువంటి ప్రతి పల్లెలోనూ కూడా ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ పాలడుగు సత్యనారాయణ, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం వారం రోజులుగా పర్యటనలు చేయడం జరిగిందన్నారు. ఇవాళ ఫైనల్‌గా వైస్ ఛాన్సలర్ వచ్చారని, సూపర్ ఎల్‌నినో పరిస్థితులను వివరించారన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన చేయిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా సూపర్ ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉందన్నారు. రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో ఏ మేరకు ఇబ్బందులు కలిగిస్తుందో పరిశీలనకు వ్యవసాయ శాస్త్రవేత్తలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. అనేక జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని మంత్రి తెలిపారు. జిల్లా మీద ఒక సమగ్రమైనటువంటి నివేదికను రూపొందించుకుని ప్రత్యామ్నాయ పంటలు వేయాలా? ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఏం చేయాలి? అనేటటువంటి ఆలోచనలు చేసుకునేటటువంటి ప్రయత్నం చేయడం జరుగుతోందన్నారు. రైతాంగానికి బాసటగా నిలవడానికి ఈ ప్రభుత్వం చేయాల్సినటువంటి ప్రతి ప్రయత్నాన్ని కూడా చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఈసారి సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, తీవ్ర వర్షాభావ జిల్లాల్లో ప్రత్యామ్నాయ



ఎల్‌నినో ప్రభావం గురించి మంత్రికి వివరిస్తున్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ వీసీ పాలడుగు సత్యనారాయణ, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం

పంటలకు ప్రణాళిక చేయాలని ఆదేశించామన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీని సమగ్ర నివేదిక కోరామన్నారు. ఎల్‌నినో పరిస్థితులపై ప్రభుత్వానికి నివేదిక అందగానే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఎల్‌నినో పరిస్థితి దృష్ట్యా రైతు సేవ కేంద్రాల పరిధిలో రైతన్న మీకోసం యాక్షన్ కమిటీ ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పాల్గొన్నారు.

## వాగులో కొట్టుకుపోయి.. చెట్టు కొమ్మ పట్టుకొని ప్రాణాలు దక్కించుకున్న టీచర్

**ముంచంగిపుట్టు, ఆగస్టు 11 ప్రభాతవార్త:** అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల మారుమూల లక్ష్మీ మ్మపురం పంచాయతీ కర్ల పొదుర్ గ్రామానికి అనుకొని ఉన్న వాగులో సోమవారం ఎం. మనీ అనే ఉపాధ్యాయురాలు ప్రమాదవశాత్తు కొట్టుకుపోతూ వాగులో చిన్నపాటి చెట్టు కొమ్మను పట్టుకొని ప్రాణాలు దక్కించుకొని రక్షి ంచే వారి కోసం ఎదురుచూస్తున్న క్రమంలో స్థానికుల సహాయంతో ప్రాణాలతో బయటపడిన సంఘటన ముంచంగి పుట్టు మండలంలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కర్లపొదోర్ గ్రామంలో ప్రభుత్వ గిరిజన ప్రాథమిక పాఠశాలలో సుమారు 37 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ లో మహిళ ఉపాధ్యాయురాలిని నియమించింది. ఈ పాఠశాలకు మైదాన ప్రాంతమైన గాజువాక కు చెందిన ఎం. మణి అనే ఉపాధ్యాయురాలు విధులు నిర్వర్తిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం ఆమె కర్లపోదర్ గ్రామానికి వెళ్లేందుకు కర్ల పొదోర్ వాగు దాటుతున్న క్రమంలో ఇటీవల గడిచిన నెల రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో లక్ష్మీపురం పంచాయతీ పరిసర ప్రాంతాల్లో వానలు గట్టిగా కురవడంతో కర్ల పొదోర్ వాగు ఉధృతంగా ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది వరద ఉధృతిని గమనించని ఉపాధ్యాయురాలు మణి వాగులోకి దిగడంతో వరద ఉధృతికి సుమారు 100 మీటర్ల వరకు వాగులో ఆమె కొట్టుకుపోయింది. వాగులో కొట్టుకుపోతున్న క్రమంలో చిన్నపాటి చెట్టు కొమ్మను ఆమె పట్టుకొని వాగు ఉధృతిని తట్టుకుంటూ రక్షించే వారి కోసం ఎదురుచూస్తూ ప్రాణ భయంతో నిస్సహాయ స్థితిలో చెట్టుకొమ్మను పట్టుకుని అలానే ఉండిపోయింది. అయితే అటుగా వెళుతున్న గ్రామస్తులు కొంతమంది ఆమెను చూసి వెంటనే వాగులోకి దిగి ఆమెను సురక్షితంగా ప్రాణాలతో బయటకు తీసుకువచ్చారు. గ్రామస్తుల లేకుంటే తాను వాగులోకి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయేదానినని విలపిస్తూ గ్రామస్తులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి 2 త్రినాథ రావు, సి ఆర్ పి జి. ఈశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన స్థలంలో ఉన్న ఉపాధ్యాయురాలు మణి ని పరామర్శించి సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని ఆమెకు ధైర్యం చెప్పి గ్రామస్తుల సహాయంతో హుటా హుటిన ద్విచక్ర వాహనంలో వైద్య సేవల నిమిత్తం ముంచంగి పుట్టు సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉందని ఎటువంటి భయంతో అవసరం లేదని మండల పరిధిలోగల విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు వాగులు గడ్డలు వంకలు దాటే సమయంలో సంయమనం పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఈఓ సూచించారు.

## ప్రియురాలు దక్కలేదని ప్రియుడు ఆత్మహత్య

- వినూత్నరీతిలో సెల్‌ఫోన్‌లో లైవ్‌లో చూపించి విగతజీవి

**గంగవరం(చిత్తూరుజిల్లా), ఆగస్టు 11 ప్రభాతవార్త:** ఇద్దరి మనసులు ఒక్కటై.. ఒకరంటే మరోకరికి ప్రాణంగా మూడేళ్ళు కలసి జీవితం పంచుకుని సంతోషంగా చూసుకున్నా చివరకు ప్రియురాలు తనకు దక్కదని తెలుసుకుని ప్రియుడు బలవన్మరణం పొందాడు. ఆపై ఆత్మహత్య చేసుకుంటూ ప్రియురాలికి సెల్‌ఫోన్‌లో లైవ్‌లో చూపించి ప్రాణాలు తీసుకోవడంతో మరింత విషాదంగా మారింది. చిత్తూరుజిల్లా పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలంలోని కల్లుపల్లె గ్రామంలో సంఘటన అందరినీ కలచివేసింది. కన్నీటిపర్యంతం చేసింది. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు...మండలంలోని కల్లుపల్లె గ్రామానికి చెందిన భూదేవి శివశంకర్ దంపతు కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. వీరికి ఇద్దరు కుమారులు, చిన్న కుమారుడు యుగంధర్(22) తన అన్న హారీష్‌తో బెంగళూరులో కూరగాయల వ్యాపారం చేసుకునేవారు. అదే సమయంలో యుగంధర్ అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం,కొండమీదపల్లె గ్రామానికి చెందిన ఓ యువతి(20)తో పరిచయం ఏర్పడింది.కాస్త ప్రేమగా మారింది. గత మూడేళ్ళుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమ వ్యవహారం తెలుసుకున్న యువతి తల్లి కూడా అందుకు సమ్మతించిందని సమాచారం. ఆపై అతని వద్ద నుండి ఆర్థికంగా లబ్ధిపొందారు. అయితే ఏమైందో ఏమో కొద్దిరోజులుగా యువతి కూడా యుగంధర్‌కు దూరంగా ఉంటుంది.

సోమవారం అర్ధరాత్రి యుగంధర్ ప్రియురాలిపై బెంగతో బెంగళూరు నుండి బయలుదేరి ఆమె స్వగ్రామానికి చేరుకున్నాడు. ఇంట్లో ఆమె లేకపోవడంతో బంధువుల ఇంట్లో యువతిని నిలదీశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి నీ అంతు చూస్తానంటూ యువతి బెదిరించడంతో మనోవేదనకు గురైన యుగందర్ మనస్థాపంతో ప్రియురాలు తనకు దక్కదన్న ఆవేదనతో మంగళవారం తన ఇంట్లోనే చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడుతున్న దృశ్యాన్ని ఫోన్‌లోలైవ్‌లో చిత్రీకరించి ప్రియురాలికి పంపి విగతజీవుడయ్యాడు.

యువకుడు ఉరివేసుకుని మృతి చెందడాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# తుంగభద్ర హెచ్‌ఎల్‌సికి నవంబర్ 10వరకు నీటి సరఫరా

### 90 రోజుల పాటు 1200 క్యూసెక్కుల ప్రకారం నీటి విడుదలకు ఐసీసీ సభలో తీర్మానం

### టీబీ డ్యాం మునిరాబాద్‌లో శివరాజ్ తంగడగి అధ్యక్షతన జరిగిన 126వ ఐసీసీ సభ

**బళ్లారి, ఆగస్టు 11 ప్రభాతవార్త:** మునిరాబాద్‌లోని కాడా హాల్‌లో మంగళవారం నాడు జరిగిన తుంగభద్ర ప్రాజెక్ట్ ,విజయనగర కాలువల 126వ సాగునీటి సలహా సంఘం సమావేశం(ఐసీసీ సభ)లో, ప్రస్తుతం తుంగభద్ర జలాశయంలో ఉన్న 82 టీఎంసీల నీటి లభ్యతను పరిగణనలోకి తీసుకుని, కాలువలకు 90 రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. హెచ్ ఎల్ సి కాలువకు నవంబర్ 10 వరకు 1200 క్యూసెక్కుల ప్రకారం 90 రోజులపాటు నీరు వదిలేందుకు సభలో తీర్మానించారు. ప్రస్తుతం జలాశయంలో 82 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

120 రోజుల పాటు నీటిని విడుదల చేయడానికి జలాశయంలో 16 టిఎంసిల నీటి కొరత ఉంది. రాబోయే రోజుల్లో మరో 16 టిఎంసిల నీరు వస్తుందని అంచనా. అయితే, తాగునీటి అవసరాల కోసం 10 టిఎంసిల నీటిని జలాశయంలో నిల్వ ఉంచాల్సి ఉంటుందని అధికారులు సమావేశంలో తెలిపారు. రైతుల డిమాండ్ మేరకు కాలువలకు నీటిని విడుదల చేయడం అత్యవసరమని మంత్రి బి. నాగేంద్ర , ఎమ్మెల్యేలు జె.ఎన్. గణేష్, బి.ఎం. నాగరాజ్ సూచించారు. కొప్పళ, రాయచూరు మరియు విజయనగర జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు కూడా కాలువలకు తక్షణమే నీటిని విడుదల చేయాలని కోరారు. ఉదయం పూట రైతు నాయకులు కూడా కాలువలకు వెంటనే నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అందరి సూచనల మేరకు, నీటి లభ్యతను బట్టి కాలువలకు కేవలం 90 రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేయడం సముచితమని సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు...సెప్టెంబర్ 11న మరో సమావేశం:.. అనంతరం విలేకరులతో మాట్లాడిన మంత్రి నాగేంద్ర కాలువలకు నీటి విడుదలపై ఉదయం రైతుల సలహాలు తీసుకున్నాము. అనంతరం ఈ ప్రాంత ప్రజాప్రతినిధులందరితో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నాము. అందరి సలహాలు తీసుకున్న తర్వాత, కాలువలకు 90 రోజుల పాటు మాత్రమే నీటిని విడుదల చేయాలని నిర్ణయించాము. జలాశయంలో ప్రస్తుతం ఉన్న నీటి లభ్యత ఆధారంగా, రైతులకు ఇప్పుడు 90 రోజుల పాటు మాత్రమే నీటిని అందించగలమని మంత్రి తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షపాతం ఆధారంగా నీటివిడుదలలకు సంబంధించి నిర్ణయం తీసుకుంటాము. ఈ అంశంపై చర్చించేందుకు వచ్చే నెల సెప్టెంబరు 11న మరోసారి సమావేశం నిర్వహిస్తాం. ఈ సమావేశంలో మంత్రి బి నాగేంద్ర, కాడా అధ్యక్షుడు హసనసాబ నబీసాబ దోతిహాల్, జిల్లా స్థాయి హామీ పథకాల అమలు అథారిటీ ఛైర్మన్ రెడ్డి శ్రీనివాస్, జిల్లా కమిషనర్లు డాక్టర్ సురేష్ ఇట్నాల్, కవిత, జిల్లా పోలీసు సూపరింటెండెంట్లు డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ది, జాహ్నవి, కర్నాటక ఇరిగేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఇంజనీర్, టీబీ గిరాడ సిబిల్ ఇంజనీర్ మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఎస్ బి మల్లిగవాడ, యరమరస్ తుంగభద్ర కెనాల్ నిర్మాణ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సత్య నారాయణ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# అన్నపై దాడి చేసిన వ్యక్తికి 7 సంవత్సరాల జైలు

**చిట్వేలి, ఆగస్టు 11, ప్రభాతవార్త:** పెద్దల ఆస్తిగా ఉన్న మేకల పంపకం విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన వివాదంలో అన్నపై మెలికల కొడవలితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడికి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు 7 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000/ జరిమానా విధించినట్లు రైల్వే కోడూరు రూరల్ సిఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం తాను కేసు వివరాలను వెల్లడిస్తూ తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం పుల్లారెడ్డిపల్లి హరిజనవాడకు చెందిన దాసుతోటి నారాయణ తండ్రి చిన్న వెంకటసుబ్బయ్య,( 55) సంవత్సరాలు, తన సోదరుడు దాసుతోటి సుబ్రహ్మణ్యం( 52 ) పెద్దల ఆస్తిగా ఉన్న మేకల పంపకం విషయంలో వివాదానికి దిగాడు.

ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం తన అన్న నారాయణపై మెలికల కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు 2019 డిసెంబర్ 5న అప్పటి పుల్లంపేట ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ క్రైమ్ 233/2019, గ/ళీ 324, 307 ఐపీసీ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారని అన్నారు.

ప్రస్తుత ఎస్.ఐ చిన్న రెడ్డప్ప సాక్షులను న్యాయస్థానంలో హాజరుపరిచి, కేసు బలమైన ఆధారాలతో ముందుకు సాగేలా చర్యలు చేపట్టగా ప్రభుత్వం తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాయుని బాలాజీ సమర్థవంతంగా వాదనలు వినిపించారని అన్నారు. కేసు ఆధారాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ జడ్జి లావణ్య నిందితుడు దాసుతోటి సుబ్రహ్మణ్యంపై నేరం రుజువైనట్లు నిర్ధారించి, 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించారని సిఐ శ్రీనివాసులు తెలిపారు.

12skl13:12skl13.qxd 12-08-2026 00:23 Page 1



# బంగారం విక్రయాలపై ఆరా!

**-సంబంధిత అధికారుల దృష్టికి 'వార్త' కథనం**
**- బంగారం వ్యాపారుల్లో కలకలం**




**రణస్థలం, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

మండల కేంద్రం జెఆర్‌పురంలోని బంగారం దుకాణాల విక్రయాలపై సంబంధిత అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇక్కడ దుకాణాల్లో ఏ మేరకు విక్రయాలు చేస్తున్నారో దృష్టి సారించారు. సోమవారం 'వార్త' దినపత్రిక లో ప్రచురితమైన ఆకాశమే హద్దుగా... బంగారం మాఫియా అనే శీర్షిక కథనానికి సంబంధిత అధికారులు స్పందించి రణస్థలంలోని బంగారం దుకాణాలపై దృష్టి సారించినట్లు సమాచారం.

-వ్యాపారుల్లో కలకలం

బంగారం విక్రయాలపై వార్త దినప్రతికలో కథనం ప్రచురితం కావడంతో వ్యాపారుల్లో కలకలం రేకెత్తించింది. బంగారం విక్రయాల అక్రమాలపై అధికారులు దృష్టి సారిస్తే బండారం బయట పడిపోతుం దేమోనని వ్యాపారుల్లో గుబులు మొదలైంది. జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని గండికొట్టి నిబంధనలకు విరుద్ధంగా బంగారం అమ్మకాలు చేస్తున్న వ్యాపారులు వారి సొంత ఆడిటర్లతో లావాదేవీల లెక్కలు సరిచేసుకొనే పనిలో పడ్డారు.

– 'వార్త' దృష్టికి బంగారం దుకాణాల అక్రమాలు




రణస్థలంలో బంగారం కొనుగోలు చేస్తే మోసపోయినట్లేనని, కొనుగోలు చేసిన బంగారంలో ఎక్కువగా కల్తీతో పాటు తూకంలో కూడా భారీ వ్యత్యాసాలు చూపుతున్నారని వార్త దినపత్రికలో వచ్చిన కథనం వాస్తవమేనని పలువురు వార్త దినపత్రిక ప్రతినిధికి తెలుపడం గమనార్హం. జీఎస్టీ ఉండదని ఆశపడి బంగారాన్ని కొనుగోలు చేస్తే అసలకే మోసం వస్తుందని కొనుగోలుదారులు వాపోతున్నారు. రణస్థలంలో కొనుగోలు చేసిన బంగారాన్ని అవసరాల కొరకు జీఎస్టీ పరిధిలో ఉన్న ప్రముఖ షాపుల్లో విక్రయించాలనుకుంటే ఆ ఆభరణాల్లో కల్తీ (వేస్టేజ్) ఎక్కువగా ఉందని చాలా స్వల్ప ధరకు విలువ కడుతున్నారని కొనుగోలుదారు వాపోతున్నారు.

**- సంబంధిత అధికారులు దృష్టి సారించాలి**

రణస్థలం బంగారం దుకాణాల్లో సామాన్య వినియోగదారులు మోసపోకుండా, అలాగే ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# శ్రీకాకుళం వార్త



## వానలు లేక... సాగునీరు అందక....అన్నదాత గుండె కోత

**సంతబొమ్మాళి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



ఖరీఫ్ ఆరంభంలోనే అన్నదాతకు కష్టాల మొదల య్యాయి. ఒకవైపు వరుణుడు ముఖం చాటేయడం, మరోవైపు సాగునీరు అందకపోవడం.. వెరసి రైతన్న పరిస్థితి దయనీయంగా మారింది. వరి పంటపై ఆశలు పెట్టుకుని విత్తనాలు చల్లి నారుమడులు సిద్ధం చేసిన రైతులు ఇప్పుడు వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. పెట్టుబడులు పెట్టి సాగుకు సిద్ధమైనా.. ప్రకృతి సహకరించకపోవడంతో అన్నదాత గుండె కోతకు గురవుతున్నాడు. సంతబొమ్మాళి మండలంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 8,380 హెక్టార్లలో 14,750 మంది రైతులు పంటను సాగు చేస్తున్నట్లు సమాచా రం. ఎల్నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు లేకపోవడం, సాగునీరు అందకపోవడంతో ఇప్పటికే వేసిన ఎదలు, సిద్ధం చేసిన నారుమడులు ఎండిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా టైలాండ్ ప్రాంతం రైతులకు చుక్క నీరు అందడం లేదు. ఈ విధంగా మండలంలోని సందిపేట, పాతమే ఘవరం, ఎం.సున్నాపల్లి, రాజపురం, నౌపడ, మలగాం, హనుమంతు నాయుడుపేట,శెలగపేట, భావనపాడు తదితర గ్రామాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా కనిపిస్తోంది. సంతబొమ్మాళి, బోరుభద్ర ఉదయపురం సీపురం, తదితర గ్రామాలలో టైలాండ్ ప్రాంతంలో సాగునీరు అందడం లేదు. వర్షాలు లేకపోవడంతో నారుమడుల్లో తేమ తగ్గి అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఎదలు వేసిన పొలాల్లో కూడా నీటి కొరత కారణంగా ఎదలు మడిపోతున్నాయి. సరైన సమయంలో నీరు అందకపోతే పెట్టిన పెట్టుబడులు పూర్తిగా నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి

**-రోడ్లు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్**

**ఆమదాలవలస, ఆగస్టు 11, ప్రభాతవార్త:**



గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. పొందూరు మండలంలో కృష్ణాపురం గ్రామం నుండి పొందూరు పట్టణానికి రూ.1.75 కోట్లతో నిర్మించిన బీటీ రహదారి మంగళవారం ఎమ్మెల్యే రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రహదారులు, మంచినీటి సౌకర్యం అందించడం జరుగుతుందన్నారు. దీనికి ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో రోడ్లు లేని గ్రామలు రానున్న రోజుల్లో ఉండదని, సీసీ రోడ్లు నిర్మాణాలు జరిగే సమయంలో గ్రామస్తులు సహకారం అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండేళ్ల పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను, అభివృద్ధిని ప్రజల వద్దకే తీసుకువచ్చినట్లు తెలియజేశారు. గత వైకాపా పాలనలో గ్రామాలను అస్తవ్యస్తం చేస్తూ అవినీతిమయంగా మార్చేశారని విమర్శించారు. సంక్షేమం పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని గుర్తు చేశారు. ఎన్నికల్లో కూటమి ఇచ్చిన ప్రతి ఒక్క హామీను అమలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలను కలుపుతూ అంతర్గత రహదారుల నిర్మాణాలకు కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిగురుపల్లి రామ్మోహన్‌రావు, టిడిపి జిల్లా కార్యదర్శి సీపాన శ్రీ రంగనాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నెపు రాము, బలగశంకర్, భాస్కర్, చింతాడ వాసు, గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

**-జిల్లా జూనియర్ సివిల్ (సినియర్ డివిజన్) జడ్జి హరిబాబు**

**కోటబొమ్మాళి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



ప్రజలకోసం ఏర్పాటు చేసిన చట్టాలుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని శ్రీకాకుళం సివిల్ జడ్జి (సినియర్ డివిజన్), జిల్లా కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలు మేరకు మండలం మంచాలపేట గ్రామంలో పేదరిక నిర్మూల పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులకు సోషల్ మీడియా, విద్యా హక్కు, ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్, చైల్డ్ మ్యారేజ్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన కోటబొమ్మాళి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాస్ వీలునామా, మధ్యవర్తిత్వం కోసం, ఎంపీడీవో కె.నారాయణరావు ప్రభుత్వ పథకాలు గూర్చి, స్థానిక ఎసఐ వి.సత్యనారాయణ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సీనియర్ న్యాయవాధి పంచిరెడ్డి అర్జునరావు ప్రామిసరీ నోట్, చైల్డ్ మ్యారేజ్, ఫ్రీ లీగల్ ఎయిడ్ కోసం గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్. ప్రసాదరావు, పంచాయతీ ఈవో బోరక నరేష్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ విజయవంతం చేయాలి : సిపిఐ

**రాజాం, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

బిజెపి ప్రజా వ్యతిరేక పాలన నిరసిస్తూ సెప్టెంబర్ ఒకటి ఛలో ఢిల్లీ ఆగస్టు 6 నుండి 15వ తారీఖు వరకు పాదయాత్రలో భాగంగా రాజాం నియోజకవర్గం కేంద్రంలో అంబేద్కర్ జంక్షన్ నుండి పాలకొండ రోడ్డు, శ్రీనివాస థియేటర్ రోడ్డులో పాదయాత్ర మంగళవారం నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంఠేశ్వర యాదవ్ అధ్యక్షతన పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నియోజవర్గ సిపిఐ సహాయ కార్యదర్శి సింగారపు కనకరాజు, ఎచ్చర్ల ప్రసాద్, నెయ్యిల ప్రకాష్, సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహణ : కూన

**ఆమదాలవలస, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



మెగా డీఎస్పీని పారదర్శకంగా, అక్రమాలకు తావు లేకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పగడ్బందీగా నిర్వహించారని రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డీఎస్సీ విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి టీచర్ ఉద్యోగాలు పొందిన నిరుద్యోగ యువత కష్టాన్ని తక్కువ చేసి మాట్లాడడం వైకాపా గొడ్డలి పార్టీకి సాధ్యమన్నారు. మెగా డీఎస్సీ పై ఈనెల 17 నుంచి శాసనసభ సమావే శాలు జరుగుతాయని అక్కడ రోజంతా చర్చించడానికి మీ వైకాపాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు చర్చికి రావాలని గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే రవికుమార్ సవాల్ విసిరారు. రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు తమ్మినేని సుజాత,రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి. రాజ్యలక్ష్మి, మండల తెలుగు యువత అధ్యక్షులు తమ్మినేని నాని, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, బాగాది భాస్కరరావు, నాగళ్ళ మురళీధర్, గోండు రమణమూర్తి, అన్నెపు భాస్కరరావు, ఇంజరాపు విశ్వనాథం,తదితరులు పాల్గొన్నారు.



## రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

**కంచిలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

కుమ్మరి నౌగాం గ్రామ పంచాయతీలో 130 మీటర్ల సిసి రోడ్ 5 లక్షల రూపాయలు నిధులతో వేయడం జరిగింది. కంచిలి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు దుర్గాప్రసాద్ పండా, పైల రామారావు, కిషోర్ ఆనంద్ హరిబాబు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## టెక్కలి గ్రామ పంచాయతీ పరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు

**టెక్కలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ మరియు అనుబంధ శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల కాంపౌండ్ వాల్ నిర్మాణం జరుగుతుంది. పాత జాతీయరహదారికి మధ్యలో ఉన్న బెర్మ్‌లో సుందరీకరణ పనులు జరుగుతున్నాయి. గ్రామపంచాయతీ కార్యాలయం ముందు భాగంలో పాత బస్టాండ్ స్థలంలో విశాలమైన సీసీ గ్రౌండ్ నిర్మాణం జరుగుతుంది. రోడ్డు, జెడ్పి రోడ్డు, తొలిసూరిపల్లి రోడ్డు మరియు బన్నువాడ రోడ్డులను కలిపే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జంక్షన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. నౌపడ-మెళియాపుట్టి రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. స్థానిక, స్థానికేతర్ల కాలకృత్యాలు నిమిత్తం శౌచాలయం (సులభ్ కాంప్లెక్స్) నిర్మాణం జరుగుతున్నది. ఇవే కాకుండా ఇంకనూ ప్రస్తుతం పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనులు మరియు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల గ్రౌండ్ విస్తరణ పనులు జరుగుతున్నాయి.

## సీతంపేటలో ఘనంగా ఆదివాసీ దినోత్సవం

**ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త కావాలి : కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి**

**సీతంపేట, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు స్థానిక గ్రీన్ ఫీల్డ్ స్టేడియం మైదానంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆదివాసి ఉత్సవాల్లో మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆదివాసీ ధింసా నృత్యాలతో ఆలరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గిరిజన కుటుంబం ఏడాదికి కనీసం అయిదు లక్షల రూపాయలు ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. సోలార్ మిత్ర పథకం, స్థానిక పండ్లు, పంటలు (అనాస, పనస, పసుపు మొదలైనవి) ప్రాసెసింగ్ ద్వారా గిరిజనులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూనే ఆధునిక సాంకేతికతను, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకున్నప్పుడే ఆదివాసీల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరకు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు మోజూరు తేజావతి. టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవి. ఐటిడిఏ పిఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఏఎంసి చైర్మన్ సంధ్యారాణి, ఆరిక భాస్కరరావు, ప్రమోద్, మండంగి విశ్వనాథం, జి.రవి, పురుషోత్తం, ఆరిక సువర్ణ, ఎన్.చంద్రశేఖర్, యస్.రాజేష్, మొఖలింగం, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ నాయకులకు మాట్లాడే అర్హత లేదు

**అరకు పార్లమెంటరీ అధికార ప్రతినిధి అప్పలకొండ**



**వీరఘట్టం, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

మెగా డీఎస్సీపై మాట్లాడే నైతిక అర్హత వైసిపి నాయకులకు లేదని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ అధికారి ప్రతినిధి రాగాల అప్పలకొండ అన్నారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకి మెగా డీఎస్సీ ద్వారా భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. నియామక ప్రక్రియ పూర్తయిన అభ్యర్థులు ఉద్యోగాల్లో చేరిన తరువాత నేడు వైసిపి నేతలు ఆరోపణలు చేస్తూ, రిలే నిరాహార దీక్షలు చేయటం రాజకీయ దురుద్దేశంతో కూడుకున్న పనేనని ఆమె ఎద్దేవా చేశారు. డీఎస్సీలో ఏమైనా అవకతవకలు అక్రమాలు జరిగాయని తేలితే వాటిని ఆధారాలతో నిరూపించలే తప్ప కేవలం రాజకీయ ఆరోపణలు చేసి నిరుద్యోగ యువతలో అనుమానాలు, ఆందోళనలు సృష్టించడం సరి కాదన్నారు. తక్కువ సమయంలో పారదర్శకతతో 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిలిచారన్నారు. అటువంటి వ్యక్తిని నేడు రాజీనామా చేయమనడం విడ్డూరంగా ఉందని ఆమే ఎద్దేవా చేసారు. ఇటువంటి నిలకడ లేని ఆరోపణలు చేయడం వైసీపీ నేతలు మానుకోవాలని అప్పలకొండ హితవు పలికారు.

## ఏఎంసి పాలకవర్గ సభ్యుల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగింపు



**హిరమండలం, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్‌ను, పాలకవర్గసభ్యులను మరో 6 నెలలు రాష్ట్ర ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు మంగళవారం హిరమండలం ఏఎంసి సెక్రటరీ షేక్ యాసిన్ విలేకరులకు తెలిపారు. చైర్మన్‌గా మామిడి రామకృష్ణ, వైస్ చైర్మన్‌గా కొయిలాపు కృష్ణమాచార్యులతో పాటు పాత పాలక వర్గసభ్యులే మరో ఆరు నెలలు పాటు పదవుల్లో కొనసాగనున్నట్లు ఏఎంసి సెక్రటరీ వివరించడం జరిగింది. ఈ సందర్భంగా మంగళవారం తహసీల్దార్ కొప్పల బాలకృష్ణను కలిసి చైర్మన్ మామిడి రామకృష్ణ సెక్రటరీ యాసిన్‌లు కలిసి సొంత ఏఎంసి బిల్డింగ్‌ను నిర్మించుకోవడానికి స్థలం చూపాలని వినతిపత్రంను అందజేశారు.

## ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దాం

**కవిటి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



ప్లాస్టిక్ రహిత సమాజాన్ని స్థాపిద్దామంటూ డివిజనల్ ప్రత్యేక అధికారి సతీష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎల్. త్రినాథ్ అధ్యక్షతన ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై పంచాయతీ అభివృద్ధి అధికారులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రత్యేక అధికారి పిడిఓలకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసరెడ్డి డిప్యూటీ ఎండిఓ వరప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

## పశువులను మనుషులానే చూసుకోవాలి

**-ఆత్మ ఉప సంచాలకులు డాక్టర్ రవికృష్ణ**



**కోటబొమ్మాళి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

ప్రస్తుత పరిస్థితుల్లో పశువులను కూడా మనుషుల్లాగే చాలా జాగ్రత్తగా చూసుకోవాలని ఆత్మ ఉప సంచాలకులు డాక్టర్ మట్ట రవికృష్ణ అన్నారు. మంగళవారం మండలం చిట్టేవలస గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సౌజన్యంతో వర్షాకాలంలో పశుపోషణ సవాళ్లు, పరిష్కారాలపై రైతులకు శిక్షణ నిర్వహించి, పాడిరైతులకు ధృవీకరణ పత్రాలు, మినరల్ మిక్చర్లు, నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కాలంలో పశువులకు గాలి కుంటువ్యాధి, గొంతువాపు వ్యాధి, జబ్బవాపు వ్యాధి, లంపీవ్యాధి ఎక్కువగా సోకుతాయని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాధినివారణ టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. పశువైద్య సహాయ సంచాలకులు మందా లోకనాథం, తిలారు, నిమ్మాడ పశువైద్యాధికారులు మెండ ప్రజ్ఞచైతన్య, లఖినేని కిరణ్‌కుమార్, సిబ్బంది సురేష్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం, కార్యాచరణ ప్రణాళికపై రైతులకు అవగాహన

**మెళియాపుట్టి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



మండలంలో రైతు సేవా కేంద్ర పరిధిలో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించారు. గొడ్డ మరి ఎల్లయ్యపురం రైతు సేవా కేంద్రం పరిధిలో చిన్న సున్నాపురం , డాబారు గ్రామాలలో కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొని రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ముఖ్యంగా ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం ఉన్నందువల్ల వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు కార్యక్రమంలో పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు షణ్ముఖ, ధనలక్ష్మి ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జయలక్ష్మి, బ్రెడ్ సంస్థ ప్రతినిధులు, కూటమి నాయకులు ధర్మారావు, పలువురు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐతం విద్యార్థికి జొకాటలో ఉద్యోగం!



**టెక్కలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**

టెక్కలి సమీపంలోని ఐతం ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (సీఎసఈ) విభాగానికి చెందిన 2027 గ్రాడ్యుయేషన్ బ్యాచ్ విద్యార్థి కాటం అఖిలేష్ హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సంస్థ జొకాట నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగానికి ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వర రావు తెలిపారు. ఆయనకు ప్రథమ వార్షిక వేతనంగా రూ.7 లక్షలు లభించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థి ప్రతిభను అభినందిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్. శ్రీనివాసరావు, ప్లేస్‌మెంట్ డీన్ డా. ఎం.సంతోష్ కుమార్, సీఎసఈ విభాగాధిపతి డా. వై.రమేష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావానికి తట్టుకునే విత్తన గుళికలు తయారీ

**కంచిలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



అంపురం యూనిట్ అంపురంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎంఏఓ కొంకేనా సురేష్ ఆదేశాల మేరకు మంగళవారం కందులు, సజ్జలు, అనుములు, అలసందలు, గోరుచిక్కుడు, బెండ, పెసర, మినుములు, ఈ రకము విత్తనాలను విత్తన గుళికలు తయారు చేయడం జరిగినది. తక్కువ వర్షాలు వల్ల ఏదో ఒక పంటతో ఆదాయం వస్తుందని సంవత్సరం మొత్తం మీద పంటలతో భూమిని కప్పి ఉంచవచ్చునని ప్రతి పంట నుంచి ఆదాయం వస్తుందని రైతులకు, లీడ్ ఫార్మర్లకు, మండ యాంకర్ శివానందం రైతులకు లీడ్ ఫార్మర్స్‌కు వివరించారు. ఎనఎఫఏ శివాజీ, వీఏఏ శాంతి, మెంటర్ లోహిదాసు, చీర కామరాజు, కంచిలి మండలం ఐసిఆర్‌పిలు, లీడ్ ఫార్మర్స్, రైతులు హాజరయ్యారు.

## అంగన్వాడీ కేంద్రంలో విద్యా ప్రమాణాలు పెంచాలి

**ఎంఈఓ సప్పటి శివరాం ప్రసాద్**

**కంచిలి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



మండలంలో గల అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యా ప్రమాణాలు పెంచాలని స్థానిక మండల విద్యాశాఖ అధికారి సప్పటి శివరాం ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలతో జ్ఞానజ్యోతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రాథమిక ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో చేరే విద్యార్థులకు అంగనవాడి కేంద్రంలో బోధించే ప్రాథమిక విద్యలో చిన్నారులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ఆట వస్తువులలో విద్యాభ్యాసం నేర్పించాలని, విద్యార్థుల్లో గల సృజనాత్మకతను గుర్తించి వారికి భవిష్యత్తుకు ఉపయోగపడే విద్య అందించేందుకు తోడ్పాటు అందించాలని దీనికి అంగన్వాడీ కేంద్రాలే ముఖ్యమని చెప్పారు. కార్యక్రమంలో చిట్టిబాబు, ఇన్‌చార్జ్ హెచఎం బి.వెంకటరావు, డిఆర్‌పిలు బి లక్ష్మి, జి.ఈశ్వరి, ధనలక్ష్మి, ఏ.లోకేష్, వై.శంకర, గోపి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## కూటమికి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం



**కోటబొమ్మాళి, ఆగస్టు 11 ప్రభాతవార్త :**

రెండేళ్ల నమ్మకం... ప్రజల గుండెల్లో కూటమి ప్రభుత్వానికి సుస్థిర స్థానం లభిస్తోందని టిడిపి మండల కార్యదర్శి సుంకరి గణపతిరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ మంగళవారం మండలం గంగరాం పంచాయతీలో స్థానిక దేశం నేతలతో కలిసి ఆయన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో టెక్కలి నియెజకవర్గంలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో దేశం నేతలు వీరఘట్టపు శివరాం, టెంక రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలారావు జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



దివంగత మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక పోలారావు రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బెల్లుపడ జంక్షన్‌లో గల పోలారావు విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మున్సిపల్ కమిషనర్ రమేష్, ఆశి చిరంజీవులు రెడ్డి, బర్ల లక్ష్మణ, కృష్ణారావు పాత్రో, భోగేష్, జగన్ యాదవ రెడ్డి, ధర్మరాజు, గాంధీ, ధర్మతేజ, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో పరశురామ బిసాయి చేరిక



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11, ప్రభాతవార్త:**

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జిల్లా కోశాధికారి వి.క్రిష్ణ ప్రసాద్ నిర్వహణలో అర్బన్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు అధ్యక్షతన సంస్థగత సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరావు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవ్ కాంత్, రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ పైడి వేణుగోపాలం, జిల్లా కోర్ కమిటీ సభ్యులు పదాధికారులు, మండల్ ప్రెసిడెండ్‌లు కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో రత్తకన్న 20వ వార్డు తెలుగుదేశం పార్టీ మాజీ కౌన్సిలర్ పరుశురాం బిసాయిని పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పారు. అలాగే సుహాసిని ఆనంద్‌కి కేశవ్ కాంత్‌కి మొదటిసారి ఇచ్ఛాపురం విచ్చేసిన సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు సాలిన పద్మ పాల్గొన్నారు.

## విశ్వనాథ్ కుటుంబానికి బాసటగా తీర ప్రాంత ఐక్యవేదిక

**కవిటి, ఆగస్టు 11, ప్రభాతవార్త :**



సముద్రంలో వేట చేస్తూ ఇటీవల మృతి చెందిన కర్రి విశ్వనాథం కుటుంబానికి ఇచ్ఛాపురం నియోజవర్గ తీర ప్రాంత ఐక్యవేదిక బాసటగా నిలిచింది. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గ తీరప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు కొత్తపాలెం గ్రామానికి చేరుకుని కర్రి విశ్వనాథం భార్యకు మరియు వారి కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించి ఆదుకున్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక అధ్యక్షులు బడే తమ్మయ్య, పోరాడ చంద్రమోహన్, గౌరవ అధ్యక్షులు కొండయ్య మాస్టర్, చలపరాయి గురుమూర్తితో పాటు పలువురు ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

12vzm14:12vzm14.qxd 11-08-2026 23:46 Page 1



విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్

శృంగవరపుకోట, ఆగస్టు 9, ప్రభాతవార్త :



భారత 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎస్.కోట బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ ను ఏర్పాటు చేయనున్నామని రెడ్ క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ డాక్టర్ పొట్నూరు వరలక్ష్మీ ఆదివారం ఒక పోస్టర్ ను విడుదల చేశారు. ఈనెల 14వ తేదీ ఉదయం పది గంటలకు ఎస్ కోట పట్టణం విశాఖ రోడ్‌లో ఉన్న నైరా ఇన్ లార్జ్ దగ్గర బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేస్తామన్నారు. రెడ్ క్రాస్ సంస్థ బ్లడ్ డొనేషన్ క్యాంప్ లో దాతలు నుంచి సేకరించిన బ్లడ్ యూనిట్లలో 30%శాతం ప్రభుత్వ ఆసుపత్రులకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని అలాగే తలసీమియా పేషంట్లకి క్యాన్సర్ పేషెంట్లకు నిరుపేదలకు ఉచితంగానే బ్లడ్ ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. బ్లడ్ డొనేషన్ క్యాంపుకి 18 నుంచి 60 సంవత్సరాల మధ్యలో ఉన్న వారందరూ ఉదార స్వభావంతో తమ రక్తాన్ని దానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఆమె కోరారు. కార్యక్రమానికి ఎస్.కోట బ్రాంచ్ వైస్ చైర్మన్ ఏ.మల్లేశ్వర రావు,లైఫ్ మెంబర్లు డాక్టర్ ఎస్ ద్రౌపతి, డాక్టర్ గణేష్,ఎం.బాలు,గిరిజా సుందరి,దొడ్డి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీలకు భవిష్య పునాది జ్ఞానజ్యోతి



మెరకముడిదాం,ఆగస్టు11,ప్రభాత వార్త:

జ్ఞాన జ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్వాడీ పిల్లల భవిష్యత్ కు బలమైన పునాది పడుతుందని కోర్సు డైరెక్టర్ స్థానిక మండల విద్యా శాఖ అధికారి ఎం. చంద్రశేఖరావు అన్నారు. మంగళ వారం మెరకముడిదాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి 120 రోజుల శిక్షణలో భాగంగా చీపురుపల్లి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ అధికారి పి. నాగమణి ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమ కోర్స్ డైరెక్టర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిక్షణ చిన్నారుల భవిష్యత్ కు బంగారు బాట వేస్తుందని ఇక్కడ శిక్షణ పొందిన ప్రతీ అంగన్వాడీ టీచర్ తమ కేంద్రంలో చిన్నారులకు ఆటపాటలతో అవగాన కల్పించాలన్నారు. అలాగే ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపతి రావు పాల్గొని ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిఆర్పిలుగా ఎం. అప్పలనాయుడు, కె రమేష్, పి రమేష్,తాడ్డి శ్రీదేవి, కృష్ణవేణి లు వ్యవహరించారు. కార్యక్రమం రెండు విడతలాగా ఆరు రోజులు జరుగుతుందని గర్భాం సెక్టార్ పర్యవేక్షకురాలు శ్రీదేవి అన్నారు. మొదటి విడతగా ఈరోజు నుండి బుధవారం వరకు రెండో విడత ఈ నెల 22,24,25 తేదీలలో జరుగుతాయన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జనసేన ఇన్‌చార్జి జన్మదిన వేడుకలు

శృంగవరపుకోట,ఆగష్టు11,ప్రభాతవార్త:



ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ జన్మదిన వేడుకలు ఎస్.కోట శ్రీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగాయి. వేడుకల్లో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొని వబ్బినకు శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం వబ్బినతో కోళ్ల ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేయించారు. ఎస్వీఎన్ బ్లడ్ బ్యాంక్, విశాఖ మెడికోవర్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం,మెడికల్ క్యాంప్ ను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు వబ్బిన పళ్ళుపంపిణీ చేశారు మధ్యాహ్నం కూటమి పార్టీ శ్రేణులు అభిమానులకు వబ్బిన ఘనంగా విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులపై మున్సిపల్ సార్లు వీరప్రతాపం ..!

### ప్రతిరోజు రెక్కాడితేగాని డొక్కాడని వారిపై రుబాబు



సాలూరు, ఆగష్టు 11, ప్రభాతవార్త :

మున్సిపల్ శానిటేషన్ అధికారులు చిరువ్యాపారులపై తమ అధికార ప్రతాపం చూపెడుతున్నారని ప్రజలు పెదవి విరుస్తున్నారు. అలాగే మెయిన్ రోడ్ కాలువలపై ఆక్రమణ చేసి షాపులు నిర్మించిన యజమానులకు మాత్రం నోటీసులు ఇచ్చి సలామ్ కొడుతున్నారని విమర్శలు వినపడుతున్నాయి. ఇంకా వివరాలు చూద్దాం పట్టణ కన్యకా పరమేశ్వరి ఆలయం జంక్షన్ రోడ్ పక్కన నిత్యం జామ,బొప్పాయి, జొన్నపొత్తులు విక్రయిస్తూ వచ్చే డబ్బులతో చిరువ్యాపారులు జీవనం సాగిస్తుంటారు. అలాంటి వారిపై సచివాలయ శానిటేషన్ అధికారి మంగళవారం రుబాబు చేయడంపై స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఆ జంక్షన్‌లో ఉన్న బాలాజీ కట్ పీస్ సెంటర్ బట్టల దుకాణం ముందు కాలువ పైనే ట్రాన్స్ఫార్మర్ ఇంకా రోడ్డు ఆక్రమించి భారీనేమ్ బోర్డ్ ఏర్పాటు చేసినా ఆ ఓనర్ పై ఇంతవరకు చర్యలు తీసుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. గతంలో దీనిపై మున్సిపల్ కమీషనర్ ఆదేశాలతో టీపీఓ నోటీసులు ఇచ్చిన యాక్షన్ లేకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా మెయిన్ రోడ్డు అంతా కాలువలపై ఆక్రమించి షాపులు నిర్మించిన వారికి మాత్రం లాలింపులు బుజ్జగింపులా అని క్వశ్చన్ చేస్తున్నారు. చిరువ్యాపారులకు మాత్రం మున్సిపల్ అధికారులు వార్నింగ్ లు హెచ్చరికలు చేయడం పెద్దహైలెట్ అని చెప్పుకుంటున్నారు. అలాగే బతకడానికి చేస్తున్న చిరువ్యాపారులపై కాకుండా రూల్స్ ను బ్రేక్ చేస్తూ షాపులు నిర్మించిన బలిసిన వారిపై తమ అధికారం సార్లు చూపెడితే మెయిన్ రోడ్డు ఎప్పుడో బాగుపడేదని టాక్ వినిపిస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ శానిటేషన్ అధికారులు తమడ్యూటీని సక్రమంగా చేయాలని పురవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## రావుపల్లి-కొత్తూరు రహదారి పరిధిలో అడుగుకో గొయ్యి

గరుగుబిల్లి, ఆగష్టు 11, ప్రభాతవార్త :



రహదారి పూర్తిస్థాయిలో అధ్వానంగా తయారైనప్పటికీ పట్టించుకునే వారు కరువవ్వడంతో రెండు గ్రామాల ప్రజలతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతర గ్రామాల ప్రజలు నరకం చూస్తున్నారు. పలుమార్లు రహదారి మరమ్మతులకు గరవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయ మును ఇటు ప్రజా ప్రతినిధులకు అటు అధికారులకు తెలియ జేసినప్పటికీ చర్యలు శూన్యమని మండల పరిధిలోని రావుపల్లి, కొత్తూరు గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రావుపల్లి గ్రామం నుండి కొత్తూరు గ్రామం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల రహదారి పరిధిలో అడుక్కో గొయ్యి ఏర్పడింది. రహదారి గోతుల మయంగా తయారవడంతో ఏమాత్రం వర్షం కురిసిన చెరువుల తయారవుతుందని, దీంతో రహదారి మీదుగా ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు పేర్కొంటున్నారు. అదేవిధంగా రావుపల్లి, కొత్తూరు రహదారి మీదుగా విజయనగరం జిల్లా వంగర మండ లంలోని పలు గ్రామాలకు కార్లు, ద్విచక్ర వాహ నాలపై వెళుతుంటారు. అయితే దాదాపు రెండు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా గోతులమయంగా తయారవడంతో రహదారి మీదుగా ప్రయాణించేందుకు ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టిం చుకుని మరమ్మతులకు గురైన రావుపల్లి, కొత్తూరు రహదారిని మెరుగుపరిచి వాహన చోదకుల ఇబ్బందులను తొలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## నందివానివలస రహదారి సమస్యకు మోక్షం

### ప్రభుత్వ విప్ జగదీశ్వరికి కృతజ్ఞతలు

గరుగుబిల్లి, ఆగష్టు11, ప్రభాతవార్త:

నందివానివలసలోని మెయిన్ రోడ్డు (తారు రోడ్డు) ఎస్. సి వీధి నుంచి సింగనాపురం తారు రోడ్డు వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవు కలిగిన రోడ్డు గత 40 సంవత్సరాల నుండి గోతులు, బురద మయంగా తయార వడంతో పంట పొలాలకు వెళ్ళాలన్నా మరియు రైతులు పండించి వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి తేవాలన్న తీవ్ర ఇబ్బందులకు గురవుతుండేవారు. అదే విధంగా వ్యాపారస్తులు పొలం దగ్గర కొనుగోలు చేసినప్పటికీ రహదారి బాగులేనందున తక్కువ రేటుకు కొనుగోలు చేస్తుండే వారని, దీంతో రైతులు చాలా నష్టపో వలసి వస్తుండేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈసమస్యను, గ్రామ పెద్దలు, ప్రజలు కలిసి స్థానిక ప్రజా ప్రతినిధులకు, స్థానిక ఎంఎల్ఏ ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరీ తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. ఈనేపథ్యంలో సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు కురుపాం నియోజకవర్గం శాసనసభ్యులు మరియు ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తక్షణమే రెండు కోట్ల యాభై లక్షల రూపాయలు మంజూరు చేయించడం , పనులు ప్రారంభించడం జరిగిందని, ప్రస్తుతం 136 మీటర్లు సిమెంట్ కాంక్రీట్ రోడ్ పూర్తి చేయడం, ఇరు వైపులా కాలువలు నిర్మించడం జరిగిందని, మిగతా భాగం లెవెలింగ్ చేసి మెటల్ వేయడం జరిగిందన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల లబ్ధిదారులతో ముఖాముఖి

పార్వతీపురం, ఆగష్టు11, ప్రభాతవార్త:



ఏపీ సర్ఫ్, ఎన్టీఆర్ పెన్షన్ డైరెక్టర్ బి సుధాకర్ పెద బొండపల్లి సచివాలయంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ లబ్ధిదారులతో పెన్షన్ల అమలు తీరుపై చర్చించారు. ఈ సందర్భంగా ఏపీ సర్ఫ్, ఎన్టీఆర్ భరోసా పెన్షన్స్ అమలు విధానాన్ని మరియు సభ్యులకు ఏ విధంగా పింఛన్లు అందుతున్నాయి పింఛన్లు తీసుకోవడంలో సమస్యలు ఉన్నాయా అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వేలో ఐవిఆర్ఎస్ కాల్స్ ని ఏ విధంగా ఆన్సర్ చేస్తున్నారు అన్నది సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి పెన్షన్ దారు తన మొబైల్ ఫోను నెంబరు డేటా బేస్ లో చేయాలని వారు వాడుతున్నటువంటి మొబైల్ ఫోన్ మాత్రమే కాల్స్ వస్తాయి అని వివరించడం జరిగింది. ప్రతి పెన్షన్ దారుడికి కచ్చితంగా పెన్షన్ అందాల అన్నదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శర్మ , పంచాయతీ కార్యదర్శి పాపారావు, డి ఆర్ డి ఏ పెన్షన్స్ డిపిఎం అరుణ, ఏపీఎం సత్యనారాయణ పార్వతీపురం ఏపీఎం సన్నీబాబు సచివాలయ సిబ్బంది గ్రామపెద్దలు హాజరయ్యారు.

## ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా కూటమి ప్రభుత్వం

### 31 మందికి రూ.23.70 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం అందించిన ఎమ్మెల్యే లోకం మాధవి

నెల్లిమర్ల, ఆగష్టు 11, ప్రభాతవార్త:



ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలిచి, ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.23.70 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే లోకం మాధవి అందజేశారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో భరోసా కల్పిస్తోందని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదలు, సామాన్యులు, ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉండేలా నిరంతరం పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు. "ప్రజల కష్టాల్లో తోడుగా.. ఆపదలో భరోసాగా.. ప్రతి కుటుంబం సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం" అని ఎమ్మెల్యే తెలిపారు.

## రైతులు ఆరుతడి పంటలపై శ్రద్ధ చూపాలి



రామభద్రపురం,ఆగష్టు 11, ప్రభాత వార్త:

రైతులు ఆరుతడి పంటలు అయిన పెసర, మినుము ఉలవలు వాటిపై పై శ్రద్ధ చూపాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త కె.తెజేశ్వరరావు కోరారు. మంగళవారం జన్ని వలస పంచాయతీ నేరల్లవలస గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎలనినో ప్రభావం మీద రైతులకు అవగాహన కల్పించారు. వర్షపాతశీ తక్కువగా ఉన్నందున అరుతడి పంటలు గురించి వివరించారు. ప్రత్తి మరియు మొక్కజొన్న సాగులో సస్య రక్షణ మీద శాస్త్రవేత్త యు.త్రివేణి తెలిపారు. బొబ్బిలి సబ్ డివిజన్ ఎడిఎ యమ్. మధుసూదనరావు పంటల భీమా గురించి కాయగూర పంటలపై రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమరా శివ,ఎఇఓ బి. సతీష్, మరియు రైతు సేవ కేంద్ర సిబ్బంది యు.స్వాతి, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల జీతభత్యాలు అదనపు భారమా?

రామభద్రపురం,ఆగష్టు 11,ప్రభాత వార్త,:



రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో ఉద్యోగుల జీతభత్యాలు,ఫింఛన్ దారులకే 90శాతం కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని,ప్రజలకు ఉద్యోగులకు మధ్య వైరం పెట్టడం మీకు తగునా అని ఏపిటి యఫ్ రాష్ట్ర కౌన్సిలర్ మడక బలరాంనాయుడు సూటిగా ప్రశ్నించారు. స్థానిక మండల కేంద్రంలోని ఏపిటియఫ్ కార్యాలయంలో మండల కమిటీతో కలిసి విలేకఖర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో ఉద్యోగుల,జీత భత్యాలు,ఫింఛన్లకు 28.4 శాతం, రెవిన్యూ వ్యయంలో 36.9 శాతం కేటాయింపులు గణాంకాల ప్రకారం ఉన్నాయని, కానీ ఉద్యోగుల జీతభత్యాలు కోసం 95 శాతం ఖర్చు అవుతుందని ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలకు సేవలందిస్తున్న ఉద్యోగుల జీతభత్యాలను అదనపు భారంగా భావించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ సేవలకు అవుసరమైన వ్యయంగానే భావించాలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని వాస్తవంగా చెప్పాలంటే ప్రభుత్వ పన్నులు, ప్రభుత్వేతర పన్నులు,కేంద్ర పన్నుల వాటాలు,కేంద్ర గ్రాంట్లు తదితర ఆర్థిక వనరుల వివరాలను, ఖర్చులు, కేటాయింపుల వివరాలను విడివిడిగా పారదర్శకంగా చూపించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించవలసిన బకాయిలను తాత్సర్యం చేయడాన్ని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి 13వ వేతన సవరణ సంఘాన్ని వేయాలని,30శాతం మధ్యాంతర భ్రుతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏపిటియఫ్ మండల శాఖ అధ్యక్షుడు బొప్పె రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు సువ్వాడ వేంకట అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి వి.అప్పారావు,తెర్లాం మండలం ప్రధాన కార్యదర్శి కె.గోపాలక్రిష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

## పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరు

వేపాడ ,ఆగష్టు 11, ప్రభాతవార్త:



పశు కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణాలు మంజూరు అవుతున్నాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిని డాక్టర్ కోరాడ గాయత్రి కోరారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పాడి రైతులు తమ పశుసంపదను అభివృద్ధి చేసుకోవడంతో పాటు, పశువుల దాణా, వైద్య ఖర్చులు, బీమా, కార్మికులు, నీరు, విద్యుత్ తదితర నిర్వహణ ఖర్చులను సులభంగా భరిం చేందుకు ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని పశుపోషణ, డెయిరీ రంగాలకు కూడా విస్తరించిందని తెలిపారు. వ్యవసాయంతో పాటు పశుపోషణను ప్రధాన జీవనాధారంగా చేసుకున్న రైతులకు తక్కువ సమయంలో, సులభమైన విధానంలో సంస్థాగత రుణ సదుపాయం కల్పించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం అని తెలిపారు . పాడి రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడకుండా బ్యాంకుల ద్వారా రుణం పొం దేలా ఈ పథకం ఉపయోగపడుతుందనీ తెలిపారు పాడి పశువులు , గొర్రెలు, మేకలు, పందులు, కోళ్లు,కుందేళ్లు పెంచుతున్న రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డు కోసం అర్హత కలిగిన రైతులు మీ రైతు సేవా కేంద్రంలోని పశు సంవర్ధక సహాయకుల ద్వారా తమకు, సమీపంలోని వాణిజ్య బ్యాంకు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు , సహకార బ్యాంకును సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పశువుల సంఖ్య, పశుపోషణ కార్యకలాపాల స్వభావం, షెడ్ వివరాలు, అంచనా నిర్వహణ ఖర్చులు, తదితర అంశాలను పరిశీలించిన అనంతరం బ్యాంకు నిబంధనల ప్రకారం రుణ పరిమితిని నిర్ణయించడం జరుగుతుందని వివరించారు.

## మున్సిపాలిటీకి శాశ్వత మంచినీటి పరిష్కారం : ఎమ్మెల్యే

పార్వతీపురం, ఆగష్టు11, ప్రభాతవార్త:



స్థానిక మున్సిపాలిటీ ప్రజల దశాబ్దాల కల అయిన మంచినీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా యూఐడీఎఫ్ పథకం కింద రూ. 86.14 కోట్ల అంచనా వ్యయంతో 13.50 మీణ కెపాసిటీ గల నూతన తాగునీటి సరఫరా పథకానికి అంచనాలు మంజూరయ్యాయని, అందులో భాగంగా బెలగాం ట్యాంక్ వద్ద 500 ఖూ సర్వీస్ రిజర్వాయర్ నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత 40-50 ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ స్కీమ్ శిథిలావస్థకు చేరడంతో పట్టణ ప్రజలు తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొన్నారని, ఎన్నికల ముందు ప్రతి ఇంటికీ మంచినీరు అందిస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టిందన్నారు. ఈ ప్రాజెక్టు టెండర్‌ను ఎన్సీసీ (చీజజ) సంస్థ దక్కించుకుందని, పనులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వేగంగా పూర్తి చేయాలని వారిని ఆదేశించామన్నారు. ప్రతిపక్షాల ఫేక్ ప్రచారాలను నమ్మవద్దని, మాట ఇచ్చిన ప్రకారం చెప్పిన సమయానికి పనులు పూర్తి చేసి ప్రాజెక్టును మున్సిపాలిటీకి అంకితం చేస్తామన్నారు. మున్సిపల్ అధికారులు, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి మద్య వెంకటేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## అంగన్వాడీ పిల్లలను జ్ఞాన జ్యోతులుగా తీర్చిదిద్దాలి



దత్తిరాజేరు, ఆగస్టు 11, ప్రభాత వార్త :

అంగనవాడి టీచర్లు స్కూల్ పిల్లలకు విద్య ద్వారా జ్ఞాన జ్యోతులుగా తయారు చేయాలని ఎంఈఓ వెంకట్రావు అన్నారు మంగళవారం దత్తిరాజేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి 120 రోజుల సెక్షన్ లో భాగంగా సిడిపిఓ బి రాజేశ్వరి ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు కార్యకర్తలకు శిక్షణ అందించారు ఈ కార్యక్రమంలో భాగంగా శిక్షకులు మాట్లాడుతూ లింగ వివక్షత చేయడం నేరమన్నారు ఈ విశేషమైన శిక్షణ ద్వారా నూతన బోధనా పద్ధతులు ఆటపాటలతో కూడిన అభ్యాసం మరియు పిల్లల సర్వముఖ అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను అందించాలని తెలిపారు చిన్నారుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందన్నారు ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి అంగన్వాడీ కార్యకర్త తమ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించాలన్నారు 0 నుండి 3 సంవత్సరాలు పిల్లలు పెరుగుదల మరియు అభివృద్ధి లక్షణాల గురించి తెలియజేశారు పిల్లల జీవితంలోని మొదటి మూడు సంవత్సరాలు శారీరకు ఎదుగుదల మార్పులతో కూడి ఉంటాయి సాధారణంగా మూడు రేట్లు పెరుగుతారు రెండు మూడు సంవత్సరాలలో ఎదుటిదర కొనసాగుతుంది అన్నారు మొదటి విడత మూడు రోజులు శిక్షణ ఇచ్చి రెండో విడత 22 24 25 తేదీల్లో అండర్ సెక్షన్ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు శ్యామలత ఇందిరా భవాని ఉపాధ్యాయులు అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## జ్ఞాన జ్యోతి కోర్సులకు శిక్షణ తరగతులు

బలిజిపేట, ఆగష్టు 11, ప్రభాతవార్త :



బలిజిపేట మండలలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగనవాడి కార్యకర్తలు ఆధ్వర్యంలో జ్ఞాన జ్యోతి కోర్సులకు శిక్షణ తరగతులు ఈ నెల 11 నుండి 13 వరకు మరియు 22 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నారని ఐసిడిఎస్ అధికారిని రాజ్యలక్ష్మి తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా పూర్వ ప్రాథమిక విద్య పటిష్టంగా అమలు చేయడం ద్వారా ప్రాథమిక విద్యలో మంచి ఫలితాలు సాధించడం జరుగుతుందని జ్ఞాన జ్యోతి కోర్స్ కోఆర్డినేటర్, బలిజిపేట ఎంఈఓ 1 సామల సింహాచలం అన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బలిజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలో గల అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎంఈవో -1 సామల సింహాచలం, ఐసీడీఎస్ సీడిపివో కె రాజ్యలక్ష్మి, హెచ్ఎం వి వెంకట నాయుడు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిసోర్స్‌పర్సన్స్‌గా శంబంగి వెంకటేశ్వర రావు,గుల్ల రామారావు, బండారు పైడిరాజు వ్యవహరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ కె రాజ్యలక్ష్మి సూపర్వైజర్ సులేఖ, మండల వ్యాప్తంగా పనిచేస్తున్న 92 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు వెళ్లాలి



నెల్లిమర్ల, ఆగష్టు 11, ప్రభాతవార్త :

మహిళల ఆర్థిక అభ్యున్నతి సాధించే విధంగా వ్యాపార ప్రణాళికలను వెలుగు సిబ్బంది అమలు చేయాలని వెలుగు, డిఆర్డిఏ ఏపీడి సావిత్రి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 16 మోడల్ మండలాల ఏపీఎంలు, సీసీలకు,అకౌంటెంట్‌లు కు వ్యాపార అభివృద్ధి ప్రణాళిక -1 పై రెండు రోజు ల శిక్షణ మంగళవారం ఆమె లాంచనంగా ప్రారంభించా రు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, సుస్థిర జీవనోపాధులు అంశాలపై రిసోర్స్ పర్సన్ శేషగిరి శిక్షణ అందించారు. గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చెయ్యడం, ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం తయారు చేయాల్సిన బిజినెస్ డెవలప్ మెంట్ ప్లాన్ గురించి వివరించారు. అలాగే ఆయా గ్రామాలకు గ్రామైక్య సంఘాల ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలను తెలియజేసారు. మండల, గ్రామ స్థాయిలో తయారు చేసిన ప్లాన్ ను మండల స్థాయిలో క్రోడికరించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు చందక మాధవి, ఏపిఎం సురేష్ , వివో ఏలు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## లాభసాటి పంటలను రైతులు వేసుకోవాలి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరిబాబు చౌదరి

దత్తిరాజేరు, ఆగష్టు11, ప్రభాతవార్త :



ఎల్ నినో ప్రభావంవల్ల వర్షాలు తక్కువ ఉంటాయని రైతులు అంతర్ పంటలు మరియు లాభసాటి పంటలును పండించాలనిరాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరిబాబు చౌదరి అన్నారు పెదమానాపురం వరి పంటల వద్ద రైతన్న నీకోసం కార్యక్రమం మంగళవారం చేపట్టారు. కార్యక్రమానికి రాష్ట్ర జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ హరిబాబు చౌదరి మాట్లాడుతూ తక్కువ నీరుతో పండే పంటలును రైతులు వేసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ సంచాలకులు వీటి రామారావు వ్యవసాయ ఉప సహాయక సంచాలకులు శ్రీనివాసరావు సేంద్రియ వ్యవసాయ సహాయకులు నాగరాజు మండలవ్యవసాయ అధికారి గోవిందమ్మ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలను బలోపేతం చేయాలి : ఏపీఎం



వేపాడ ,ఆగష్టు 11, ప్రభాతవార్త:

గ్రామాల్లో మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి వి ఓ ఏ లంతా నిరంతరం కృషి చేయాలని వెలుగు ఏపీఎం డి. సూర్యనారాయణ కోరారు. మంగళవారం వేపాడ వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో లోకోస్ పై వివోఏలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సంఘం ప్రొఫైల్,సభ్యురాలు ఈ కేవైసీ చెయ్యడం,గ్రామ సంఘం మార్చి2026 నాటికి నిల్వలు మ్యాన్యువల్ గా తయారుచేసి లోకోస్ ఆన్లైన్ యాప్‌లో అప్లోడ్ చేయడం, సంఘంలో లేని సభ్యులను తొలగించడం ఉన్నవారిని చేర్చడం వంటి కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని సూచించారు. గ్రామ సంఘం బ్యాంక్ అకౌంట్స్ , సభ్యురాలు యొక్క బ్యాంక్ అకౌంట్లు యాప్ లో యాడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ సి అబద్ధం , డి. సత్యనారాయణ , కె. ద్రాక్షయని, పలు గ్రామాల వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు మానసిక,శారీరక ఎదుగుదల పై ప్రత్యేక బోధన చేయాలి

గరివిడి, ఆగష్టు 11, ప్రభాత వార్త:

అంగన్వాడీ కేంద్రాల్లో విద్యాబ్యాసం చేసే చిన్నారులకు మానసిక,శారీరక ఎదుగుదల పై అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక బోధన చేయాలని గరివిడి మండల విద్యాశాఖాధికారి పోలుబోతు రామారావు అన్నారు. గరివిడి ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాదికారి పోలుబోతు రామారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చెయ్యాలని పిల్లలకు సమగ్ర విద్య నందివ్వాలని ఆయన స్పష్టం చేశారు. ఐసిడిఎస్ సీడీపీఓ ఎన్. ఆరుద్ర ,పాఠశాల హెచ్ ఎం .ఏ. నిర్మల, అంగన్వాడీ సూపర్ వైజర్లు మల్లాజ్యోషుల జ్యోతి,శుభ లక్ష్మీ,భారతి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిబద్ధత గల నాయకుడు స్వర్గీయ గోవిందరావు



### ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

నెల్లిమర్ల, ఆగష్టు 11 ప్రభాతవార్త :

జనసేన పార్టీ నాయకుడు, తుమ్మల పేట పిఏసిఎస్ వైస్ చైర్మన్ స్వర్గీయ పతివాడ గోవిందరావు నిబద్ధత గల నాయకుడు అని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పేర్కొన్నారు. గోవిందరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగ మాధవి, పార్టీ నాయకుడు లోకం ప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం దేవుని నెలివాడ లోని ఫంక్షన్ హాల్ లో సంతాప సభ నిర్వహించారు. పార్టీ నాయకుడు చనమల్లు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, లోకం ప్రసాద్, పార్టీ నాయకులు హాజరై స్వర్గీయ గోవిందరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు.




# నాచు సోయగం !



**చర్మ సంరక్షణకు వాడే ఔషధాల జాబితాలోకి ఈసారి ఆల్గే చేరడమే కాదు, ట్రెండ్‌గానూ మారింది. ఇంతకీ ఇది మేలు చేసేనా?**

నాచు అంటే వర్షాకాలంలో ఇంటి చుట్టు పక్కల చేరేది అనుకునేరు! దీన్ని ప్రత్యేకంగా సముద్రాలు, నదుల నుంచి సేకరిస్తారు. ఇది కొన్ని దేశాల్లో ఆహారం కూడా. దీనిలోని పాలీశాకరైడ్లు చర్మంలో తేమను బంధించి ఉంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్‌నీ దరిచేరనీయవు. వాతావరణంలో మార్పులు, కలుష్యం కారణంగా ఏర్పడే హాని నుంచి రక్షిస్తాయి. అందుకే బ్యూటీ ఉత్పత్తుల్లో నాచుకి చోటిస్తున్నారు. దీనిలోని అమైనో యాసిడ్లు, పాలీశాకరైడ్లు, పాలీఫినాల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్ని త్వరగా దరి చేరనీయవు. ఎన్నో పరిశోధనలూ దీనినవ రుజువు చేస్తున్నాయి. వీగన్.. ఇప్పుడు చాలామంది బ్యూటీ ఉత్పత్తుల్లో చూస్తున్నది ఇదే! ఆల్గేని వృక్షజాతుల కిందే లెక్కేస్తారు కాబట్టి, ధైర్యంగా వాడొచ్చంటారు నిపుణులు. సీరమ్, మాయిశ్చరైజర్లలో దేన్నైనా నాచుతో తయారు చేసేనత ప్రయత్నించ మంటున్నారు. వారానికోసారి దీంతో తయారు చేసిన మాస్క్‌ని వేసుకున్నా ప్రయోజనమేనట. నిజానికి మన వాడే చాలారకాల యాంటీ పిగ్మెంటేషన్, యాంటీ యాక్నే ఉత్పత్తుల్లో చాలావరకూ ఆల్గే ప్యాక్‌ల పేరుతో ఆన్‌లైన్ వేదికల్లో ట్రెండ్ అవుతున్నాయి. నాచులోని విటమిన్లు, మినరల్స్ చర్మానికి మేలు చేస్తాయన్నది వాస్తవమే. టాక్సిన్లు, మలినాలను తొలగించి చర్మకణాల పునుద్ధరణకూ తోడ్పడతాయి. అయితే కొందరిలో ఇవి దురద, దద్దుర్లకు దారితీస్తాయి. కాబట్టి, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదండీ సంగతి. మీరూ ప్రయత్నిస్తారా ఈ ఆల్గే ట్రెండ్? ✶

# బచ్చలి గంజి



అద్భుత రుచి ఆకు కూరల్లో రాణీ లాంటిది బచ్చలి. ఇది ఏ కాలంలోనైనా దొరుకుతుంది. కనుక ఎప్పుడంటే అప్పుడు తినొచ్చు. మనం పప్పు, టొమాటోలతో కలిపి చేస్తే.. వేరే వేరే రాష్ట్రాల్లో వేరేవేరే విధాల్లో వండుతారు. ఉత్తరాఖండ్ వాసులు 'కాఫులీ' పేరుతో చేస్తారు. పేరు బాగుంది కదూ! రుచీ సూపరే. ఎలా చేస్తారంటే. . కడాయిలో రెండు చెంచాల నూనె వేసి.. వేడయ్యాక.. ఆవాలు, ఎండుమిర్చి కచ్చాపచ్చా దంచిన వెల్లుల్లి వేయాలి. ఆవాలు చిటపటలాడాక. ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు, బచ్చలికూర పేస్టు వేయాలి. కాస్త వేగాక.. రెండు చెంచాల నెయ్యి వేయాలి. కాస్త వేయించి.. రెండు చెంచాల గంజి పోయాలి. దగ్గరగా అయ్యాక.. తగినంత కారం, ఉప్పు వేసి.. ఇంకో నిమిషం ఉంచి దించేయాలి. అందులో అర కప్పు మీగడ వేస్తే.. ఘుమఘుమలాడే 'కాపులీ' సిద్ధమై పోతుంది. ఇది అన్నం, రొట్టెలు.. ఎందులోకైనా బాగుంటుంది. ఇదెంతో ఆరోగ్యకరమైన వంటకం అంటారు ఆహార నిపుణులు. రుచీ, ఆరోగ్యం రెండూ కావాలంటే ఇలాంటివి తింటుండాలి. పైగా చేయడం కూడా చాలా తేలిక. నచ్చితే మీరూ చేసి చూడండి. ◻

# హార్మోన్ల సమతుల్యత

ఒకప్పుడు హార్మోన్ల అసమతుల్యత, పీరియడ్ సమస్యలు 3540ఏళ్ల పైబడిన మహిళల్లోనే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ ఇప్పుడు 20-25 ఏళ్లలోపున్న యువతుల్లోనే కనిపిస్తున్నాయి. నెలసరి క్రమం తప్పడం, మొటిమలు, జుట్టు రాలడం, అకస్మాత్తుగా బరువు పెరగడం, మూడ్స్ వింగ్స్ వంటి సమస్యలతో తరచూ



ఆసుపత్రిలో మెట్లు ఎక్కుతున్నాయి. ఐసీఎంఆర్ నివేదిక ప్రకారం... ప్రతి ఐదుగురిలో ఒకరు పీసీఓఎస్‌తో బాధపడుతున్నారట. కెరియార్, బిజీలైఫ్, సోషల్ మీడియా చూసి అనుసరించే డైట్లు, జంక్‌ఫుడ్ వీటికితోడు నిద్రలేమి ఇవన్నీ హార్మోన్ల అసమతుల్యతకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య ఇలానే కొనసాగితే భవిష్యత్తులో మరిన్ని ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. మందులతో కూడా రోజువారీ జీవనశైలిలో చిన్నచిన్న మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. సోషల్ మీడియాలో వచ్చే డైట్ ప్లాన్స్ గుడ్డిగా పాటించొద్దు అంటున్నారు. ఒకవేళ డైటింగ్ చేసినా కార్బోహైడ్రేట్లను ఒక్క సారిగా పూర్తిగా మానేస్తే హార్మోన్లు మరింత దెబ్బతింటాయని చెబుతున్నారు. రోజువారీ ఆహారంలో గుడ్లు, పప్పులు, పన్నీర్... వంటి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తీసుకోమంటున్నారు. విటమిన్లు, విటమిన్లు సమృద్ధిగా తీసుకుంటూ రోజుకు కనీసంఏడుగంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా 30-40నిమిషాలపాటు వాకింగ్ చేయడం అలవాటుచేసుకుంటే ఒత్తిడి తగ్గి హార్మోన్ల సమస్యలు దరిచేరవంటున్నారు. ◻

# ఆధారం ఆవిరి కాగా సంకల్పం 'స్వర్ణ'మైంది



ఉన్న జీవనోపాధి ఆవిరై పోయినా ఆమె సంకల్పం మారలేదు. ఎలాగైనా కరాటేలో జాతీయ ఛాంపియన్ కల నెరవేర్చుకోవడమే ఆమె కళ్ల ముందున్న లక్ష్యం. 'గమ్యం ఏదైనా సంకల్పం స్థిరంగా ఉంటే చేరుకోలేని తీరాలుండవు' ఇదే అసోంకు చెందిన పదిహేడేళ్ల క్రీడాకారిణి జన్మోని కొన్వార్ మనస్సులో బలంగా నాటుకున్న ఆశయం. ఎన్ని కష్టాలు ఎదురైనా సాధనను సంకల్పాన్ని వదులు కోలేదామె. తమకున్న గేదెల్ని అమ్మినా, చేపల్ని అమ్మినా చేరుకోగల లక్ష్యన్ని చేరుకోవడమే ఆమె పని. ఇపుడామె భారతదేశం గర్వపడే విధంగా జాతీయ కరాటే ఛాంపయన్ షిప్‌లో 'స్వర్ణం'గెలిచి తలెత్తుకుని నిలిచేలా చేసింది. ఆమె కుటుంబానికి ఇప్పటికీ తలదాచుకునేందుకు ఇల్లు లేదు. అసోం వరదల్లో ఇల్లు కోల్పోయి, ఓ కట్ట మీద టార్పాలిన్ గూడు కింద జీవిస్తోంది. గత నెల 19న సంభవించిన వరదల్లో ఉన్న ఆమె ఇంటికి తగ్గరే ఉన్న ఆ ఒక్క ఆధారామూ చెల్లా చెదరైంది. నది కట్ట తెగడమే ఈ అనర్థానికి కారణం. అయినా ఆమె మనోసంకల్పం చెక్కు చెదరలేదు. కూడు, గుడ్డా, గూడు లేని వాళ్లకి ఆశలు, ఆశయాలు ఉండవనుకుంటే అది ముమ్మాటికీ పొరపాటే! ఆ విషయాన్ని 'జన్మోని' నిరూపించింది. అసోంలోని జోర్హాట్ జిల్లా బాగ్దోయి ఫోరియా గ్రామానికి చెందిన జన్మోని ఆగస్టు 7 నుంచి 9 వరకు ఢిల్లీలోని తల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరిగే కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక కాగానే ఆ కుటుంబం ఆనందానికి అంతేలేదు. తాము మూడేళ్లుగా పెంచుతున్న చేపలను అమ్మి ఆ డబ్బుతో 'జన్మోని'ని ఢిల్లీకి పంపాలని ఆమె కుటుంబం తలపెట్టింది. కానీ వరదల్లో తమకు తోడుగా ఉన్న చేపలు, కోళ్లు, బాతులు వరద



పాలవడంతో వారి ప్రణాళిక పూర్తిగా నాశమయ్యిందని ఆమె సోదరుడు కృష్ణమోని కొన్వార్ ఆవేదన వ్యక్తం చేశాడు. గతంలో ఓసారి ఆమె కరాటే పోటీల కెళ్లాల్సివస్తే తమకున్న రెండు గేదెలను అమ్మి మరీ పంపారు. ఐదేళ్ల వయసు నుంచే 'కరాటే'కు జన్మోని దాసురాలె. శిక్షణా సౌకర్యాలు లేకున్నా 2023 కాంస్యం 2025లో స్వర్ణం గెలిచింది. ఐతే జీవితంలో తన ఆశయం నిలబెట్టుకోవడం కోసం ఎదురీదుతు జన్మోనికి ఊహించని ఆర్థిక వత్తాసు లభించింది. వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న 'ఫిజిక్స్ వాలా' వ్యవస్థాపకుడు అలఖ్ పాండే 'జన్మోని'కి చేయూతనందించాడు. ఆమెతోపాటు 'జన్మోని. జట్టు' ఢిల్లీకి వెళ్లిరావడానికి ఖర్చులు, వసతి ఏర్పాటు చేసాడు. ఆమె కుటుంబానికి 2 లక్షల రూపాయల ఆర్థిక సాయం, సమకూర్చారు. అదే ఆమె 'జన్మోని'కి వెయ్యి ఏనుగుల బలమై ఢిల్లీ నుంచి 'స్వర్ణ'పతకంతో తిరిగొచ్చింది. ◻

# చపాతీలకు 'సెగ' వద్దు !



వళ్లు తగ్గాలని రాత్రిపూట భోజనానికి బదులు ఆయిల్ లేని చపాతీలు, రోటీలు తింటుంటారు. అయితే అవి మెత్తగా రావాలని పెనంమీద కాసేపు వేడి చేసి తరవాత నేరుగా స్టవ్ మంటపై కాలుస్తుంటారు. దీని గురించి తాజా పరిశోధన ఏమంటోందంటే. ఇలా నేరుగా పెద్ద మంటపై కాలచ్చడంవల్ల రోటీలోని కర్బన పదార్థాలు విచ్ఛిన్నమై కొద్దిస్థాయిలో హానికర అమైన్లూ హైడ్రోకార్బన్లూ ఉత్పత్తవుతాయి. వీటివల్ల శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు, క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది అంటున్నాయి. తాజా పరిశోధనలు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఈ విషయమై హెచ్చరికచేస్తోంది. మీరూ ఇలా చేస్తున్నారా.. కాబట్టి జాగ్రత్త.

# బ్రహ్మాదేవుని శాపం



రావణుడి కఠోర తపస్సుకు మెచ్చి బ్రహ్మాదేవుడు అనేక వరాలను ఇచ్చాడు. అలాంటి బ్రహ్మాదేవుని కుమార్తె అయిన పుంజికస్థల పట్ల రావణుడు తప్పుగా ప్రవర్తిస్తాడు. రావణుడి కారణంగా తనకి జరిగిన అవమానాన్ని గురించి ఆమె బ్రహ్మాదేవుడికి చెబుతుంది. దాంతో ఆగ్రహించిన బ్రహ్మాదేవుడు, పరస్త్రీని ఆమె అంగీకారం లేకుండా తాకినట్టయితే అతని శిరస్సు ముక్కలవుతుందని శపిస్తాడు. రావణుడు ఎన్ని విధాలుగా బ్రహ్మాదేవుడిని ప్రాధేయపడినా, తన వాక్కు ఫలించి తీరుతుందని చెబుతాడు. ఈ కారణంగానే .. సీతాదేవిని అపహరించి నప్పటికీ రావణుడు ఆమె సమీపంలోకి కూడా వెళ్లలేక పోతాడు. బ్రహ్మాదేవుడు రావణుడికి ఇచ్చిన శాపం, సీతాదేవికి వరంగా మారుతుంది. ఇలా నారదుడు .. వశిష్ఠుడు .. నందికేశ్వరుడు రావణుడికి ఇచ్చిన శాపాలు, ఆయన బారి నుంచి సీతమ్మ తల్లిని రక్షి స్తూ వచ్చాయి.

## తెర

# 'అగధ'ప్రీ రిలీజ్ ఈవెంట్




శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మాణంలో ఎం.ఎస్. రాజు తెరకెక్కించిన చిత్రం 'అగద'. ఈ మూవీలో కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి, ఉల్కా గుప్తా, జోవికా విజయ్‌కుమార్, భాను చందర్, షిజు, వనిత విజయ్‌కుమార్, రోషన్ బషీర్, శ్రేయా రాణి రెడ్డి, వైవా రాఘవ, రాబర్ట్ మాస్టర్, ఆర్నా ములేర్, కనకవ్వ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాని ఆగస్ట్ 14న భారీ ఎత్తున విడుదల చేయబోతున్నారు. ప్రముఖ నిర్మాత శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ..నాకు హనీ (ఎం.ఎస్. రాజు) మంచి స్నేహితుడు. 45 ఏళ్ల క్రితం మా జర్నీ మొదలైంది. మా నాన్న, వాళ్ల నాన్న నిర్మాతలే. ఇద్దరం సినిమా ఇండస్ట్రీలోనే పెరిగాం. సినిమాలే తీయాలని చిన్నప్పటి నుంచీ అనుకున్నాం. ఇద్దరం కోడి రామకృష్ణ గారితోనే జర్నీ ప్రారంభించాం. 1985, 1986 నుంచి ఎం.ఎస్. రాజుని గమనిస్తూనే ఉన్నాను. ఆయన ప్యాషనేట్ ప్రొడ్యూసర్. ప్రతీ క్రాఫ్ట్ మీద గ్రిప్‌ను సాధించారు. ఆయనకు ఆయనే ట్రెండ్ సెటర్‌గా మారారు. అన్ని రకాల చిత్రాల్ని ఆయన నిర్మించారు. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ.. .అగధ టీజర్, ట్రైలర్ అందరూ చూశారు. నేను చెప్పడానికి ఇంకా ఏమీ లేదు. నాకు ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మరీ ముఖ్యంగా కాశీ విశాలాక్షికి, అజయ్‌కి ధన్యవాదాలు. ఆగస్ట్ 15న సక్సెస్ మీట్ నిర్వహిస్తాం. లాస్ట్ ఓవర్‌లో 24 రన్స్ కొట్టాలంటే ఆ మ్యాచ్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. కానీ నేను సూపర్ ఓవర్‌లా సినిమాని తీశాను. అగధలో టెక్నికల్ టీం, ఆర్టిస్టుల టీం కలిసి పోటాపోటీగా చేశారు. సాయి రాజేష్ మాట్లాడుతూ..'రాజు వద్ద నేను రెండేళ్లు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశాను. సుమంత్ ఆర్ట్ ప్రొడక్షన్స్ ఆఫీస్‌లో కూర్చుని ఎన్నో నేర్చుకున్నాను.

# 'పళ్ళ బురుసు' 14న విడుదల




అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా సమర్పిస్తూ నిర్మిస్తున్న చిత్రం పళ్ళబురుసు. ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సుధాకర్ రెడ్డి, మురళీధర్‌గౌడ్, ప్రజ్వల్ యాద్మా, గోమతి రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ప్రమోషనల్ కంటెంట్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది,'పళ్ళ బురుసు' ఆగస్టు 14న థియేటర్లల్లో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ వేడుకకు కింగ్ నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ:'అందరికీ నమస్కారం. అన్నపూర్ణ స్టూడియోస్‌కు ఇది 50వ సంవత్సరం. నాన్నగారు ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో అద్భుతమైన చిత్రాలను నిర్మించాం. జాతీయ అవార్డులు అందుకున్న సినిమాలను కూడా రూపొందించాం. ఈ 50వ సంవత్సరం సందర్భంగా మా టీమ్ అంతా కలిసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నాం.అందులో భాగంగా డిస్ట్రిబ్యూషన్‌ను విస్తరించాం. నిర్మాత వివేక్ కృష్ణాని మాట్లాడుతూ: అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి పనిచేయడం నాకు ఎంతో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఈ సినిమా జర్నీలో వారితో కలిసి భాగం కావడం మరింత ఆనందంగా ఉంది. నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ: ఈ కథ మొదటిసారి విన్నప్పుడే సినిమాగా తీయాలని నిర్ణయించుకున్నాను. చాలా స్వీట్ స్టోరీ. ఇలాంటి కథను చేయడం ఎంతో సంతృప్తిని ఇస్తుంది. అన్నపూర్ణ స్టూడియోస్ ఎప్పుడూ కొత్త కథలనే వెతుకుతుంది. ఈసారి ఎపిక్ స్టూడియోస్‌తో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. డైరెక్టర్ ఉదయ్ చౌహాన్ మాట్లాడుతూ: నాకు పునర్జన్మనిచ్చిన అమ్మలాంటి ప్రొడక్షన్ హౌస్‌లు అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్‌కి థాంక్యూ సో మచ్. నేను చిన్నప్పటి నుంచి నాగార్జునకి వీరాభిమానిని. ఆయన సినిమాల ప్రభావం నాపై ఎంతో ఉంది. అలాంటి నాగార్జున గారికి నా కథ చెప్పే అవకాశం వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు.

# 'ఐ యామ్ గేమ్ 20న వరల్డ్‌వైడ్ రిలీజ్



దుల్కర్ సల్మాన్ హీరోగా నటిస్తున్న భారీ బడ్జెట్ ఫాంటసీ థ్రిల్లర్'ఐ యామ్ గేమ్' నుంచి ఫస్ట్ సింగిల్ విడుదలైంది. ఎవరే నువ్వే పేరుతో విడుదలైన ఈ పాటకు జేక్స్ బిజోయ్ సంగీతం అందించారు. తమిళ వెర్షన్‌కు విఘ్నేష్ రామకృష్ణ, హిందీ వెర్షన్‌కు నుమాన్ ఖోకర్, కన్నడ వెర్షన్‌కు హృదయ శివ సాహిత్యం అందించారు. కన్నడ వెర్షన్‌ను అనిరుద్ధ్ సుస్వరం ఆలపించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రం ఆగస్టు 20, 2026న ఓనం కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు పాన్ ఇండియా స్థాయిలో అద్భుతమైన స్పందన వచ్చింది. అద్భుతమైన విజువల్స్, హైవోల్టేజ్ యాక్షన్, థ్రిల్లింగ్ ఛేజ్ సీక్వెన్స్‌లతో ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. దక్షిణ భారతదేశంలోని 100కు పైగా లోకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా మలయాళ సినీ పరిశ్రమలోనే భారీ స్థాయిలో తెరకెక్కిన చిత్రాల్లో ఒకటిగా నిలవనుంది. దుల్కర్ సల్మాన్ కెరీర్‌లో ఇది 40వ చిత్రం కావడం మరో ప్రత్యేకత. ఆంటోనీ వర్గీస్, తమిళ నటుడుదర్శకుడు మిస్కిన్, కాయదు లోహర్, కతిర్, పార్థ్ తివారీ, సంయుక్త విశ్వనాథన్ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. జీ మ్యూజిక్ ఈ చిత్రం మ్యూజిక్ రైట్స్‌ను సొంతం చేసుకుంది.లోకః వంటి భారీ విజయాన్ని అందుకున్న తర్వాత వే2ఫేర్ ఫిల్మ్స్ నుంచి వస్తున్న చిత్రం కావడం, ఆర్డీఎక్స్ తర్వాత నహాస్ హిదాయత్ తెరకెక్కిస్తున్న సినిమా.

# 'ఓ మై డాగ్' కు మంచి స్పందన వచ్చింది



'ఓ మై డాగ్' సెలబ్రేట్ చేసుకునే సినిమా: శశికిరణ్ తిక్కఅమిత్ రాయ్ దర్శకత్వంలో పంకజ్ త్రిపాఠి, రాజేష్ కుమార్, గీతా అగర్వాల్ శర్మ, పవన్ మల్హోత్రా, శ్రీధర్ దూబే ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఓ మై డాగ్' రాజేష్ భరద్వాజ్, అమిత్ రాయ్, సనా వార్సీ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 7న విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంటూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ప్రెస్ మీట్ లో దర్శకుడు అమిత్ రాయ్ మాట్లాడుతూ..నేను హైదరాబాద్‌కు ఎన్నోసార్లు వచ్చాను. పవన్ కళ్యాణ్ , రామ్ చరణ్ గారు, దిల్ రాజు గారితో పాటు ఎంతోమందిని కలిశాను. కొన్ని ప్రాజెక్టులు కూడా అనుకున్నాం. కానీ అవి కుదరలేదు. ఇప్పుడు హైదరాబాద్ నుంచే నాకు పిలుపు రావడం చాలా సంతోషంగా ఉంది. ఇదే వేదికపై రానాని, వెంకటేష్ గారిని కలిశాను. దర్శకుడు శశికిరణ్ తిక్క మాట్లాడుతూ.. ఇది ప్రతి ఒక్కరూ సెలబ్రేట్ చేసుకోవాల్సిన సినిమా. అమిత్ రాయ్ గారు గతంలో తీసిన ఓ మై గాడ్ 2 ఎంత పెద్ద విజయం సాధించిందో మనందరికీ తెలుసు. ఇప్పుడు'ఓ మై డాగ్' కూడా అందరూ తప్పకుండా చూసి ఆనందించాల్సిన సినిమా. దేశం మొత్తం గర్వించాల్సిన సినిమా ఇది.

# 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' మూవీ ఫోటో రిలీజ్



వైవిధ్యమైన పాత్రల్లో నటించి విలక్షణ నటుడిగా పేరు పొందిన స్టార్ యాక్టర్ ఫహాద్ ఫాజిల్, ఇండస్ట్రీ హిట్ బాహుబలి మూవీని నిర్మించిన మేకర్స్‌తో పాటు సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతోన్న చిత్రం'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై తన తొలిసారి డిస్ట్రిబ్యూట్ చేసిన ప్రేమలు చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ప్యాషనేట్ ప్రొడ్యూసర్ ఎస్.ఎస్. కార్తికేయ.. ఇప్పుడీ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను ఇండియన్ సినిమాకు గర్వకారణం గా నిలిచిన బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాతలైన ఆర్కా మీడియాతో కలిసి రూపొందిస్తున్నారు.'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్' చిత్రానికి కొత్త దర్శకుడు శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌లో వెర్సటైల్ యాక్టర్ ఫహాద్ ఫాసిల్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, ఎస్.ఎస్. కార్తికేయ కలసి ఈ ఆసక్తికరమైన, కంటెంట్ రిచ్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాల భైరవ సంగీత సారథ్యంలో స్వరపరిచిన ఈ పాట సూరి అనే పాత్రను, అతని పిచ్చితనాన్ని ఓ ప్రత్యేకమైన సెటప్‌లో పరిచయం చేస్తుంది. కాల భైరవ, ఫహాద్ ఫాసిల్, స్వారా కలయికలో ఈ ప్రత్యేక మ్యూజిక్ వీడియోను మేకర్స్ రూపొందించారు. ముందు కూల్‌గా ప్రారంభమైన ఈ పాట..కాల భైరవ తన థంపింగ్ బీట్స్‌తో ఎంట్రీ ఇచ్చిన వెంటనే పూర్తి స్థాయి వాకీ మోడ్‌లోకి మారుతుంది. కాల భైరవ, ఎంసీ హరి కలిసి ఈ పాటకు క్యాచీ లిరిక్స్ అందించారు. సూరి డేర్‌డెవిల్ స్వభావాన్ని, అతనికి ప్రతి పని ఎంత ఈజీగా'కేక్‌వాక్'లా ఉంటుందనే విషయాన్ని చక్కటి పదాలతో హైలైట్ చేశారు. వీరిద్దరూ పాటను ఎనర్జీతో పాడుతూ మరింత స్పెషల్ అనిపించేలా చేశారు. ఫహాద్ ఫాజిల్ ఎనర్జీ, వైబ్స్ చూస్తే ఆవేశం సినిమాలోని రంగ చేట్టా పాత్ర గుర్తుకు వస్తుంది.

# మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా 'సర్దార్ సర్వాయి పాపన్న' ట్రైలర్ లాంచ్



బహుజన చక్రవర్తిగా కీర్తి పొందిన చారిత్రక వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర ఆధారంగా దర్శక నిర్మాత వెంకటేష్ గౌడ్ లింగంపల్లి రూపొందించిన మూవీ "సర్దార్ సర్వాయి పాపన్న". ఈ సినిమాను వి.జి.మూవీ మేకర్స్ సమర్పిస్తోంది. దీపక్ న్యాతి నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు వహిస్తున్నారు. ఈ మూవీ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆర్కే ఫిలింస్ ద్వారా ఈ నెల 21న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.తెలంగాణ ట్రాన్స్ పోర్ట్, బీసీ వెల్ఫేర్ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బహుజనుల రాజ్యం నెలకొల్పాలి, మన రాజ్యం మనమే పరిపాలించుకోవాలని పోరాటం సాగించిన ధీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. ఆయన కోటలను జయిస్తూ గోల్కొండ కోటదాకా వెళ్లిన ఆయన పోరాటం ఈ తరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. అలాంటి ధీరుడి చరిత్రతో వెంకటేష్ గౌడ్ సినిమా రూపొందించడం, ఆ సినిమాను రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేస్తుండటం సంతోషకరం. సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను పుస్తకరూపంలోనూ వెంకటేష్ గౌడ్ తీసుకొస్తుండటం అభినందనీయం. డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ మా సర్దార్ సర్వాయి పాపన్న సినిమా ట్రైలర్ ను మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా రిలీజ్ చేసుకోవడం ఆనందంగా ఉంది.

# సీనియర్ నటుడు కృష్ణేశ్వరరావు కన్నుమూత



తెలుగు చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసు కుంది. ప్రముఖ సీనియర్ నటుడు నాటక రంగ దిగ్గజం, రచయిత ఎల్లాప్రగడ సౌభాగ్య కృష్ణశ్వరరావు (వైఎస్ కృష్ణశ్వరరావు) కన్ను మూశారు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, చికిత్స పొందేతై మంగళవారం గుంటూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. పాఠశాల రోజులు తన సుదీర్ఘ ప్రస్థానంలో 1,500 కు పైగా నాటకాల్లో నటించారున కెరియర్‌లో ఎన్నో ప్రయోగాత్మక నాటకాలను రచించి ప్రదర్శించి రాష్ట్రస్థాయిలో అనేక మంది అవార్డును అందకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సినీ, నాటకరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు

# రోహిత్, విరాట్, బుమ్రా రీఎంట్రీ



## బంగ్లాదేశ్‌తో వన్డే సిరీస్‌కు టీమిండియా కూర్పు

**న్యూఢిల్లీ:** సెప్టెంబర్‌లో జరగనున్న బంగ్లాదేశ్ పర్యటనకు టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ సన్నాహాలు చేస్తోంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ కోసం దిగ్గజ ఆటగాళ్లతో కూడిన 15 మంది సభ్యుల భారత జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు విజ్ఞప్తి మేరకు సెప్టెంబర్ 1 నుంచి 6 వరకు జరగాల్సిన మూడు వన్డేల సిరీస్ కోసం టీమిండియాను పంపించేందుకు బిసిసిఐ కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరేందుకు సిద్ధమైంది. కేంద్ర సర్కార్ నుంచి పచ్చజెండా లభిస్తే భారత జట్టు వెంటనే అక్కడకు పయనమవుతుంది. ఈ క్రమంలోనే సీనియర్లు, యంగ్ ప్లేయర్ల కలయికతో ఒక పటిష్టమైన 15 మంది సభ్యుల స్క్వాడ్‌ను సిద్ధం చేసేందుకు సెలెక్టర్లు కసరత్తు చేన్నారు. ముఖ్యంగా లార్డ్స్‌లో సెంచరీతో పాత ఫామ్‌ను రీ క్రియేట్ చేసిన రోహిత్ శర్మకు మరో అవకాశం దక్కే సూచనలు కనిపిస్తున్నాయి. యశస్వి జైస్వాల్‌ను బ్యాకప్ ఓపెనర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ వన్డే సిరీస్‌కు శుభ్‌మన్ గిల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే యోచనలో మేనేజ్‌మెంట్ ఉంది. వైస్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ వ్యవహరించే అవకాశాలను పరిశీలిస్తోంది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కూడా ఈ జట్టులో కొనసాగనున్నాడు. వికెట్ కీపింగ్ విభాగంలో మొదటి ప్రాధాన్యతగా కేఎల్ రాహుల్ ఉండగా, రెండో వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్‌ను జట్టులోకి తీసుకోనున్నారు. యువత, అనుభవజ్ఞుల కలయికతో కూడిన ఈ బ్యాటింగ్ లైనప్ బంగ్లాదేశ్ పరిస్థితుల్లో భారీ స్కోర్లు సాధించడానికి బాగా ఉపయోగపడుతుందని సెలక్టర్లు భావిస్తున్నారు. రైట్ ఆర్మ్ పేస్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌తో మళ్లీ వన్డే జట్టులోకి అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా మారింది. దీంతో శివమ్ దూబేకు చోటు దక్కకపోవచ్చు.

స్పిన్ విభాగంలో ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లతో పాటు ప్రధాన స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ఎంపికయ్యే సూచనలు ఉన్నాయి. పేస్ విభాగానికి స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నాయకత్వం వహించనున్నాడు. అతడితో పాటు మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, గుర్నూర్ బ్రార్ బౌలింగ్ దళంలో ఉండే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రసిద్ధ్ కృష్ణస్థానంలో సిరాజ్‌కు జట్టులో చోటు లభించవచ్చని భావిస్తున్నారు. యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా, ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ ఇంకా గాయాల నుంచి పూర్తిస్థాయిలో కోలుకోలేదు. దాంతో ఈ ఇద్దరు ఆటగాళ్లు బంగ్లాదేశ్ పర్యటనకు అందుబాటులో ఉండటం కష్టమేనని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.




## వెస్టిండీస్ కొంపముంచిన అఫ్గాన్

### వరల్డ్ కప్ డైరెక్ట్ క్వాలిఫికేషన్‌కు దూరం

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఒకప్పుడు క్రికెట్ రారాజుగా వెలుగొందిన వెస్టిండీస్ దారుణమైన ప్రదర్శనతో పాతాళానికి పడిపోయి వన్డే ప్రపంచకప్ 2027 టోర్నీకి నేరుగా అర్హత సాధించలేకపోయింది. గత వన్డే ప్రపంచకప్ 2023 టోర్నీ కూడా వెస్టిండీస్ నేరుగా అర్హత సాధించకపోగా, క్వాలిఫయర్స్‌లోనూ పసికూన జట్లతో ఓడి టోర్నీకి దూరమైంది. క్వాలిఫయర్స్‌లోనూ పేలవ ప్రదర్శనతో టోర్నీకి అర్హత సాధించలేదు. ఇప్పుడు కూడా వెస్టిండీస్ అదే పరిస్థితి ఎదుర్కొంటుంది. తాజాగా ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ విజయం సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకుంది. దాంతో వెస్టిండీస్ ఆశలు ఆవిరయ్యాయి. వన్డే ర్యాంకింగ్స్ ద్వారా నేరుగా టోర్నీకి అర్హత సాధించడానికి ఐసిసి ఈ సెప్టెంబర్ 30 వరకు డెడ్‌లైన్ విధించింది. వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్8లో ఉన్న దేశాలు నేరుగా అర్హత సాధిస్తాయి. ఈ 8 జట్లతో పాటు ఆతిథ్య దేశాలుగా ఉన్న సౌతాఫ్రికా, జింబాబ్వే కూడా క్వాలిఫై అవుతాయి. 8వ స్థానంతో అఫ్గాన్ నేరుగా క్వాలిఫై అయ్యింది. ప్రస్తుతం వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో పదో స్థానంలో ఉన్న కరేబియన్ టీమ్, కటాఫ్ తేదీ నాటికి రెండు వన్డేలు మాత్రమే ఆడనుంది. ఆ రెండూ సెప్టెంబర్‌లో భారత్‌తోనే జరగనున్నాయి. ఆ రెండింటిలో గెలిచినా వెస్టిండీస్ టాప్8లో నిలవదు. ఆ జట్టు ప్రపంచకప్‌లో ఆడాలంటే ఫిబ్రవరి 2027లో నిర్వహించే క్వాలిఫయర్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. లేదంటే వరుసగా రెండోసారి ప్రపంచకప్‌నకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

## రేప్ కేసులో.. ఢిల్లీ క్యాపిటల్స్ ప్లేయర్ అభిషేక్ పోరెల్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** భారత దేశవాళీ క్రికెట్‌తో పాటు, ఐపిఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మెరుపులు మెరిపించిన యువ స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల్లో చిక్కుకున్నాడు. రేప్, వేధింపుల కేసులో అభిషేక్‌ను పశ్చిమ బెంగాల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. పెళ్లిచేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకుని మోసం చేశాడని, బెదిరింపులకు పాల్పడ్డాడని కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని హుగ్లీలోని మొగ్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు పోలీసులు హుగ్లీలోని ఎమామి సిటీలో 23 ఏళ్ల పోరెల్‌ను అదుపులోకి తీసుకుని, వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం చించురా న్యాయ స్థానంలో హాజరుపరిచారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం, 2023 జనవరి నుంచి అభిషేక్ పోరెల్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పి, పోరెల్ తనతో శారీరక సంబంధం పెట్టుకున్నాడని సదరు విద్యార్థిని ఆరోపించింది. తాము కలిసి విదేశాలకు సైతం వెళ్లామని తెలిపింది. యేడాది కాలంగా వీరి మధ్య విభేధాలు తలెత్తాయి. ప్రశ్నించిన తనపై దాడి చేసి, బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తన ఫిర్యాదులో తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ కేసులో పోలీసులు సరైన చర్యలు తీసుకోవడం లేదని బాధితురాలు కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. ధర్మాసనం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ, నిందితుడైన అభిషేక్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, అతడి వద్ద ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను సీజ్ చేయాలని బెంగాల్ పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీసులు కీలక ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌ను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి పోరెల్‌ను కస్టడీలోకి తీసుకున్నారు.

## సింక్‌ఫీల్డ్ కప్.. డ్రాతో ప్రజ్ఞానంద ప్రారంభం




**న్యూఢిల్లీ:** గ్రాండ్ చెస్ టూర్‌లోని చివరికి ముందు జరిగే ఈవెంట్ అయిన సింక్‌ఫీల్డ్ కప్ మొదటి రౌండ్‌లో, భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అమెరికన్ జీఎం శామ్యూల్ సెవియన్‌తో డ్రా చేసుకుని తన ప్రయాణాన్ని పారంభించాడు.

మంగళవారం నల్ల పావులతో ఆడుతూ, ప్రజ్ఞానంద చాలావరకు నియంత్రణలో ఉన్న ఆటలో రూయ్ లోపెజ్ యొక్క ఆర్ఖంగెల్స్క్ వేరియేషన్‌ను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొన్నా ఇరు పక్షాలలో ఏ ఒక్కరికీ గెలిచేందుకు గట్టి అవకాశాలు లేకుండా పోయాయి. ఈ విధంగానే 48 ఎత్తుల పాటు సాగిన ఈ పోరు డ్రాగా ముగిసింది. 10 మంది ఆటగాళ్లు పాల్గొని, తొమ్మిది రౌండ్లు జరిగే ఈ టోర్నమెంట్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ ఫాబియానో కరువానా ఏకైక విజేతగా నిలిచాడు. ఆట మధ్యలో తన ప్రత్యర్థి ఒక పాన్‌ను కోల్పోయేలా చేసిన వ్యూహాత్మక తప్పిదాన్ని సద్వినియోగం చేసుకుని, ఈ అమెరికన్ ఆటగాడు డచ్ ఆటగాడైన జోర్డెన్ వాన్ ఫోరెస్ట్‌ను ఓడించాడు. కరువానా తనదైన కచ్చితత్వంతో వస్తుపరమైన ఆధిక్యాన్ని సద్వినియోగం చేసుకుని, 55 ఎత్తుల తర్వాత పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుని, టోర్నమెంట్‌లో తొలి ఆధిక్యాన్ని సాధించాడు. ప్రపంచ ఛాంపియన్‌షిప్ పోటీదారు, ఉజ్బెకిస్తాన్‌కు చెందిన జవోఖిర్ సిందరోవ్, యునైటెడ్ స్టేట్స్‌కు చెందిన లెవాన్ అరోనియన్‌తో డ్రా చేసుకున్నాడు. నెదర్లాండ్స్‌కు చెందిన అనీష్ గిరి మరియు ఫ్రాన్స్‌కు చెందిన మాక్సిమ్ వాచియర్‌లగ్రావ్ రెండవ డ్రాను పూర్తి చేశారు. రూక్‌అండ్‌పాన్స్ ఎండింగ్‌కు చేరుకున్న ఈ మ్యాచ్, ఆటగాళ్లు స్టిట్ పాయింట్‌కు అంగీకరించే వరకు పోటీగా కొనసాగింది.

## వన్డే వరల్డ్ కప్: అఫ్ఘాన్‌కు అర్హత

### ఐర్లాండ్‌పై 3 వికెట్ల తేడాతో గెలుపు



**న్యూఢిల్లీ:** ఐర్లాండ్‌పై విజయం సాధించి అఫ్గానిస్థాన్ వన్డే ప్రపంచ కప్–2027కు అర్హత సాధించింది. వన్డే మ్యాచ్‌లో అఫ్గాన్ 3 వికెట్లు తేడాతో ఐర్లాండ్‌ను ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఐర్లాండ్ 46.3 ఓవర్లలో 206 పరుగులకు ఆలౌట్ అయింది. గావిన్ హోయ్ 36 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, కేడ్ కారనఇమచల్ 32, జై మూంద్రా 31తో పర్వాలేదనిపించారు. అఫ్గాన్ బౌలర్లలో రషీద్‌ఖాన్, గజన్‌ఫర్ చెరో 3 వికెట్లతో విజృంభించగా, యామిన్ అహ్మద్‌జయ్ 2 వికెట్లు పడగొట్టాడు. అనంతరం అఫ్గానిస్తాన్ 44.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 207 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. ఓపెనర్ రహమనుల్లా గుర్బాజ్ 71 పరుగులతో అర్ధ సెంచరీ చేసి రాణించగా, చివర్లో రషీద్‌ఖాన్ 37 పరుగులతో నాటౌట్‌గా మెరుపు ఇన్నింగ్స్ ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఐర్లాండ్ బౌలర్లలో గావిన్ హాక్షయ్ 4 వికెట్లు పడగొట్టాడు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో అఫ్గానిస్తాన్ 2–0తో ఆధిక్యంలో నిలిచింది.

## స్మాల్‌క్యాప్ ఫండ్లలో రికార్డు స్థాయి పెట్టుబడులు..

### డెట్ ఫండ్లకు భారీగా నిధులు




**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పథకాలలో పెట్టుబడులు గత జులైలో కొంత మందగించాయి. జూన్‌లో రూ.28,973 కోట్లుగా ఉన్న మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ ఇన్‌ఫ్లోస్ జులైలో 15 శాతం తగ్గి రూ.24,697 కోట్లకు చేరాయి. ఈక్విటీ ఫండ్ పెట్టుబడులు మొత్తం మీద తగ్గినప్పటికీ, అన్ని విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కనిపించలేదు. స్మాల్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను విశేషంగా ఆకర్షించాయి. జులైలో ఈ పథకాల్లోకి రూ.7,767 కోట్ల తాజా పెట్టుబడులు వచ్చాయి. ఈ విభాగానికి ఒక నెలలో వచ్చిన అత్యధిక పెట్టుబడులు ఇవే కావడం విశేషం. జూన్‌తో పోలిస్తే స్మాల్‌క్యాప్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు 39 శాతం పెరిగాయి. దీంతో 11 ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ విభాగాల్లో నెలవారీ వృద్ధి పరంగా స్మాల్‌క్యాప్ ఫండ్లు అగ్రస్థానంలో నిలిచాయి. మిడ్‌క్యాప్ ఫండ్లు రూ.6,192 కోట్ల ఇన్‌ఫ్లోతో రెండో స్థానంలో నిలిచాయి. ఫ్లెక్సీ క్యాప్ ఫండ్లలోకి రూ.4,709 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. లార్జ్ అండ్ మిడ్‌క్యాప్, మల్టీక్యాప్ ఫండ్లు కూడా జూలైలో సానుకూల ఇన్‌ఫ్లోలను నమోదు చేశాయి. ఈ రెండు విభాగాల్లో వరుసగా రూ.3,425 కోట్లు, రూ.3,227 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అయితే లార్జ్‌క్యాప్ ఫండ్ల నుంచి అత్యధికంగా రూ.1,321 కోట్లను ఇన్వెస్టర్లు ఉపసంహరించుకున్నారు. ఈఎల్ఎస్ఎస్ ఫండ్ల నుంచి రూ.959 కోట్ల ఔట్‌ఫ్లో నమోదైంది. డివిడెండ్‌యీల్డ్ ఫండ్లు, వ్యాల్యూ/కాంట్రా ఫండ్ల నుంచి కూడా వరుసగా రూ.169 కోట్లు, రూ.144 కోట్ల నిధులు బయటకు వెళ్లాయి. ఫోకస్డ్ ఫండ్లలోకి వచ్చిన పెట్టుబడులు గత నెలతో పోలిస్తే 43 శాతం తగ్గడం కూడా గమనార్హం. మరోవైపు మల్టీక్యాప్ ఫండ్లలో ఇన్‌ఫ్లోస్ 5 శాతం పెరగగా, స్మాల్‌క్యాప్ ఫండ్లు 39 శాతం వృద్ధితో డెట్ ఫండ్లలోకి ఏకంగా రూ.1.87 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు రెండు నెలల్లో కలిపి రూ.2.06 లక్షల కోట్ల ఔట్‌ఫ్లో నమోదైన నేపథ్యంలో జూలై గణాంకాలు భారీ రికవరీని సూచిస్తున్నాయి.

## వేదాంత కొత్త కంపెనీల్లోకి రూ.1,300 కోట్ల నిధులు!




**న్యూఢిల్లీ,ఆగస్టు 11:** వేదాంత గ్రూప్ నుంచి విడిపోయి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీలు వేదాంత అల్యూమినియం మెటల్, వేదాంత ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్, వేదాంత పవర్‌లు సెప్టెంబర్ 2026లో జరగనున్న ఎన్ఎస్ఇ సూచీల పునర్వ్యవస్థీ కరణతో భారీగా ప్రయోజనం పొందే అవకాశం ఉందని అంచనాలు వెలువడ్డాయి. ఈ నాలుగు కంపెనీల్లోకి కలిపి సుమారు రూ.1,300 కోట్ల వరకు నిధులు రావచ్చు.ఇది ముఖ్యంగా ఇండెక్స్ ఫండ్లు, ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్లు వంటి ఎన్ఎస్ఇ సూచీలను అనుసరించే పాసివ్ ఫండ్లపై ప్రభావం చూపనుంది. ఒక స్టాక్ సూచీలో చేరినప్పుడు, ఆ సూచీని అనుసరించే ఫండ్లు తమ పోర్ట్‌ఫోలియోలను సర్దుబాటు చేసి కొత్తగా చేరిన షేర్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో ఆయా కంపెనీల షేర్లకు అదనపు డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. వేదాంత అల్యూమినియం మెటల్‌కే అత్యధిక వాటా దక్కనుంది. వేదాంత పవర్, వేదాంత ఐరన్ అండ్ స్టీల్ కంపెనీలకు మాత్రం తక్కువ స్థాయిలో పాసివ్ ఫ్లోస్ ఉండే అవకాశం ఉందని పేర్కొంది. ఇప్పటికే ఈ కంపెనీల షేర్లను కలిగిఉన్న ఇన్వెస్టర్లకు స్వల్పకాలంలో ఇది సానుకూల పరిణామంగా మారవచ్చు. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి కొనుగోళ్లు పెరగడం వల్ల షేర్లలో లిక్విడిటీ మెరుగుపడటంతో పాటు ధరలకు కొంత మద్దతు లభించే అవకాశం ఉంది. వేదాంత గ్రూప్ డీమెర్జర్ తర్వాత ఈ కంపెనీలు ప్రత్యేక సంస్థలుగా ఏర్పడిన నేపథ్యంలో ఈ పరిణామానికి మరింత ప్రాధాన్యత ఉంది. కొత్తగా పెట్టుబడి పెట్టాలనుకునే వారు కేవలం ఇండెక్స్ రీబ్యాలెన్సింగ్ ద్వారా వచ్చే అంచనా నిధుల ప్రవాహాన్ని ఆధారంగా చేసుకుని నిర్ణయం తీసుకోకూడదని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా, సూచీల రీబ్యాలెన్సింగ్ ఈ నాలుగు కొత్త వేదాంత కంపెనీల షేర్లకు డిమాండ్ పెంచే ఉత్ప్రేరకంగా పనిచేసే అవకాశం ఉన్నప్పటికీ, ఇది షేర్ ధర పెరుగుదలకు పెట్టుబడి హామీ మాత్రం కాదని నిపుణులు చెబుతున్నారు.

## వార్ ఎఫెక్ట్... నష్టాల్లో ముగిసిన బెంచ్‌మార్క్ సూచీలు




**ముంబయి, ఆగస్టు 11:** ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా–ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంపై ఆశలు సన్నగిల్లడంతో మళ్లీ భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొనడం దేశీయ స్టాక్ మార్కెట్లపై ప్రభావం చూపింది. మంగళవారం కీలక బెంచ్ మార్క్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. బ్యారెల్ ముడిచమురు ధర 90 డాలర్లకు చేరువ కావడంతో భారత్ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, కంపెనీల లాభాల మార్జిన్లపై ఆందోళనలు పెరిగాయి. బలహీనమైన అంతర్జాతీయ మార్కెట్ సంకేతాలు కూడా దేశీయ మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి. ఎఫ్ఎంసీజీ, మెటల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి నెలకొనడంతో నిఫ్టీ ఒత్తిడికి లోనయింది.

ఫార్మా, హెల్త్‌కేర్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బిఎస్ఇ సెన్సెక్స్ 388.19 పాయింట్లు నష్టపోయి 78,154.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 112.10 పాయింట్లు శాతం తగ్గి 24,471.70 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో మహీంద్ర 1.62 శాతం, ఎయిర్‌టెల్ 1.43 శాతం,యాక్సిస్‌బ్యాంకు 1.40 శాతం చొప్పున క్షీణించాయి. బిఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ దాదాపు మార్పు లేకుండా ముగియగా, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.24 శాతం లాభపడింది. బిఎస్ఇలో మొత్తం 2,033 షేర్లు లాభపడగా, 2,279 షేర్లు నష్టపోయాయి. మరో 209 షేర్లలో ఎలాంటి మార్పు కనిపించలేదు. కమోడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర 2.14 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 89.86 డాలర్లకు చేరింది.ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. గత సెషన్‌లో 95.3050 వద్ద ముగిసిన పాక్షిక కన్వర్టబుల్ రూపాయి,

మంగళవారం 95.4450 వద్ద ట్రేడైంది.ఎంసిఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.50 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,53,869కు చేరాయి.మ్యాట్రిమోనీ డాట్‌కామ్ షేరు 10.34 శాతం ఎగిసింది. కోల్టేపాటిల్ షేరు 11.48 శాతం దూసుకెళ్లింది.ఇండ్ స్విఫ్ట్ ల్యాబ్స్ షేరు 20 శాతం లాభపడింది. త్రివేణి టర్బైన్స్ షేరు 5.63 శాతం పడిపోయింది.

కంపెనీ ఏకీకృత నికర లాభం 20.78 శాతం తగ్గి రూ.51.1 కోట్లకు చేరినట్లు ప్రకటించడంతో షేరుపై ఒత్తిడి నెలకొంది. వొడాఫోన్ ఐడియా షేరు 0.23 శాతం తగ్గింది. 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టెలికాం సంస్థ ఏకీకృత సర్దుబాటు చేసిన నికర నష్టం రూ.5,361.99 కోట్లకు తగ్గింది.భారత్ ఫోర్జ్‌షేరు 2.01 శాతం నష్టపోయింది.ఫినోలెక్స్ కేబుల్స్ షేరు 14.64 శాతం పెరిగి ర్యాలీ తీసింది.

## మూడు బిలియన్ డాలర్ల నిధుల సమీకరణలో ఐదు బ్యాంకులు




**ముంబయి,ఆగస్టు 11:** భారతీయ ప్రైవేట్ బ్యాంకులు విదేశీ మార్కెట్ల నుంచి భారీగా నిధులు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఐదు బ్యాంకులు సుమారు 3 బిలియన్ డాలర్లు సమీకరించేందుకు డాలర్ బాండ్లు లేదా విదేశీ రుణాల జారీని పరిశీలిస్తున్నాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ డాలర్ బాండ్ల జారీ ద్వారా గరిష్ఠంగా 1 బిలియన్ డాలర్లు సమీకరించాలని యోచిస్తోంది. మరో నాలుగు బ్యాంకులు ఫెడరల్‌బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఆర్బీఎల్ బ్యాంకు, యెస్ బ్యాంక్ ఒక్కొక్కటి 250 మిలియన్ డాలర్ల నుంచి 500 మిలియన్ డాలర్ల వరకు బాండ్లు లేదా రుణాల ద్వారా సమీకరించేందుకు పరిశీలిస్తున్నాయి. భారతీయ రూపాయిపై ఒత్తిడిని తగ్గించి, దేశంలోకి డాలర్ల ప్రవాహాన్ని పెంచేందుకు ఆర్బీఐ తీసుకుంటున్న చర్యలకు ప్రైవేట్ బ్యాంకుల తాజా విదేశీ నిధుల సమీకరణ ప్రణాళికలు ప్రత్యక్ష స్పందనగా నిపుణులు భావిస్తున్నారు.హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌కు ఇది రెండో డాలర్ బాండ్ జారీ కానుంది.

ఈ యేడాది జూన్‌లో ఐదేళ్ల కాలపరిమితి కలిగిన డెట్ సేల్ ద్వారా బ్యాంక్ 750 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఆర్‌బిఐ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో చేపట్టిన 750 మిలియన్ డాలర్ల బాండ్ జారీకి ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. కరెన్సీ మారకం రేటు, భవిష్యత్తులో రుణాల రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన రిస్కులు ఉన్నాయని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.మరోవైపు, చమురు ధరలు అధికంగా ఉండటం, అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొనడంతో రూపాయిపై ఒత్తిడి కొనసాగుతున్న సమయంలో విదేశీ మారక ద్రవ్య లిక్విడిటీని పెంచి, రూపాయిపై ఒత్తిడిని తగ్గించేందుకే ఆర్‌బిఐ డాలర్ ఇన్‌ఫ్లోలను ప్రోత్సహిస్తోందని మరికొందరు విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ గతంలో జారీ చేసిన 750 మిలియన్ డాలర్ల బాండ్ ఆర్‌బిఐ ప్రత్యేక స్వాప్ సదుపాయాన్ని వినియోగించిన తొలి బ్యాంకింగ్ లావాదేవీగా నిలిచింది. ఆర్‌బిఐ స్వాప్ సదుపాయం గడువు ముగిసిన తర్వాత హెడ్జింగ్ ఖర్చులు పెరిగితే విదేశీ కరెన్సీ రుణాలపై అదనపు భారం పడే అవకాశం ఉందని, కరెన్సీ మారకం రేటు, రీఫైనాన్సింగ్‌కు సంబంధించిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకులు విదేశీ రుణాల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుందని వారు సూచిస్తున్నారు.

## భారత్‌లో కుటుంబ వ్యాపారాలు రూ.138 లక్షల కోట్లు

### నంబర్ వన్ స్థానంలో జిందాల్ కుటుంబం

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత్‌లో కుటుంబ వ్యాపార సంస్థల విలువలు భారీగా పెరుగుతున్నాయి. దేశంలోని టాప్ 300 కుటుంబ వ్యాపారాల సంయుక్త విలువ 1.46 ట్రిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.138 లక్షల కోట్లు కు చేరుకుంది. 2026 బార్క్లేస్ ప్రైవేట్ క్లయింట్స్ హురున్ ఇండియా మోస్ట్ వాల్యూబుల్ ఫ్యామిలీ బిజినెసెస్ జాబితాలో భారీ పరిశ్రమలు, ఇంజినీరింగ్, తయారీ రంగాల్లోని కుటుంబ వ్యాపారాలు అత్యధికంగా విలువను సృష్టించగా టెక్నాలజీ, రియల్ ఎస్టేట్, వినియోగదారుల వ్యాపారాల విలువలు గత మూడేళ్లలో తగ్గినట్లు నివేదిక తెలిపింది.జిందాల్ కుటుంబం టాప్‌లో జెఎస్‌డబ్ల్యు స్టీల్ అధినేత జిందాల్ కుటుంబం అత్యధిక విలువను సృష్టించింది. గత మూడేళ్లలో రూ.3.3 లక్షల కోట్ల విలువను జోడించడంతో కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ 70 శాతం పెరిగి రూ.8.02 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతకు చెందిన అనిల్ అగర్వాల్ కుటుంబం రూ.3.03 లక్షల కోట్ల విలువను జోడించింది. కుటుంబ వ్యాపారాల మొత్తం విలువ రూ.4.45 లక్షల కోట్లకు చేరింది. వేదాంతను ఐదు వేర్వేరు లిస్టెడ్ సంస్థలుగా విభజించడం ఈ పెరుగుదలకు ప్రధాన కారణమైంది. కుమార మంగళం బిర్లా కుటుంబం రూ.2.75 లక్షల కోట్ల విలువను జోడించింది. దీంతో ఆదిత్య బిర్లా గ్రూప్ వ్యాపారాల మొత్తం విలువ 51 శాతం పెరిగి రూ.8.14 లక్షల కోట్లకు చేరింది. మహీంద్రా కుటుంబం రూ.1.69 లక్షల కోట్ల విలువను జోడించగా, ఇది 49 శాతం వృద్ధి. దీంతో మొత్తం విలువ రూ.5.15 లక్షల కోట్లకు చేరుకుంది.నాదర్ కుటుంబానికి భారీ నష్టంకాగా, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్‌కు చెందిన నాడార్ కుటుంబం మూడేళ్లలో రూ.1.39 లక్షల కోట్ల విలువ తగ్గి రూ.2.95 లక్షల కోట్లకు పడిపోయింది. డిఎల్‌ఎఫ్ రాజీవ్ సింగ్ కుటుంబం రూ.51,000 కోట్ల మేరవిలువ కోల్పోవడంతో మొత్తం విలువ రూ.1.53 లక్షల కోట్లకుపడిపోతే ఏసియన్‌పెయింట్స్ యజమానులు చోక్సీ, వకీల్ కుటుంబాలు రూ.23,000 కోట్లను కోల్పోయి రూ.2.48 లక్షల కోట్లకు చేరింది. గోద్రెజ్ ఇండస్ట్రీస్ కుటుంబం రూ.19,300 కోట్ల విలువను కోల్పోయింది. అదానీ కుటుంబం విలువ రూ.19.6 లక్షల కోట్లు, సునీల్ భారతి మిట్టల్ కుటుంబం విలువ రూ.12.1 లక్షల కోట్లు, దిలీప్ సంఘ్వీ కుటుంబం విలువ రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.